

సృజన

......వాళ్ళు చరిత్రను వక్రీకరించారు
మేం దాన్ని చెత్తకుప్పల మీదకు విసిరేశాం
నీ పాత్రను వక్రీకరించారు వాళ్ళు
మేం నిశితంగా ముఖంమీద కొట్టి
దాన్ని నిరాకరించాం
విశ్వమంతా ఎదిగిన నిన్ను
గుప్పిట్లో బంధించాలని చూస్తున్నారు వాళ్ళు
మేం తెగేసి చెప్పాం వాళ్ళకు
సూర్యుడి ముందు దివిటీలు
నిలబడలేవని
ప్రపంచాన్ని రెండోసారి మేల్కొల్పిన
నీ ప్రజ్ఞాశిక మాతోనే వుంది !
నువ్వు కార్చిన రక్తం నీ గాయాలూ
మా కళ్ళముందు కదుల్తూనే వున్నాయి
మేం జాగరూకతతోనే వున్నాం
నీ ఆలోచనల్ని మోసుకుంటూ.......

ఆగస్టు/సెప్టెంబర్ 1983

సృజన

142/143 ఆధునిక సాహిత్య వేదిక ఆగస్టు/సెప్టెంబర్ 1983

కవర్ : మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి ! సెప్టెంబర్ 9 మావో వర్ధంతి

అట్టవెనుక : 1. కామ్రేడ్స్ గంగారాం, పెద్దిశంకర్ స్మారక స్థూపం :
i. నిర్మాణంలో ii. పోలీసులు నేలమట్టం చేసాక (చూ. దూదిపులి పే. 73)
2. కామ్రేడ్ పల్లె కనుకయ్య (చూ. 'ఒరిగిన అన్నల కెన్నీయలో' పే. 78, పల్లెగుండె స్మృతిగీతం)

సృజన నిర్వహణ ఈ సంచిక రు. 3

హనుమకొండ - 506 001 సాహితీమిత్రులు సంవత్సర చందా రు. 20

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

Working Editor : Varavararao

‘ ....దేశమే జెయిలాయెరా ’

అధికారంలోకి వచ్చిన తొమ్మిదినెలల్లోనే ఎప్పుడోగానీ ఏర్పాటుచేయని అసెంబ్లీ సమావేశాల్లో ఇప్పటికి మూడుసార్లు ఎన్టీఆర్ రైతాంగ ఉద్యమాన్ని (అసెంబ్లీ భాషలో నక్సలైట్, తీవ్రవాద, ఉగ్రవాద, రాడికల్, హింసావాద కార్యకలాపాలను) ఏ రూపంలోనయితే ఆరూపంలో అణచివేస్తానని సభ్యులకు హామీఇచ్చాడు. ‘తుపాకీని తుపాకీతోనే ఎదుర్కొంటాను’ అని కూడ మొదటిసారే అసెంబ్లీలో తన పాలసీ ఏమిటో ప్రకటించాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించడానికి ఏర్పడిందనుకునే అసెంబ్లీలో అందుకు అందరు సభ్యులూ హర్షించారు. ఇందరి బలంతో ఇంక ఆయన మందిమీదపడ్డాడు.

ఇంద్రవెల్లి గురించి ‘ఓపెన్‌ట్రాజెడీ’ అని ఆవేదనచెందిన ‘రాజయోగి’ గిరిజన హరిజన రైతాంగం చైతన్యవంతంకావడాన్ని ససేమిరా సహించడంలేదు. ఆ చైతన్యం చేసుకావలాలోవున్నపుడు రత్నపూర్‌లో కాల్చేసాడు. నీటిలో చేపలా చలనంచూపితే అన్నపురెడ్డిపల్లిలో గాలం వేసాడు. హిరణ్యాక్ష భూస్వామ్యాన్ని, సాంస్వామ్యాన్ని ప్రశ్నిస్తూ లంబాడీభాష రాడికల్ భాషగామారితే చంద్రగిరితండాలో [illegible]ను నిషేధించాడు. అన్నంతినేహక్కు కష్టంచేసేవానికే ఉన్నదన్నందుకు చెన్నూరు హరిజనుల నోటిముందరి బుక్కలో నెత్తురుచల్లాడు.

కరీంనగర్‌లో జూన్‌నెలలో రాష్ట్ర రైతుకూలీమహాసభలు జరిగిననాడు ‘కల్లోలిత ప్రాంతాలప్రకటన’ను రద్దుచేస్తానని రాయించుకున్న ‘మానవతావాది’ సెప్టెంబర్ అసెంబ్లీ సమావేశాల్లో పదితాలూకాల ‘కల్లోలం’ దాదాపు పదిజిల్లాలకు విస్తరించింది గనుక, ఈ విస్తరణ ఇటు మహారాష్ట్రకు, అటు మధ్యప్రదేశ్‌కుకూడా ప్రమాదకరంగా పరిణమించింది గనుక మూడురాష్ట్రాలు ఉమ్మడిగా జాగరూకత వహిస్తాయని ప్రకటిస్తున్నాడు. తీవ్రవాద పార్టీలు అనేపేరుతో విప్లవ పార్టీలను నిషేధిస్తానని పార్లమెంటరీ పార్టీలకు హామీకూడ ఇస్తున్నాడు. ‘జోహార్లు’ నించి ‘నిషేధం’ దాకా తొమ్మిది నెలల్లోనే పయనించాడు, చింతపెల్లి ఏజెన్సీ ఏరియాలో ‘ఎన్‌కౌంటర్’ చేయదలుచుకున్న రైతాంగ కార్యకర్తల పేర్లు ఉన్నత పోలీసుఅధికార్లు పరోక్షంగా ప్రకటిస్తూనేవున్నారు.

వరంగల్, కరీంనగర్, ఆదిలాబాదు, నిజామాబాదు జిల్లాల్లో 85 గ్రామాల్లో పోలీసుక్యాంపులుపెట్టి దాదాపు వెయ్యిగ్రామాల్లో రోజూ పోలీసుల స్వైరవిహారం చేస్తున్నారు.

వరదలువచ్చి కుంటలు, చెరువులు కొట్టుకపోయే విషయంగానీ, పూరిగుడిసెలు, పాతఇళ్ళు కూలిపోయే విషయంగానీ, వాగులు వంకలుపొంగి వంతెనలు, రోడ్లు, కూలిపోయి, తుడుచుకపోయే విషయంగానీ, ప్రజలఆస్తి, పశు, ప్రాణ నష్టాలుగానీ ప్రభుత్వానికి తెలియవు. అవి తెలుసుకునేమార్గాలు ప్రభుత్వానికిలేవు. కాని ఏవూళ్ళో వ్యవసాయకూలీలు కనీసవేతనాలకోసం సమ్మెచేస్తున్నారో, ఎక్కడ ఇనాంభూములు దున్నుకున్నారో, ఎక్కడ తమభూములు ఆక్రమించుకున్న భూస్వాముల దురాక్రమణనుంచి రైతుకూలీసంఘం నాయకత్వంలో తమచెట్లు తాము కొట్టుకొచ్చుకున్నారో, ఎక్కడ తమ ఆత్మగౌరవం, తమ స్త్రీల మానరక్షణకోసం తల ఎత్తి నిలిచారో - మరుక్షణంలో ప్రభుత్వానికి తెలిసిపోతుంది. గుమ్మడితీగ ఊరంతా పాకిందంటే గుమ్మడికాయదొంగ భుజాలుతడుముకున్నట్లు మార్తాండవేగంతో ఆ గ్రామాల్లో ప్రవేశిస్తారు. గ్రామాలను బెగ్గంపాడుచేస్తారు.

ఈ అణచివేత స్వరూపస్వభావాలను యూనిఫారాల్లోవున్న పోలీసులుమాత్రమే చేస్తున్నట్లుగా అర్థంచేసుకుంటే దానివిస్తృతి (magnitude) అసలే అవగాహనకు రాదు. దొరలకు, పెత్తందార్లకు భూమిమీదవుండే అధికారం అదే అగ్రకులాల నుంచి, వర్గాలనుంచి రెవెన్యూ, పోలీసు, ఎక్సైజుశాఖల్లో ఉన్నతపదవుల్లోకివచ్చే అధికారులద్వారా కాపాడబడుతుంది. అక్కడ ఆ అధికారాన్ని ఏ శాసనమూ, ఏ చట్టమూ ఇవ్వనక్కర్లేదు, దొరగడీలో అమలైనదొరతనం, దొరకొడుకు పోలీసుఅధికారి అయి పోలీసుస్టేషన్‌లో అమలుచేస్తాడు. పోలీసుక్యాంపులో అమలుచేస్తాడు. మహీధర రామమోహనరావు నవలల్లో భూస్వామికొడుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయి ఒక మృతవీరుడిభార్యను చెరబట్టిన ఉదంతం తెలంగాణ రైతాంగపోరాటకాలపు ఎన్నో సంఘటనలకు ఉదాహరణ ప్రాయంగా రాసాడు. కొండపర్తి, పులిగిల్ల గ్రామాల్లో ఈనాడు జరుగుతుంచి అందుకు భిన్నమేమీకాదు. అంతకన్నా అమానుషమయింది- దొరలభూములు దున్నకొని, చెట్లుకొట్టుకొని, పంటకోసుకుంటే వాళ్ళెంత బాధపడుతారో, ఆ బాధను ప్రదర్శించడానికి (demonstrate చేయడానికి) హుజూరాబాదు ఎస్ ఐ చౌదరిగారు రైతుకూలీల స్త్రీల చనుమొనలునలిపి ప్రజల ముందు పోల్చిచెప్పాడు.

పెరిగిపోతున్న రైతాంగ ఉద్యమాన్ని అణచడానికి పోలీసు బలగం చాలడం లేదు. హోంగార్డ్‌లతోసహా రకరకాలపేర్లతోవున్న పోలీసు, మిలటరీ, ప్యారా

మిలటరీబలగాలన్నీ సరిపోవడంలేదు. ఎందుకంటే ప్రకటిత జగిత్యాల, సిరిసిల్లాలు అప్రకటిత 'కల్లోల' తెలంగాణగా విస్తరించాయి. కనుక అణచివేత పునాది నుంచి ఉపరితలం దాకా భూమినించి విద్యాసంస్కృతుల దాకా పాకిపోయింది. భూస్వాము లది ఏపార్టీ అయినా కావచ్చు. నిన్న కాంగ్రెస్ కావచ్చు ఇవ్వాళ తెలుగుదేశంకావచ్చు (హుజూరాబాదు తాలూకాలో నిన్న ఇందిరా కాంగ్రెస్‌గావున్న నాయకులంతా ఇప్పుడు తెలుగుదేశం నాయకులై భూస్వాములతో రైతుసంఘాలుపెట్టించి వ్యవసాయకూలీలపై దాడులు చేయిస్తున్నారు) వాళ్ళ పిల్లలు మాత్రం కాలేజీల్లో, స్కూళ్ళలో 'దేశభక్తి' సైనికులై ప్రజాస్వామిక ఉద్యమాలపై దాడులుచేస్తుంటారు. పట్టణాల్లో పోలీసులకు అందగావచ్చే పెద్దబలగం ఇది. వీళ్ళు యూనియన్‌లను నిషే ధిస్తారు. జ్ఞానాన్ని నియంత్రిస్తారు. ప్రజాస్వామ్యానికి తామే తాబేదార్లయినట్లు ప్రగల్భాలుపలుకుతూ ప్రజాస్వామికంగా తాము తప్ప ఇతరులు ఎవరు ఎన్నికైనా విద్యాలయాలను పోలీసు క్యాంపులుగామారుస్తారు. విద్యార్థులపై దాడులుచేసి డిఎస్పీల ఇళ్ళలో తలదాచుకుంటారు.

అసెంబ్లీలో ప్రశ్నలువేసే బిజెపి వాళ్ళకు సరేసరి. సిపిఐఎం సభ్యులకుకూడ 'దేశభక్తు'ల హింసాకాండ కంటికి కనిపించదు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఏమార్గం చేపడుతున్నారు. అనే రాజ కీయాలతో ప్రమేయం లేకుండా ఈనాటికీ దరిద్రరేఖకు దిగువనవున్న అత్యధిక సంఖ్యాక పీడితులకు తమ న్యాయమైన హక్కులకోసం పోరాడేహక్కు వున్నదని ఎవరైనా ప్రజాస్వామ్యవాదో, లిబరల్ దృక్పథంవున్నవాడో, అటువంటి భావాలుగల సంఘాలో ప్రకటిస్తే వాళ్ళు నక్సలైట్లవుతారు ప్రభుత్వం దృష్టిలో. ప్రభుత్వ దృష్టిఅంటే- అంతిమ పరిశీలనలో భూస్వామ్య దృక్పథమే. ఈ ప్రచారంలో గ్రామాల్లోని భూస్వాములు మొదలుకొని, ఎక్కడైనా అంతో ఇంతో ఆస్తివుండి, లేదా ఆస్తిపరమైన భావజాలానికి లోబడి ఏ రంగంలో పనిచేస్తున్నవాళ్ళయినా షరీకే. ఉత్పత్తి సంబంధాల్లోకి, ఆస్తిసంబంధాల్లోకి వర్గదృక్పథంతో వెళ్ళి పరిశీలించకపోతే ఈ ప్రచారంలోపడి కొట్టుకపోవడం కూడ కష్టంకాదు.

ఈ ప్రచారం ఒక పద్ధతిప్రకారం జరుగుతున్నది.

ప్రభుత్వభూములు, బంచరాయి, పోరంబోకు, షికంభూములు, ఇనాం భూములు తమకుకావాలని రైతులు ఆందోళన ప్రారంభిస్తారు. లేదా కూలీరేట్లు పెర

గాలని, జీతం పెరగాలని సమ్మె చేస్తారు. ఒక భూస్వామి ఒక జీతగాణ్ణి కొడతాడు. లేదా ఒక హరిజనస్త్రీని చెరుస్తాడు. సమ్మెకు, ఆందోళనకు నాయకత్వం వహించిన కార్యకర్తలను అరెస్టుచేయిస్తాడు. తనకుప్పలు తానే కాలబెట్టుకుంటాడు. తన ఇంజన్లు తానే పగలగొట్టుకుంటాడు. ప్రజలు దౌర్జన్యానికి దిగారని గగ్గోలు పెడతాడు. అతను గగ్గోలు పెట్టనక్కరలేకుండానే పోలీసులూ వాళ్ళిచ్చిన రిపోర్టుపై ఆధారపడి ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెపుతాడు (పోలీసులు తయారుచేసిచ్చిన రిపోర్టులో 'ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అనేమాటనుకూడా మార్చకుండా 'ప్రభుత్వమే' ఆ రిపోర్టును అట్లాగే చదివిన వైనం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చూశాం)

ఖాకీబట్టలకు, కాషాయాంబరాలకువున్న బంధుత్వమేమిటో. ఖద్దరు, ఖాకీ, కాషాయాంబరాల అనుబంధమేమిటో భూమికీ, శ్రమకూ, స్వామ్యానికీవున్న ఘర్షణ ఏమిటో అర్థమైయితే తప్ప అర్థంకాదు.

గట్టుమీద చెట్టునీడన ఛత్రికింద కూర్చొన్న దొరోడు అనుభవిస్తున్న శాంతి, మోకాళ్ళబంటిబురదలో దిగబడి ఎద్దోలె దినమంత ఎండలో దున్నుతున్న జీతగాడు ప్రదర్శిస్తున్న అసహనంవల్ల భంగమవుతుంటే ఈ ప్రభుత్వాలు ఎవరికి భద్రత కల్పించడానికి రంగంలో దిగుతున్నయో తేల్చుకోవడానికి వాస్తవాలు, వివరాలు కావాలా? అవి వున్నాయి, అంతకన్నా కావలసింది మాటలు ఏమైనాచెప్పనీ ప్రభుత్వం ఎవరికొమ్ముకాస్తున్నది అని గ్రహించే వివేకం. ఆ వివేకం మనం ఎవరి పక్షం వహించదలచుకున్నాం అనే ఆత్మశోధన నుంచిగానీ ఉదయించదు.

బానిసత్వం బానిసత్వం అని తెలిసిన తర్వాత మనిషి బానిసగావుండడానికి ఇంక సుతరామూ ఇష్టపడడు. బానిసయాజమాన్య 'విశ్వాసం'లో వుండే 'శాంతి' ఇంక కరువవుతుంది. నిన్న మౌనంగా ప్రవహించిన రక్తం ఇవ్వాళ ప్రశ్నిస్తుంది. నిన్న మౌనంగా అనుభవానికి వచ్చిన రక్తం ఇవ్వాళ ఎదురిస్తుంది. ఇది యజమానులకు కల్లోలంగా కనిపిస్తుంది. ఆశ్చర్యంలేదు. బానిససంకెళ్ళు విరగాలని కోరుకునే ప్రజాస్వామ్య ప్రపంచం మాత్రం ఈ ప్రతిఘటనపక్షం తమ బలమంతా పెట్టినిలవాలి.

— సంపాదకుడు

14-9-33

"నేను చచ్చిపోయాక...."

శ్రీ శ్రీ

సరే. మరణించాను. నాకు 1990లలో చచ్చిపోవాలని ఉంది. బహుశా విమానప్రమాదంలో లేదా జలగండంవల్ల? అదీ యిదీ కాకపోతే నేలమీదనే కాల ధర్మం.

నా శవంచుట్టూ చాలామందిచేరి ఏడుస్తున్నారు. "ఎందుకేడుస్తారు? ఇప్పుడేమయి పోయిందని" నేనంత ధారాపాతంగా అరుస్తున్నా ఎవరికీ నామాటలు వినపడవు "అనంతర కార్యక్రమం గురించి ఆలోచించమన్నారెవరో! దహన సంస్కారం ఎజెండాలోకి వచ్చింది. అదే వీల్లేదన్నానునేను. మతానికి సంబంధించిన ఏ విధమయిన కర్మకాండకీ నా (సజీవ లేదా నిర్జీవ) కళేబరాన్ని అంకితంచెయ్యడం అనే పనికి నేను సుతరామూ అంగీకరించను. After all it is my Corpse isn't it? or is it?

చుట్టూ మూగిన వాళ్ళల్లో కొంతమందికి నేనొకసారి రాసిన మరణశాసనం జ్ఞాపకం వచ్చింది. అందులో నేను "నేను చచ్చిపోయాక జరగవలసిన మొట్టమొదటి పని నా శవాన్ని విశాఖపట్నంలోని కింగ్‌జార్జి ఆసుపత్రికి అప్పగించడం" అని రాశాను. ఆ తర్వాత జరగవలసిన పని అక్కడున్న మెడికల్ కాలేజి విద్యార్థుల్లోని నిరీశ్వరవాదుల ఆధ్వర్యం క్రింద జరగాలని నా ఆకాంక్ష.

ఏడ్చి, ఏడ్చి ఆగిపోయిన వాళ్ళు ఆగిపోయినా, ఏడుస్తున్న వాళ్ళింకా ఏడుస్తునే ఉన్నారు. ఏడవమనండి. నాకు అభ్యంతరం లేదు.

పత్రికలవాళ్ళకి కావలసినంత కాపీ. ఏమిటేమిటో రాసేస్తున్నారు. రాసుకోమనండి. నా అభ్యంతరం లేదు.

విరసం వాళ్ళు నన్నూరేగిస్తామన్నారు, నా అభ్యంతరంలేదు నా శవంమీద ఎర్రజెండా కప్పడం మాత్రం మర్చిపోకండని మరీమరీ అభ్యర్థించాను.

నా కొడుకేవచ్చి తన చేతుల్తో నా తలకి కొరివిపెడతానన్నాడు. ఇది వాడికి పుట్టిన బుద్ధి కాదనుకుంటాను. ఎవరో చెప్పించిన ట్యూషన్. అయినా అదే వీల్లేదంటాన్నేను.

మతంతోనూ, మతం తాలూకు మూఢవిశ్వాసాలతోనూ ఆమరణాంతం పోరాడే నన్నువాళ్ళే ఆ ఊబిలోనికెవరు దించదలచుకొన్నా నేనెంతమాత్రమూ అంగీకరించను.

అనంతం, స్వాతి మాసపత్రిక
జూలై 1979, పేజి 8, 9.

'కోఈ హఁస్ రహాహై' 'కోఈ రో రహాహై'

సురా

ఇక్కడ వాళ్ళు నా శవాన్ని
కూడా వేలం పాటకు పెట్టారు
చెప్పు నేస్తం నేనింకా ఎందుకు గౌరవించాలి నీ నగరాన్ని

— బొట్లవ్

అర్ధశతాబ్దం పాటు తెలుగు సమాజ రాజకీయ సాహిత్య జీవితంతో పెనవేసుకు పోయిన శ్రీరంగం శ్రీనివాసరావు శవాన్ని ఇవ్వాళ తెలుగు పత్రికారంగం వేలం పాటకు పెడ్తోంది. మద్రాసు మహానగరంలో ఆయన చితి పూర్తిగా కాలకుండానే మొదలయిన ఈ గొడవ చూసి ఆయన అభిమానులందరు బాధపడప్పు, విచారపడప్పు గాని ఆశ్చర్యపడటానికేమీలేదు. తన డెబ్బయేళ్ళ సంచలన జీవితానికి తగ్గట్టుగానే ఆయన మరణం కూడా వివాదాన్నే సృష్టిస్తోంది.

శ్రీశ్రీ గీతం, శ్రీశ్రీ మాట ఎప్పుడూ ఏదో ఒక సామాజిక సంక్షోభానికి ప్రతిస్పందనగానే వచ్చింది. ఆ క్రమంలో ఎన్నో వాదాలని వివాదాలని జనరేట్ చేస్తూనేఉంది. 1929లో 'చర్మకవచమెపుడో చలించును, బతికిన దినాల తల పోతల బరువుచేత' అని రాసినందుకే గదా 'భారతి' ఆయన కవితను తిరస్కరించింది. 1934లో ఆయన 'శ్మశానాల వంటి నిఘంటువు'లని దాటి ఒక గీతాన్ని ఆలపించ నారంభించినపుడు ఆ శ్మశానంలో బతికే సాంప్రదాయ రాబందులు ఆయన మీద చెయ్యగల ప్రచారం అంతా చేసారు. 1950 లలో ఆయన మహాప్రస్థాన గీతాలలో కన్పించే ప్రాపంచిక దృక్పథాన్ని దాటి వర్తమాన పోరాటాన్ని సమర్థించిన వెంటనే ఆయన చాలా మందికి శత్రువయిపోయాడు. విప్లవం గురించి మాత్రాఛందస్సులో రాసినంతకాలంఆయన్ని అభిమానించిన వాళ్ళు, కాటూరు, ఎలమర్రు హింసాకాండని ఖండించిన వెంటనే ("గద్దెమీద వాళ్ళంత శ్రద్ధగాని వినడానికి చేస్తున్నానీ హెచ్చరిక") దూరమయిపోయారు. 1955 ఎన్నికలలో ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల్ని వ్యతిరేకిస్తూ కవులు ముందుకొచ్చినప్పుడు 'విరుడు మురిపిన ఇనుప రచయితల' గురించి ఆయన రాయనే రాసాడు. తర్వాత కాలంలో రష్యాలో సమాధినుండి స్టాలిన్ శవాన్ని తవ్వితీసి బయటపారేసినపుడు శవాలను చూసి భయపడే వాళ్ళనిచూసి 'వ్యక్తిపూజ సంగీకరించకపోయినా, వీరపూజ మాన'నని నిర్భయంగా ప్రకటించాడు.

1967 లో కుళ్ళు సమాజంపై దిగంబరులు ధ్వజమెత్తినప్పుడు వాళ్ళ నాహ్వానించి అనుమోదించాడు, 1970 లో విశాఖవిద్యార్థులు "రచయితలారా మీరెటువయిపు?" అని ప్రశ్నించినపుడు, 'మాటలచేత మాట్లాడించి రక్తంతో రాగాలాపన' చేయిస్తూ నక్సల్బరీ శ్రీకాకుళం పోరాటాల్ని సమర్థించాడు. 1975 లో ఆయన దగ్గర కవిత్వం తొలిపాఠాలు నేర్చుకున్న పిల్లకవుల నుండీ ఆయనకు రాజకీయ ఇన్స్పిరేషన్ ఇచ్చిన కమ్యూనిస్టు నాయకులదాకా అందరూ ప్రపంచ తెలుగు మహాసభలలో ప్రభుత్వ సన్మానానికి పోటీపడ్తుంటే తాను బయటనిలబడి విప్లవ జెండా నెగిరేసాడు. విన్న కాకమున్న సాహిత్య వివాదాలని సృష్టించి డబ్బుచేసుకొనే ఓ వ్యాపారపత్రికలో అరిగిపోయిన శ్రీరంగం నారాయణబాబుని అడ్డుపెట్టుకొని ఆయనమీద దాడిజరిగితే ఈ శతాబ్దం నాది, అని సగర్వంగా ప్రకటించుకొన్నాడు. చివరికివ్వాళ మరణిస్తూ మరణిస్తూ ఓ పెద్ద దుమారాన్ని లేపివెళ్ళిపోయాడు. మరెవడో కవి పోతే ఏదో ఒకరోజు సంతాపం, కొన్ని అవార్డులు, మరికొన్ని సభలలో వ్యాసపాఠం ముగిసుండేది. అలా ఏ గొడవ లేకుండా చచ్చిపోగల స్వభావం. లౌక్యం శ్రీశ్రీ కెన్నడూలేదు అందుకే తనకు సంతాపాన్ని ప్రకటించదల్చుకున్న వాళ్ళని కూడా రెండుగా చీల్చివేసి, మహాకవి నిజంగానే 'మరణానికి ప్రాణంపోస్తున్నాడు.

సుదీర్ఘమయిన ఈ వివాదాస్పద జీవితంలో క్రమంతప్పకుండా మొదటినుండీ చివరిదాకా ఆయనతో ప్రయాణించిన వాళ్ళెవరూలేరు (మొదటిదశ, చివరిదశ మినహాయిస్తే కొంతని చెప్పుకోవచ్చు) ఆయన మాట, పాట, కవితాచరణాలు ఫక్తువ్యాపార నవలా రచయితల దగ్గర నుండి వాడుకొనని వాళ్ళులేరు భాషమీద ఆయనకున్న అధికారం తెలుగు సాహిత్యాన్ని బందీని చేసింది. చివరికివ్వాళ ఆయన కవిత్వం సహాయం లేకుండా ఆయనకు సంతాపం చెప్పలేని స్థితికి అందర్నీ తీసికొచ్చాడు. ఆయన దగ్గర మాటలునేర్చిన వాళ్ళు తర్వాతకాలంలో ఆయనకు, ఆయన ఆశయానికి ద్రోహం చేస్తూనే వచ్చారు. 1950 లో, 1955 ఎన్నికలలో, 1964 చీలికలో, 1967 దిగంబర కవితోద్యమంలో, 1970 విరసం ఏర్పడినప్పుడు ఎప్పుడూ ఎవరో ఒకరు ఆయనకు విద్రోహం చేస్తూనేవచ్చారు. ఆయన మాత్రం యువతరంతో ముందుకే సాగిపోయాడు. ఎన్నెన్ని ఒడుదుడుకులని తట్టుకుంటూ ఆయన చివరిదాకా పయనించాడో ఆ క్రమం అంతా ఆయన అధిగమించిన దుష్ప్రచారాల క్రమమే. మొదటి నుంచి ఆయనమీద దాడిచేస్తున్న వాళ్ళ దగ్గరనుండీ ("తాను కమ్యూనిస్టునని లోకంచేసిన ప్రచారానికి మోసపోయి కమ్యూనిస్టు అయిన మహాకవి" అని 'జాగృతి' పత్రిక ఆయ

నకు సంతాపం ప్రకటించింది !). ఇటీవల కాలంలోనే చేరిన ప్రముఖుల దాకా అందరూ ఇందులో భాగమే. ('నన్ను తిట్టే తీన్ సౌ కోన్ కిస్కాగాళ్ళల్లో నువ్వొకడివి') వాళ్ళందరు ఇప్పుడు బెక్కెట్లు బెక్కెట్లు ఏడుస్తున్నారు. బొర్లి బొర్లి దొర్లుతున్నారు. మరణించిన మహాకవి తప్ప మరెవ్వరూ ధృవీకరించలేని జ్ఞాపకాలు చెప్తున్నారు. సంతాపం పేరుతో తమ ఆత్మకథని చెప్పుకుంటున్నారు (ఆత్మకథకూడా ఆత్మహత్య కొకరూపమే అని ఆయనే అన్నాడు) మరో శ్రీశ్రీ ఎక్కడ అని మొసలి కన్నీరు కారుస్తున్నాడు ముఖ్యమంత్రి. ఆయన పేరుతో అవార్డు ప్రకటించాడు ఓ మాజీ పోలీసాఫీసరు శ్రీశ్రీ ట్రస్టు తెరుస్తున్నామంటున్నారు అభ్యుదయ రచయితల సంఘం వాళ్ళు. ఆయన తపాలాబిళ్ళ కావాలంటోంది విశాఖ రచయితల సంఘం. శవ వాహకుడిగా తన ఫోటో ఒకే పత్రికలో రెండుసార్లు పడిందని ఒకడు మురిసి పోతున్నాడు. తన సంతాప ప్రకటన పూర్తిగా ప్రచురించలేదని మరొకడు విచారిస్తున్నాడు. ఆయనకు సినిమా సంకితంచేసి పేరు తెచ్చుకుంటామని ఒకడనుకుంటే, డాక్యుమెంటరీ తీసి ఖ్యాతిసంపాదించకపోతానా అని మరొకడు ఆలోచిస్తున్నాడు. ఆయన ధరించిన చెప్పులు రెండు శ్రీలు అని ఒకడు పటంకట్టి ఫోటోవేస్తాడు. ఆయన పుస్తకాలకి టైటిల్ తానేపెట్టానని ఒక జర్నలిస్టు వాపోతాడు. తన ఇంట్లోఉంటూ, తన గురించి మంచిగాచెప్పేవాడు పోయాడని ఒక సంపాదకుడేడిస్తే, ఆయన ఫోటోకు కొబ్బరికాయకొట్టి ధూపదీపనైవేద్యాలు పెడ్తున్నాడు మరో సంపాదకుడు. ఒకడి నవ్వు మనకు ఏడుపుతెప్పిస్తుంది. ఒకడి ఏడుపు మనకు నవ్వు తెప్పిస్తుంది. శ్రీశ్రీ భాషలోనే కోయిహఁస్ రహాహై, కోయి రో రహాహై....

'ఆ ముహూర్తాలొగమిస్తాయి !'

"ఆంధ్రజ్యోతి వారపత్రిక శ్రీశ్రీ అద్దాలు, చెప్పులు, టూత్‌బ్రష్ మొదలైన వస్తువులను ప్రచురించిందిగానీ ఆయన ఆశయాన్ని మాత్రం ప్రచురించలేకపోయింది.

ఆదిలాబాదు, కరీంనగర్ జిల్లాల్లో దోపిడీ దొరలకు చాకలులు బట్టలు ఉతకడంలేదట, మంగలులు క్షౌరాలు చేయడంలేదట. కష్టజీవులంతా దొరలను సాంఘికంగా బహిష్కరిస్తున్నారట.

మా ప్రెస్ కార్మికుల చైతన్యం కూడ ఆ స్థాయికిచేరి అవాకులు, చెవాకులు రాసే పత్రికాయజమానుల, సంపాదకుల, రిపోర్టర్ల రాతలుకంపోజ్ చేయము, ప్రింటు చేయము అనే రోజొకటి వస్తుందని ఆశిస్తున్నాను"

— ఒక ప్రెస్ వర్కర్, (విరసం, హైదరాబాదు యూనిట్ జులై 4 83 న ఏర్పాటుచేసిన సభలో)

శ్రీ శ్రీ

రెండు అముద్రిత అనువాద కవితలు

మూలం : ఓటోరీనీకాస్టిల్లో

[1981 జులైలో శ్రీశ్రీ మ్యాడిసన్ (అమెరికా) నుంచి సృజనకు రెండు అనువాదకవితలు పంపించాడు. రెండూ ఓటోరీనీ కాస్టిల్లోవే. అతనిగురించి శ్రీశ్రీయే రాసిన చిన్నపరిచయం కిందఇస్తున్నాం. 'ఆకాశమంత ఎత్తుగావున్న అతనిపీపు' చాటున దాక్కొని 'కమ్యూనిజం వ్యతిరేకత' గుమ్మరిస్తున్నవాళ్ళకు శ్రీశ్రీ 'వైప రీత్యం' విపరీతంగానే కనిపించవచ్చు. ఏంచేద్దాం - ఇంకోభాషకూ భావనకూ స్పందించినపుడుకూడ ఆయన శ్రీశ్రీయే.

రెండోకవిత అనువాదం పదేళ్ళక్రితమే వేల్చేరు నారాయణరావు చేసివున్నారు. అది తెలుగులో ఎన్నోచోట్ల మళ్ళీమళ్ళీ అచ్చయి విశేష ప్రజాదరణను పొందింది కూడ. అయినా శ్రీశ్రీ తాను మళ్ళా ఈకవితను అనువాదం చేయాలనుకున్నాడంటే తానంతగా తన్మయంచెందివుండాలి. విస్కాన్సిన్‌లో వేల్చేరు అతిథిగావున్నపుడే శ్రీశ్రీ ఈ అనువాదాలు చేసాడు.]

ఓటోరీనీ కాస్టిల్లో గొప్పమానవకవి. చిన్నతనంలోనే కమ్యూనిస్టు పార్టీలోచేరి 24వయేట సర్కారు ఫాసిస్టుల చిత్రహింసకు గురిఅయ్యాడు. మూడురోజుల చిత్రహింసలతర్వాత అతడ్ని సజీవదహనం చేశారు.

వైపరీత్యం

1935లో హిట్లర్
"మూడోరైషే
వెయ్యేళ్ళు సాగుతుంద"న్నాడు
పదేళ్ళ తర్వాత
ఏమన్నాడువాడు
బెర్లిన్ శిథిలాలక్రింద
ఆ తర్వాత మరో కొన్నేళ్ళకి
మిస్టర్ డల్లెస్
గొంగళీపురుగులాగ గుర్రుపెడుతూ
కమ్యూనిజం దాస్యం

ఈ దశాబ్దంలో అంతమవుతుందన్నాడు
మరి కొన్నేళ్ళ తర్వాత
యూరీగగారిన్ ఏం చేశాడు
అమెరికాభూముల సముద్రాల వైశాల్యాలమీదుగా
మానవులకు తన అభినందనలందజేస్తూ
థామస్‌మాన్ సరిగానే అన్నాడు
కమ్యూనిజం వ్యతిరేకత
ఇరవయ్యో శతాబ్దం వేసిన వెర్రితలలంటూ
కాని ఇప్పటికీ
స్వార్థచింతనా స్వలాభాపేక్ష
వాటి జంజాటం ఆపలేదు
వాటికూత్యలవి జరిపిస్తూనే ఉన్నాయి
ఇప్పటికి కూడా

మ్యాడిసన్
26-6-81

విరాజకీయ మేధావులు

ఒకానొక దినాన
నా దేశపు విరాజకీయ మేధావుల్ని
నిలవేసి ప్రశ్నిస్తారు
అమాయకులైన అలగాజనం
ఏం చేస్తున్నారు మీరు
మనదేశం నింపాదిగా
తియ్యని మంటలాగ
చిన్నగా ఒంటరిగా మరణిస్తున్నప్పుడని

ఈ రాజకీయాలేవీలేని మేధావుల్ని
ఎవరూ ప్రశ్నించరు
మీరెలాంటిదుస్తులు వేసుకున్నారని
మధ్యాహ్న భోజనానంతరం
ఎలా కునుకు తీశారని
శూన్య పదార్థంతో మీరు సాగించిన
శుష్క సమరాలను గురించి
ఎవరూ తెలుసుకోదలచుకోరు

ధనవంతమైన మీ ఉన్నత విద్యగురించి
ఎవరూ పట్టించుకోరు
ప్రశ్నించరు మీ పౌరాణిక పాండిత్యాన్ని
ప్రశ్నించరు మీలోనిఎవడో
పిరికివాడి చావు చావడం ప్రారంభించినప్పుడు
మీరుపొందుతున్న స్వీయహేయభావం గురించి
సంపూర్ణమైన అసత్యపు ఛాయల్లో జన్మించిన
మీ అర్థం పర్థంలేని సమర్థింపుల గురించి
సంజాయిషీల గురించి
ఎవరూ ఏమీ అడగరు
ఆ రోజున
అమాయక మనుష్యులు వస్తారు
రాజకీయాలు లేని మేధావుల గ్రంథాలలో
కవిత్వాలలో స్థలం లేనివాళ్ళు
కాని అనుదినం ఈ మేధావులకి
పాలూ కూరగాయలూ పట్టుకొచ్చినవాళ్ళు
కోడిగుడ్లు తెచ్చినవాళ్ళు
దుస్తులు కుట్టిపెట్టిన వాళ్ళు
కార్లు నడిపిన వాళ్ళు
కుక్కల్నీ తోటల్నీ పెంచినవాళ్ళు
కష్టించిన వాళ్ళు
వాళ్ళు ప్రశ్నిస్తారు

పేదవాళ్ళు బాధ పడుతున్నప్పుడు
లాలిత్యమూ జీవితమూ వాళ్ళలోనుంచి
మండిపోయి మసీ నుసీ అయిపోయినప్పుడు
ఏం చేస్తున్నారు మీరని
ఓనా సుమధుర దేశపు విరాజకీయ మేధావులారా
అప్పుడు మీరు జవాబు చెప్పలేరు
ఒక నిశ్శబ్దపు రాబందు
మీ పేవులారగిస్తూ ఉంటున్నప్పుడు
మీ వేదన మీ ఆత్మలనే పొడుచుకు తింటున్నప్పుడు
మీ సిగ్గులో
మీరే నోరు మూసుకుంటారు.

మ్యాడిసన్, 28-6-81

'ఒకశబ్దం శక్తివల్ల నాజాతుక్కి పునర్జన్మ'
(ఆ శబ్దం) 'స్వాతంత్ర్యం' (అంటున్నాడు) శ్రీశ్రీ

'ఎందుకు జన్మించానా ?
నిన్ను తెలుసుకోవాలని.'
పాల్ఎలార్డ్‌ను ఆవిష్కరించుకొని, ఆవేశించి శ్రీశ్రీ 'స్వాతంత్ర్యం !
నీ మననం నా జననం' అంటున్నాడు. ఆయనకు స్వాతంత్ర్యంఅంటే
'ఉదయిస్తున్న ప్రతిపవనాంకురం', 'వెర్రెత్తిన పర్వతం', 'తుపానులచెమట'

అందుకే ఎందరో 'ఆశ్వాసల్‌వీడి లాఠీహతులై ఉరికొయ్యల కవుంగింటచేర్చి' 'స్వాతంత్ర్య స్వప్నం' ఫలించిందనుకున్ననాడు

'జనసందోహం కరిగి ఒకేవ్యక్తిగా రూపుధరిస్తే'
'ఎంచేతో అతని ముఖంమీద
ఎప్పుడూఉండే పసిపాప నవ్వులేదు !'
ఈ 36 సంవత్సరాల పాలన చేస్తున్నదంతా
అతనిముఖానికి నవ్వు అతికించే ప్రయత్నమే.

'ఒక సున్నితమైనపువ్వు', 'చాలా వాడైనకత్తి, విలువైనవజ్రం' అయిన స్వాతంత్ర్యం గురించి మహాకవి శ్రీశ్రీ 1947 లోనే తానుగానూ, అనుసరణగానూ ఎంతో కవితామయంగా చెప్పిన భావాలను ఈ తరంకోసం ఈ రెండు గీతాలద్వారా అందిస్తున్నాం.

'ఖడ్గసృష్టి' కవితాసంకలనం (1966 విశాలాంధ్ర ప్రచురణ)గానీ, శ్రీశ్రీ సాహిత్యం - సంపుటాలు (1970 శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మానసంఘం ప్రచురణ) గానీ లభించని ఈరోజుల్లో నక్సల్బరీ తరానికి తమ సాహిత్యవారసత్వం 'స్వయంగా చదవండి' అని అందిస్తున్నాం.

— సా. మి.

మహా సంకల్పం

ఇది నా స్వాతంత్ర్యదిన
మహా సంకల్పం,
విధిగా వికసించే
చరిత్రికాక కృతజ్ఞత,
ప్రజలకు నివాళి,
ప్రభవించిన నూతన భారత
పతాక కభివాదం,
భవిష్యదుజ్జ్వల
ధర్మయుగానికి ఆహ్వానం,
పరిహద్దులెరుంగని
సకల జగజ్జనులారా
ఇదిగో నా స్వాతంత్ర్య స్వప్నం

ఏ స్వాతంత్ర్యం నిమిత్తం ఎవరెవరెవరో ఎందరో దేశసేవా
భాస్వంతుల్, బాలవృద్ధుల్ పతితులధికుల ప్రాజ్ఞులుత్ప్రాజ్ఞులంతా
ఆశ్వాసల్ వీడి లాఠీహతులై ఉరికొయ్యల కవుంగిట చేర్చ
రా స్వాతంత్ర్యం లభించిందని విని హృదయం హ్లాదసంపుష్టమైతే

నవోదిత స్వాధీనతానందితోత్ఫుల్లమైన
నగరం జెండాల పంటలతో నవ్వుతూ పాడుతూఉంటే
ఉత్సాహ ప్రవాహంలో నేనూ ఒక బిందువునై
స్వాతంత్ర్య వాయువులు పీలుస్తూ సాగిపోయా
ఆ సమయంలో అందరి మనస్సు
లావరించె నొక వ్యక్తి
అందరిలోనూ ఆ సమయంలో
ఆవహించె నొకశక్తి
అంతట్లోకీ అకస్మాత్తుగా
జనసందోహం కరిగి
ఒకేవ్యక్తిగా రూపుధరిస్తే
ఇదేం చిత్రమని చూశాను

ఒక పెద్ద కాంస్య విగ్రహా
నికి ప్రాణం వచ్చినట్లుగా
ఒక మేఘం గగనపథం దిగి
మానవుడై నిలిచినట్లుగా,
ఒక మహావటవృక్షం
హఠాత్తుగా నడిచినట్లుగా,
ఒకే ఒక్క మానవమూర్తి
నా కళ్ళముందు కనిపించాడు.
ఎంచేతో అతని ముఖంమీద
ఎప్పుడూ ఉండే పసిపాప నవ్వులేదు :

ఆ మానవాననంలో
ఏదో కించిద్విషాదం, కించిన్నిరాశ
కొంచెం విరాగం, కించిదసంతృప్తి,
ఆ మానవ వదనం అందరికీ పరిచితమే,
అతడే నువ్వూ నేనూ, అంతమందీవెరసి,
స్వతంత్ర భరతవర్ష వాస్తవ్యుడామానవుడు
అర్ధనగ్నంగా ఆకాశాన్నే కప్పుకొని
నిండని కడుపుతో మండుతూన్నకళ్ళతో
ఇలా ఎంతకాలం ఇంకా నిలబడతాడాప్రాణి ?

అతణ్ణి జాగ్రత్తగా చూడండి
స్వతంత్ర భారత పౌరుడు,
అతని బాధ్యత వహిస్తామని
అందరూ హామీ ఇవ్వండి,
అతని యోగ క్షేమాలకు
అంతా పూచీపడండి,
అతికించండి మళ్ళీ
అతని ముఖానికి నవ్వు

స్వాతంత్ర్యం ఒక చాలా సున్నితమయిన పువ్వు,
చాలా వాడైన కత్తి, విలువైన వజ్రం,
స్వాతంత్ర్యం తెచ్చేవెన్నెన్నో బాధ్యతలు
సామర్థ్యంతో నిర్వహిస్తామని సంకల్పం చెప్పుకుందాం।
భగవంతుని ప్రార్థించిందికి
బహుశా ఇది సమయం కాదు,
పాతవి గుంజాళించిందికి
బహుశా ఇది సమయం కాదు,
ఇది మనకౌకదీక్షా సమయం
ఇది మనకు పరీక్షా సమయం
ఆవేశం ప్రకటించిందికి
అసలే ఇది తరుణం కాదు.

రా! నేస్తం, పోదాం! చూదాం
మువ్వన్నెల జెండా పండుగ;
రా! నేస్తం, తేదాం చూదాం!
మన భారతజన సౌభాగ్యం,

అటు చూడు సముద్రం, నేస్తం,
హర్షానికి పర్యాయపదం;
ఇటుచూడు విహాయసనేత్రం
దుఃఖానికి అధ్యాహారం!
ఈ రెండిటి మధ్య నిలిస్తే
నీ లోపల లోలో పలికే
ఆలాపన లాలోకిస్తే
వినపడదా ఒక సంగీతం!
విడిపడదా ఒక సందేశం!

ఇదే నా స్వాతంత్ర్యదిన
మహా సంకల్పం,
ఇది నా ప్రజలకు [illegible]

స్వతంత్ర భారత పతాకాని
కిది నా అభివాదం
భవిష్యదుజ్వల
ధర్మయుగానికి ఆహ్వానం
సరిహద్దులు లేని
సకల జగజ్జనులారా !
మనుష్యుడే నా సంగీతం,
మానవుడే నా సందేశం !

రచన : 1947 ఆగస్టు 15
రేడియో ప్రసారం : అదేరోజు
ప్రచురణ : అభ్యుదయ 1947 సెప్టెంబరు
పునర్ముద్రణ : 'ఖడ్గసృష్టి' కవితా సంకలనంలో
1966 ఫిబ్రవరి
శ్రీశ్రీ సాహిత్యం - మూడు(కావ్యవిభాగం)
1970 జనవరి

స్వాతంత్ర్యం

నా స్కూలు కాపీబుక్కు మీద
నా బల్లమీద చెట్లమీద
ఇసుకమీద మంచుమీద
నీ పేరే రాస్తాను !

చదివిన ప్రతి పేజీమీద
తెల్లని ప్రతికాగితం మీద
రాయి రక్తం అట్టమీద బుగ్గిమీద
నీ పేరే రాస్తాను !

తళుకు బెళుకు భ్రిమలమీద
సిపాయీల తుపాకులమీద

మహారాజుల కిరీటంమీద
నీ పేరే రాస్తాను ।

అడవి మీద ఎడారి మీద
పిట్టగూళ్ళమీద చీపురుకట్టలమీద
శిశుత్వపు ప్రతిధ్వనులమీద
నీ పేరే రాస్తాను ।

చిత్రమైన రాత్రుల మీద
పగళ్ళ తెల్లని వేడి వేడి అన్నంమీద
పెళ్ళి మాటలాడుకున్న ఋతువులమీద
నీ పేరే రాస్తాను ।

నా వినీలాకాశపు చింకిపాతలమీద
చెరువులోని సూర్యుని మీద
చంద్రుని సజీవ సరోవరం మీద
నీ పేరే రాస్తాను ।

ప్రపంచపుటంచున పంటపొలాల మీద
పక్షుల రెక్కలమీద
నీడల గాలితిరుగుడు మరలమీద
నీ పేరే రాస్తాను ।

ఉదయిస్తున్న ప్రతి పవనాంకురం మీద
సముద్రం మీద నా కలం మీద
వెర్రెత్తిన పర్వతంమీద
నీ పేరే రాస్తాను ।

మబ్బుగుంపుల నాచు మీద
తుపానుల చెమట మీద
రుచిలేని చిక్కని వాన మీద
నీ పేరే రాస్తాను ।

రంగు రంగుల రూపాలమీద
ఇంద్రధనస్సు గంటల మీద
స్పర్శించదగ్గ సత్యం మీద
నీపేరే రాస్తాను!

మేలుకొంటున్న సందుల మీద
విస్తరిల్లుతున్న వీధుల మీద
శృంగాటకాల వరదల మీద
నీపేరే రాస్తాను!

వెలిగించిన దీపం మీద
మరణించే దీపం మీద
మళ్ళీ కలుసుకున్న మా యిళ్ళమీద
నీపేరే రాస్తాను!

రెండుగా తరిగిన పండుమీద
అద్దంమీద నా గదిమీద
శూన్యమైన నా శయ్యాశంఖం మీద
నీపేరే రాస్తాను!

నా కుక్కపిల్ల గూటిమీద
రిక్కించిన దాని చెవులమీద
దాని అడ్డదిడ్డపు పాదంమీద
నీపేరే రాస్తాను!

కిర్రుచప్పుడు తలుపుమీద
వాకుతెలిసిన నేను ప్రేమించిన వస్తువుమీద
పవిత్రాగ్నుల కెరటంమీద
నీపేరే రాస్తాను!

శ్రావ్యమైన శరీరంమీద
స్నేహితుల ముఖాలమీద

చాచిన ప్రతిహస్తంమీద
నీపేరే రాస్తాను!

వింతైన కిటికీ అద్దంమీద
పెదవులపై నిలిచే ఏకాగ్రత మీద
నిశ్శబ్దానికి చాలా అవతల
నీపేరే రాస్తాను!

నా కూలిపోయిన గుడిసెమీద
పడిపోయిన నా దీపగృహాలమీద
నా విసుగుదల గోడలమీద
నీపేరే రాస్తాను.

కోరికలేని అదృశ్యత మీద
నగ్నమైన ఒంటరితనం మీద
మరణపు పరిహద్దుల మీద
నీపేరే రాస్తాను

ఇప్పుడే కోలుకుంటున్న ఆరోగ్యంమీద
నిష్క్రమించిన ప్రమాదంమీద
జ్ఞాపకంలేని ఆశమీద
నీపేరే రాస్తాను.

ఒక శబ్దం శక్తివల్ల
నా బతుక్కి పునర్జన్మ!
ఎందుకు జన్మించానా?
నిన్ను తెలుసుకోవాలని
నీ మననం నా జపనం
స్వాతంత్ర్యం!

మూలం : పాల్ ఎలార్డ్

ప్రచురణ : ఆంధ్రశిల్పి 1947 సెప్టెంబర్
పునర్ముద్రణ : శ్రీశ్రీ సాహిత్యం - రెండు
(కావ్యవిభాగం) 1970 జనవరి

చెరగని సంతకం

లోచన్

విశాఖ తీరం
హోరున రోదిస్తోంది
తన ఒడిలో ఆడిన
పసివాడు వెళ్ళిపోయాడు

అలలు అలలుగా ఏళ్ళ జ్ఞాపకాలు
కలల తీరాల ఆరని అక్షరాలు
కడలి కన్నీటి చుక్కై రాలింది
తనని చదువుకున్నవాడు వెళ్ళిపోయాడు

భూమ్యాకాశాల మధ్య
అనంతంగా
కలవరపడ్డ ఖాళీకాగితాలు
దిక్కుతోచక
ఏడీ మాకథానాయకుడు ?
మా కమాండర్
మా సాయుధ మేధావి
శ్రీశ్రీ ఏడీ ?—
వెర్రి గాలిలా ప్రశ్నిస్తూ
తిరుగుతున్నాయి
తూర్పు పవనం నిలిపి తెలిపేదాకా
పాపం పిచ్చికాగితాలకి తెలీదు
శ్రీశ్రీ తమ గుండెల్లో వాటర్‌మార్క్
సంతకం చేశాడని

మారట్ తుడూం పాయనా (మనందరం తుడుం గొట్టాలే)

సాహు

మంచెమీద సోయిం లింగు గుప్పిడి (వడిసెల)లో రాళ్లపెట్టి "యాః....యాః" అంటూ అరుస్తూ రువ్వుతున్నాడు. మందలు మందలుగా రామచిలుకలు, గోరెంకలు, గువ్వలు అరుస్తూ జొన్నకంకులమీద వాలుతున్నాయి. ఈమూలకు రాళ్లు రువ్వితే ఆమూలకు వాలుతున్నాయి. అప్పటికే నాలుగు గోరెంకల్ని కొట్టి బూరుపీకి కాల్చి బుట్టలోవేసుకున్నాడు. ఓపదివరకు దొరికితే ఆపూటకు పులుసుకాయొచ్చు.... ఎండ ముదురుతోంది ఎండ ఎక్కినాకొద్ది కడుపులో ఆకలి హెచ్చుతోంది. పిట్టలు ఎండ ఎక్కినాకొద్ది పల్చపడుతున్నాయి.... మంచెమీదినుండి గూడెందిక్కు చేలమీది నుండి చూశాడు. కావలివాళ్ల అరుపులు తప్ప గూడెం నుంచి వచ్చేవాళ్లెవరు కన్పించలేదు. 'భాయి ఇంకా రాకపాయె'నని ఆలోచనలోపడ్డాడు.... దక్షిణంవేపు మళ్లీ గోరెంకల గుంపువాలింది.

"ఓ....యాః. దుత్తెరి.... బిత్తపిట్టేరా. తుంత్‌ణా కష్టెం సగం అవేతించి" (ఏంపిట్టలురా చేసినకష్టం సగం అవేతినే....) అని మనసులో అనుకొని పైకీమాత్రిం గుప్పిడీలో రాళ్లపెట్టి గిరగిరతిప్పుతూ రివ్వురివ్వున కొడుతూ అరుస్తున్నాడు. అయినా లేవలేదు. మంచెరగడుకు కట్టినతాళ్లుపట్టి ఊపాడు. మంచెరగడు నుంచి చేలోకర్రల దాకా కట్టిన తాళ్లు ఊగినయ్. కర్రలు గలగల ఊగినయ్ ఈసారి పిట్టలు లేసినయ్.

ఆమొండి గుట్టలు చేన్లకావలి వాళ్ల అరుపులతో. పైన ఎగురుతూ కిలకిలలాడే పిట్టల అరుపులతో ప్రతిధ్వనిస్తున్నాయి.... కొందరు రేకుపీపాలు దబడదిబడ బాదుతే. మరికొంతమంది డప్పులుకొడుతూ అరుస్తున్నారు. పెద్దగా అడివిలేదు. ఉన్నఅడవి ఆకులుజాడిస్తూ గుట్టబోర్లమీద బండలు కన్పిస్తున్నాయి.... ఎన్నో ఏండ్లుగా అడివి నరుకబడుతూనే ఉన్నది. మైదానప్రాంతాలల్లోకి కర్రనడిచిపోతూనే ఉన్నది.... మీది కెల్లి అడివి నరికిండ్లని కేసులుమాత్రిం గిరిజనులమీద పడుతున్నాయి. ఎత్తుకపోయి నోడు మంచిగనే ఉంటండు. తడుకతీసినోడే దొంగయిపోతండు.... ఇలాంటి చిన్న చిన్న విచారాలు లింగుకు దోచినయ్.... వీటన్నిటికన్నా మిన్నగా లింగుకు కడుపులో ఎలుకలు తిరుగుతున్నాయి.

లింగు మంచెదిగి ఉడా (ఊపబియ్యం) చేసుకుందామని జీడిపీః (మద్ది తోడు కలుకాల్చి నిప్పుచేసి కాలువడం) తీసి నెగట్లోవేసి మళ్ళీ మంచె ఎక్కాడు. పొగ

లేచింది. మళ్ళీ ఏమనుకున్నడో ఏమో మంచెదిగి జొన్నకర్రల్లో నడుస్తున్నాడు. ఇంతలోనే ఉత్తరంవేపు ఊడుగుపొదల వేపునుంచి కేర్ కేర్‌మనే చప్పుడువిన్పించింది. లింగు ఆశబ్దాన్ని గుర్తుపట్టి- కొద్దిగా ముఖం వికసించింది- పాము మాదిరిగా కర్రల్లో నుండి ఆ శబ్దం వచ్చిన దిక్కు వెళ్ళాడు. దడిపక్కన పెట్టిన ఉరిలో కుందేలు పడి గిలగిల కొట్టుకుంటున్నది. ఉరితీసి కుందేలుసుతెచ్చి మంచెకింద పెద్ద గంపకింద వేసి మీదినుండి పెద్దబండ బరువుపెట్టాడు. కుందేలు గంపలో కేర్ కేర్ మంటూ గీకుతోంది.

రాత్రికి కుందేలు మాంసం.... నోట్లో నీళ్లూరాయి.

"బేగమాంతాయి. (ఎక్కడున్నవ్ ?)" పెద్దగా కేకవిన్పించింది....

మంచెకిందఉన్న లింగు సమధానంగా "ఓయ్" అని కేకవేశాడు.

కర్రలు పాతుకుంటూ లింగు భార్య చిన్ని సద్దిమూటతో వచ్చింది. సద్దిమూట కిందబెట్టి మంచెకింద తన భర్త చేసిన పని కళ్లతోనే పరిశీలించింది....

"నువ్విక్కడ కుందేల్లు - గొరెర్రింకలు పడుతాంటే గూడెంలోనికి మల్ల కాకి బట్టలోల్లచ్చి లోటీసు లిత్తండ్లు-" చిన్నిమాట పూర్తి కాకముందే-

లింగు "మళ్ళ కాయిదాలచ్చినయా ?" అన్నాడు కొద్దిగా భెదురుతూ....

"ఆఁ....ఆఁ.... భూములన్ని ఇడ్సిపెట్టాల్నట- లేపోతే ఒక్కొక్క ఊరును మళ్ళ ఇందర్‌వెల్లి చేస్తరట-" నేలమీద బెడ్డల్లో కూర్చుంటూ చిన్ని....

"మరి గూడెంలో బేదకల్ కాయిదాలు తీసుకున్నరా ?" ముఖంమీద నీళ్ల చల్లుకుని మాటవిప్పుతూ-

"ఎవలు తీసుకోతే- గుడిసెలకు అంటిచ్చిపోయిండ్లు-" పిట్టల అరుపులు విన పడగానే మంచెమీదికెక్కి తనూ అరుస్తూ ఒడిసెల తిప్పసాగింది చిన్ని-

లింగు గడుకముద్దలు నోట్లెబెట్టుకొని కానేపు ఎద్దులాగా నమిలిండు.... మట్టి పెళ్ళలకేసి- గాలికిఊగే జొన్నకర్రలకేసి- దంతులకేసి చూస్తూ తిండాపి విచారంలో పడ్డాడు. హఠాత్తుగా అతనికిగుర్తుకొచ్చి లేచినిలబడి మంచెమీదికిచూస్తూ

"అన్మంతరావ్ దాదాలేడా ?" అని అడిగిండు.

"లేడు ఎటుపోయిండో ?" చిన్ని లింగుకేసి చూడకుండానే "యాఁయాఁ" అంటూ మొత్తుకోసాగింది.

చిన్ని మంచెమీది తాళ్ళుకదిలించి. జొన్నకర్రలు లయగా కదలడంతోచే గొంతెత్తి "రేలా.....రేల" అంటూ పాడసాగింది.

లింగుకు నోట్లోవేళ్ళుపోవడంలేదు. ఖుద్దదిగడంలేదు. మళ్ళా గంపలకమ్మెన కుందేలు తిరిగిపోద్దాఏమి? అనుకున్నాడు. పాటవినబుద్ధికాలేదు. "ఏహె(పాటాపు" అంటూ బిగ్గరగా కసురుకున్నాడు.

సద్ది మూటకట్టిపెట్టి చెయ్యికడక్కొని పట్టిపెళ్ళల్లో పుల్లతో గీతలుగీస్తూ విచారంలో పడ్డాడు.

"అయితే మళ్ళ ఈభూముల్ల పిచ్చితుమ్మల ప్లాంటేషన్ చేస్తరన్నమాట". తన చిన్నతనం గుర్తొచ్చింది. "ప్లాంటేషన్ చెయ్యద్దు మా సాగుభూముల్ల అన్నందుకు రక్తాలుకారంగకొట్టి. గుడిసెల్ని కాల్చి. ఇండ్లుపీకి. వెంటజేసి. కుండలు పలుగ్గొట్టి. ఇంకాఇంకా ఎన్నోచేసిండ్లు. ఆ తరువాత వాళ్ళు లీడర్లచుట్టుతిరగడం. కాయిదాలకర్సుకని. వాడింతవీడింత దొబ్బిపోవడం. ఆఖరుకు భూములు రాకపోవడం. పౌరకళసార్లురావడం. సంగాలుబెట్టడం. తుడుంకొట్టడం. పోలీసులు జంగలాతు వాళ్ళురావడం. కాని ఈసారి 'రెక్కల కష్టంమాది' 'ఊడువానికే భూమి పాజిలే'. (దున్నేవాడికి భూమి) అంటూ ఇందర్‌వెల్లికివెల్లడం. అక్కడ తమవాళ్ళ మరణం.... ఈ గడబిడ గడిచిపోయి సోకముందే. పౌరకళసార్లు అరెస్టురావడం. మళ్ళా కొత్తసారురావడం. మనలడాయి ఆగేసగాదు. మనకు భూమిదక్కేవరకు లడాయి చెయ్యాలనడం గూడెంలోవాళ్ళంతా మనభూములు మనకేఉండే ఇంకెవల్త్రరు సాదు పట్టాఉంటేంది లేకుంటేంది అనడం. సౌకిదార్ల బాధలేదనుకుంటె పోయినభూములు వచ్చినయని సంబురపడుతుంటె. సార్లు వత్తాండ్లు పోతాండ్లు. మల్ల గిదేంది సమక్ కాలేదు" లింగు నెత్తిగోక్కొని లేచినిలుచున్నాడు.

గబగబ మంచెఎక్కి పక్కమంచె రాజేశ్వర్రావు ఉన్నాడేమోనని చూశాడు. మంచెమీద బుర్రమీసాలతోని రాజేశ్వర్రావు కూసున్నడు. వాడికి లపక్క గూడెం. శివార్లు కల్పిఉన్నయి....

"మరి గరాజేశ్వర్రావును అడుగరాదా? ఏం సంగతో మనకు తెలుపకపాయె". చిన్ని సలహాచెప్పింది పోటోతూ.

"వాడోదొంగ. సర్కార్‌బంటు. వానికి పట్టాఅచ్చిందట. మెదటేమొ లడాయి జెయ్యాల్నని ఊరూరు తిరిగిండు. మల్ల పోలీసులను కల్సిండు. వాన్ని అడుగుతె

నవ్వుతడు. వానికెరికె ఇట్లజరుగుద్దని- నల్లికుట్ల లంజకొడుకు-" లింగు పండ్లు కొరికిండు.

చిన్ని ఏదో గొనుగుతూ కళ్ళిలు పాపుకుంటూ గూడెందారిపట్టింది. పోతున్న చిన్నిని వెనక్కి పిలిచి "నువ్వు పగటించిదాక ఉండిరా నాకు జెరంతవసున్నది" అంటూ మంచెదిగిండు లింగు.

అప్పటికే ఆవార్త తెలిసిన ఇంకోపక్క మంచె చిక్రిం రాజు పెద్దకేకవేసి లింగును పిలిశాడు.

లింగు చిక్రిం రాజు మంచెకేసి నడిచాడు.

ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నారు నెత్తిమీదికి పొద్దచ్చింది- ఈ గండంగడు వాలంటే ఏమిచేయాలో ఎవరికీ తోచలేదు- ఇద్దరు గూడెంవేపు దారితీశారు. దార్లో బక్క, జంగు కలిశారు.... మరికొంతదూరం పోయేసరికి మరో ఇద్దరు కలిశారు. అందరి కళ్లల్లో ఆందోళన.... రెక్కలుముక్కలు చేసుకొని పిచ్చితుమ్మలునరికి రెండేళ్లుగా పంట అనుభవిస్తున్నారు.... ఈసారి మళ్ళా వెనుకటిభాగోతమే- జొన్న కొయ్యనిస్తరో లేదో?

గూడెంలోకి నోటీసులచ్చినయన్నకబురు నిమిషాలమీద చేండ్లల్లోకి చేరి పోయింది. శివార్లుదాటి అన్ని గూడాలల్లోకి చేరిపోయింది- ఏ గూడెంలో చూసిన- ఏగోండు, కొలామ్‌రైతు ముఖంమీద చూసినా ఒకటేమాట- భూములను బేదఖల్ చేయాలట-

లింగు వాళ్ల గూడెం చేరేసరికి బంగ్లాలో (పటేల్ ఇంటిపక్క గూడెంలోకి వచ్చిపోయే అధికార్లకోసం వేసినగుడిసె) చాలామంది జమయ్యారు.

గూడెంపెద్ద సోనేరావు ఉబ్బుబెంపలు కదులుతుండగా ఏదో చెప్పుకపోతున్నాడు. తాను ఖాయిలుకల్పి గూడెంలోకి వస్తుంటే పోలీసోల్లు కల్సినసంగతది.

"సోనేరావు ఎక్కడున్నడు ఖాయిలనడిగిండొకడు- ఏమో మాకు తెలువది ఖాయిలు అన్నరు. వానిమీద సానకేసులున్నయి మొన్న పోరకలసారును పట్టిచ్చి నోన్ని నరికిన కేసుల వాడున్నడు ఇగ నేను ఖాయిలచాటుకు జరిగిన. వాళ్ళ పక్కనున్న పోలీస్‌పటేల్‌గాడు నన్ను చూడనేచూసిండు- వాళ్ళకుసూపిండు- వాళ్లు నాచెయ్యి

పట్టుకున్నరు. ఇగట్ల భాయిలుఎగబడ్డరు. టోపీ ఒకలు గుంజుతె అంగిఒకలు లాగిండ్లు వాళ్ల తుపాకులు సదురుకుంట నన్నిడ్సిండ్లు. ఇగ చెంగోబిల్ల అడివిలబడ్డ. నాకోసం పచ్చిండ్లనుకున్న లంజకొడుకులు. అయితే బేదఖల్ నోటీసులు తెచ్చిండ్లన్నమాట."

"జురిత్ లచ్చిండ్లు. గూడెంకచ్చి బొగడమీద నిలుసుండి ఏమి ఎరుగనట్టె సోనేరావు గాడున్నడా అన్నరు. లేడన్నమోలె జైతుదాదాను. మరికొందరిని పిల్చిమీకు నోటీసులచ్చినయ్ అన్నరు." ఒక ముసలవ్వ.

"పట్టాలిస్తండ్లా? అంటునేనడిగిన" జైతుదాద.

"ఇగప్పుడు నవ్వుకుంట. ఆఁఆ పట్టాలే. ఆభూముల్లనుంచి మంచిమాటకు వెళ్ళకపోతే మీదిలోకానికి పట్టాలుదెచ్చినం. మాదెర్.... ఆతిట్లు ఎవలకొస్తయి." రవికెలేని ఒకస్త్రీ పైట బొడ్లోచెక్కుకుంటూ....

"ఇగ ఒక్కొక్కలు బాయిలంత కుప్పకూడిండ్లు. మీరు లోటీసులు తీసుకోండ్లి.' అన్నడో ఎర్రిటిపోలీసు. లచ్చుబాయి 'ఆ నెగట్ల ఏసిపోండ్లి'అన్నది.... వాడు పండ్లుకొరికి మీదిమీదికొచ్చిండు. బాయిలందరు ఆకోపంచూపి నవ్విండ్లు. ఇగ కొడుతదేమొ? ఇండ్లుకాలబెడ్తడేమోనని నాకు భయమైంది. వాళ్ళండ్లవాళ్ళే కయ్యర బియ్యర మాట్లాడుకొని గుడిసెలకు కాయిదాలేసిపోయిండ్లు" జైతుదాదా చెప్పుకొచ్చాడు.

అట్లా చాలాసేపు నవ్వుతూ, పండ్లుకొరుకుతూ విన్నారు. ఎవలకుతోచింది వాళ్ళు చెప్పుకొచ్చారు. కాని ఇగ గిదిచేద్దామని ఎవలు చెప్పలేకపోయారు.

ఆఖరుకు సోనేరావు కలుగజేసుకొని "గిసొంటిమాటలు మసందరికన్న లింగుకే బాగెరుక." అన్నాడు.

లింగు ఆలోచనగా "నాకుమాత్రం ఏమెరుక?" అన్నాడు.

"నీకెరుకలేకుంటె ఎవలకు తెలుస్తది. నువ్వ సంగానికిపెద్దవు. పొరకల సారును తీసుకొచ్చి భూములుతెచ్చింది నువ్వుకాదా?" అంబతిరావు.

"ఏంచేద్దాం లింగుదాదా! పొరకలసార్లుంటే మంచిగుండు" ఒక ముసలివాడు చుట్టతాగుతూ.

లింగు తుపుక్కున ఊంచిండు. అది దూరంపడక తన గడ్డంమీదనేపడ్తే తుడుచుకుంటూ." గుడ్డొచ్చినంక గూడుగావాలని ఎతికితిమి. మనం ఏదచ్చిన తుడుం

గొట్టాలెనని అనుకుంటిమి. ఒక్కేడుగొ త్తిమి. గూడేలల్లకొచ్చిన కాకిబట్టలోల్లను అన్ని గూడాలల్లోల్లం గలిసి తరిమితిమి. భూములచ్చే. ఇగ మన కెవడడ్డం. ఊకె కొట్లాటేనా అని తుడుం ఆపితిమి. సార్లు పట్టాలకు కదులుమంటె ఎందుకంటిమి. బాందే (తుపాకి) లట్టు (దుడ్డు) బట్టంది భూమిదక్కదంటే నాలెకువెుకమే స్తిమి.... సార్లొచ్చిండ్లంటె తలోదిక్కుపోబడ్తిమి." లింగు చెప్పుకపోతున్నాడు....

"అదంతా సరేలింగూ.... ఇప్పటిసంగతి చెప్పు." జంగువిసుగ్గా....

"ఇప్పుడు సారెక్కడున్నదోకదా? విచారం చేద్దామంటే నాకైతే ఎటూదోత్త లేదు." లింగు....

"గట్లంటెఎట్ల? సార్లకు గీసంగతి తెలుస్తది.... సార్లువస్తరు....పోనీ సార్లచ్చె నంక మనమేంచేద్దాం" సోనేరావు అటిటుచూసి ఓ ఇప్పమొద్దుమీద కూలబడుతూ.

"ఇగోసోనేరావు నువ్వు ముందటబడాలే. నాకనిపిచ్చేదేందంటే. మల్లమనం గూడెం గూడెందిర్గి మనోల్లందర్ని కుప్పేయ్యాలే. విచారంచెయ్యాలే." జంగు అన్నాడు.

"బాగనేఉన్నది నామాట ఎవలింటరు?" సోనేరావు.

"గదేంది. నువ్వుకొద్దోగొప్పో సారుతోటి పోనేబడ్తివి. నిన్నే మేంసారను కుంటం. మనమే ముందటబడాలెగదా?" జంగు అందరికేసి చూశాడు తన మాట ప్రభావం ఎట్లున్నదో గమనించడాన్కి.

"అందరు గట్లంటెసరే. కని హన్మంతరావన్న ఉన్నబాగుండు. సంగంలో అందరికన్న పెద్దగదా! అయినమీద లేనిపోని కేసులుబెట్టిరి. అయినె కేసులసుట్టు తిర్గడానికే సరిపాయె. గిట్ల కేసులుబెడ్తండ్లు గన్కనే మనసార్లు సాటుసాటుకు తిరుగు తండ్లు. మనపొరకలపార్టీ బలంపెరిగేదన్క గిదితప్పదేమొ?" సోనేరావు

"గిట్ల ముంగటబడ్డోళ్ళమీద కేసులుబెట్టి జేల్లపాలుజేత్తె ఇగ లడాయి ఎవలు నడిపియ్యాలే. భూములెట్లరావాలే. మనమే ముందటబడాలే. వాళ్ళను మనంకాపాడు కోవాలే. మనబలం పెంచుకోవాలే. భూములులేంది బువ్వలేదు. బువ్వలేంది బతుకు డెట్ల? సర్కారోడు తుపాకులతోని గాల్పిచ్చె. మీదికెల్లి గుడిసెలమీదికి పెంక లంటడు. బోరింగంటడు. దారులంటడు. తొవ్వలంటడు. గియ్యన్ని నెత్తిలకొట్టు కుంటమా? భూములిత్తె అన్నిచ్చినట్టె. వాడెందుకిస్తడు? వీనవ్వను బెయిన్‌మాచ్చ (ఇదొక గోండుతిట్టు) రాజు లొడలొడ వదురసాగిండు.

"సరే! సరే నేను అందర్నికలుస్తా! అందరితోని మాట్లాడ్తా! రాజు దాదా నాతోవత్తవా?" సోనేరావు.

"ఆఁ వత్తపా" రాజు.

"ఇగ సారువస్తె మేము గిట్లపోయినమని చెప్పండ్లి- సార్లే మమ్ముల ఎక్కడున్న కలుస్తరు." అంటూ సోనేరావు ముగించాడు....

అక్కడి నుండి ఎప్పుడు వెళ్ళాడో జంగు బొగడమీద తుడుం మోగించ సాగిండు...

* * * *

సాయంత్రం సూర్యుడు గుట్టల్లో ఒదిగి ఒదిగి ఎర్రెర్రగా వెలుగుతున్నాడు- పక్షులు గుంపులు గుంపులుగా లొల్లిచేస్తూ గాలికి చెల్లాచెదురైనట్లుగా లేస్తున్నాయి.... ఒక గూడెంలో తుడుం మోగింది- అలలు అలలుగా పైరగాలిలో తేలిపోతూ బండలను, కొండలను, చెట్లను, చెట్లకొమ్మలనుముట్టేసి ఒకగూడెం నుండి మరోగూడెం చేరుతోంది- దానికి సమాధానంగా మరో గూడెంలో తుడుంమోగింది.... అడివిల జంతువులు బెదిరిపోయేవిధంగా తుడుంమోత....

జనం బొగడగూడెం దిక్కుగా నడుస్తున్నారు.... సూర్యుడు కుంగిండు- ఎన్నెల పైకెక్కవచ్చింది....

బంగ్లాలో అప్పటికే చాలామంది ఉన్నారు. వచ్చేవాళ్లు వస్తున్నారు- బంగ్లా ముంగటి నెగట్లో డికాషన్ మరుగుతోంది.... ఖాయిల వచ్చిన అతిథులకు తాగమని యిస్తున్నారు- పెద్దపెద్ద నెగళ్లు వేశారు- మంటవెలుగులో అందరిముఖాలు ఎర్రెర్రగా.... వెలతెలాబోతూ పైన చల్లగా తెల్లగా వెన్నెల....

హన్మంతరావు మందిలో నుంచిలేచి "మీకందరికీ రాంరాం" అన్నాడు.

అందరు గొనిగినట్లు "రాంరాం దాదా రాంరాం" అన్నారు.

హన్మంతరావు సన్నగాఉన్న చెయ్యెత్తి గాలిలో తిప్పుతూ "మనం బాగా కరేమాయినా (తెల్సుకోవాలె) మల్ల ఇప్పుడు ఊరూరికి బేదఖల్ నోటీసులొత్తన్నయి. ఇంకాకొత్తగా భూములు కావాల్సిన వాళ్లు అడివి నరుకుతనేఉన్నరు. మనం పంట దీసేటందుకు ఎంతకష్టపడ్తమో? భూమి దక్కిచ్చుకోను అంతకష్టపడాలే. మావా రెక్కలకష్టెం- మావాభూమి- అందుకనే మనపొరకలపార్టీ సంగం "ఊడువానికే

భూమి ఫాజీలే" అంటంది. అంటే ఏందన్నమాట. దున్నేటోడు తన భూమి తనే కాపాడుకోవాలే. మనంఊకుంటే మళ్ళ చేండ్లు బీడుబెట్టి పిచ్చితుమ్మలు మొలిపిస్తరు. బాగా ఆలోచించుండ్లి. రేపు పోలీసులు బేదఖల్ చెయ్యిమంటవస్తే మనం తుడుంగొట్టి గిట్లనే జమై ఎదుర్కోవాలె. మీకు వచ్చిన బేదఖల్ కాయిదాలు ఈనెగట్లవేస్తరా? భూముల్లనుంచి తొలిగిపోతరా?"

"సిల్లే సిల్లే వాటోట్ రే నెగడ్తా" (లేదులేదు ఎయ్యిండ్లిర నెగట్ల) వందల గొంతులు....

"ఊడువానికే భూమి పాజీలే" ఎవడో మందిలోనుంచి మొత్తుకున్నాడు.

అందరు గొంతుకలిపారు. గుట్టలు దద్దరిల్లాయి.

"మరట్ సందీర్ ఓంది ఆయానా" (మనందరం ఒక్కటిగావాలె)

మరట్ తుడుం పాయాన (మనందరం తుడుం గొట్టాలే)"

అరుపులు - నినాదాలు.

"ఎప్పుడు ఎక్కడ పోలీసులొచ్చిన మనంతుడుంగొట్టాలే. మనం గీ లడాయిల ఊరికిద్దరం సార్లతోని షరీకుగావాలె. వాళ్ళు లట్టులతోనివస్తే మనం లట్టులేపడుదాం వాళ్ళు మాటలతోనిపస్తే. మనం మా కు భూ మి కా వా లె న ం దా ము. వాళ్ళు తుపాకులుతెస్తే మనం తుపాకులుబట్టాలె. ఇందర్‌వెల్లివీరుల గుర్తుకుతెచ్చుకోండ్లి. కొమురం భీందాదాను యాదికితెచ్చుకోండ్లి." హన్మంతరావు మచ్చలముఖం ఎర్రిగా మెరుస్తోంది.

జనం ఆ మెరుపు తమ గుండెలకు అద్దుకుంటున్నరు. గతంలోజరిగిన పోరాటాలు ఇందర్‌వెల్లి. ఎర్రికొండా. పొరకలసార్లు.

"మరట్ బాండే పియ్యానా (మనమే తుపాకి పట్టాలే.)

మావారాజ్జెం వాయానా (మనరాజ్జెం రావాలే)

మనకు సుఖం మందానా (మనకుసుఖం దక్కాలే)

అరుస్తూ, నినదిస్తూ జనం ఎవరిగూడాలల్లోకి వాళ్ల వెళ్ళిపోతున్నారు.

భర్త ఇంకారాకపాయెనని మంచెమీద ఎదురుచూస్తూ చిన్ని ఒంటరితనాన్ని పారదోలడానికి కాసేపు "రేలా.... రేలా...." అంటూ పాడుతోంది....

లింగు అడ్డదిడ్డంగానడుస్తూ "బాండే" గురించి ఆలోచిస్తూ చేనుకేసి రాసాగిండు.... అతని మనుసులోసాగే ఆలోచనలు చిన్నికేంతెలుసు పాపం....

కుంపటి

కార్మిక

ఆదేమికోపమోకాని పొద్దటినుంచి లచ్చిమి కోపముతోటి చిర్రుబుర్రులాడుతూనే ఉంది. లేషిలేవటముతోటి మొగడు చంద్రియ్యతో దెబ్బలాడింది. "కాళ్ళు సాపుకొని అట్లాపంటే తిండిఎట్లా- గీ పస్తులుండుడు నావల్లకాదు. కోమటోడు కాతామీద సరుకులియ్యనన్నడు. పోయిననెల బాయిస్టైక్ ఉండి జీతము సరిగారాలేదంటే యింటడా- ఏమన్ననా.... అందరు గిట్లనేసెపుతాండ్లు. నాకు బాకిపెట్టినోనికి నేనేమి చెప్పాలి. పోయిననెల గింతేనాయే. ఇప్పటికి ఇంక నాలుగునూర్లు రెన్నెల్లకాన్నుంచి నయాపైస యిచ్చుడెలేదాయె. అంటు గింజలుపోసేదిలేదంటు ఖచ్చితంగా చెప్పిండు" బడబడ వాగుతున్న లచ్చిమి మాటలు వినిపించినా వినిపించుకోనట్టు లేచి ఎటో పోయిండు చంద్రియ్య

లచ్చిమి తనలోతనే ఏదోగునుక్కొంది. ఎటుతోసక పొల్లగాడేడిస్తే దబ్బడ దబ్బడ నాక్కెపింది. వాడులబోదిబోమంటే మళ్ళీవాన్ని బుజ్జగించింది. ఇంట్లో కుండలన్ని ఎతికితే అర్ధసేరు నూకలున్నయి. అవైనా గాలిస్తామంటే అంపలికుండల కాడ నీల్లులేవు. "ఓపోరి కుండెడు నీల్లుతీసుకొస్తె ఏమైద్దె. గింత గింత పోరగాండ్లు చిన్న చిన్న చేతులుపెట్టుకొని చిట్టర చిట్టర పనిచేస్తరు. నీకెమిపట్టిందె చిందమెత్తు సారగము చెయ్యవు" కూతురు మల్లవ్వను కసురుకుంది.

"సన్నెక్కడ పట్టుకోనిస్తరె నల్లకాడ మనెత్తున్న తుర్కది లొల్లిపెట్టుకుంటాండ్లు. గంటసేపున్న నీల్లపట్టుకోనియ్యలె" నాదేమి తప్పులేదన్నట్టు మల్లవ్వ చెప్పింది.

లచ్చిమి అంపలికాడి కుండను పట్టుకొని నీల్లకుపోయింది. మల్లవ్వ చెప్పినట్లు వాడవాడంతా నల్లచుట్టే గుమికూడిండ్లు సన్నగా పొల్లగాడు ఒంటేలుకు పోసినట్లు నల్లనీల్లు ఒక్కకుండనిండటాల్లకె జామసేపయితాంది.... ఇప్పుడప్పుడే తన్నుపట్టుకొనిచ్చెట్టులేరని వంతుకు కుండేసి మళ్ళీ గుడిసెగుచ్చింది. మళ్ళీ పొల్లను గదిమింది వంతుకు వచ్చినంక నీల్లుపట్టుకొమ్మని" మల్లమ్మ నీల్లకుపోయింది.

బొగ్గుపొయ్యి అంటేస్తమంటే ఇంట్ల బొగ్గులేదు పక్కింటి కొమరక్క ఇంటికి పోయింది "అక్కబొగ్గున్నదా" అని "లేదుచెల్లే బాయినడిసై ఆయన సైకిలుకు ఇంత

పెల్లపెట్టుకొనితెచ్చేటోడు బాయిబందయి పదిహేనురోజులాయెనా.... ఉన్నదిలేనిది అంతఊడ్చి నేనేబొగ్గుపొయ్యివేసిన.... ఇంకా మాపటికిఎట్లనో" అందిలేదన్నట్లుగా

"అదిపరెగానిఅక్కా! ఇంక బాయిలు ఎన్నిరోజులు బందుంటయట. గిట్లయితె బువ్వతిన్నట్టే పోయిననెలల లాడీసాయనకు బొగ్గుపెల్లపడి కాలువిరిగిందని.... కాలు యిర్గి నాయనకు సర్ పేస్‌వర్కు కావాలని రెండువారాలు బందయిందా.... దాంతో ఆ నెలల సగము జీతముకూడ సరిగా రాకపాయె మళ్ళీ ఏమిముంచుకొచ్చిందో"

"అదేందో పనిచేసేపేసుల్ల మందిని ఎక్కువ పెట్టిండ్లట"

"అంటేందక్కా" లచ్చిమి అర్థముకాక అడిగింది.... కాని కొమురక్కకు కూడా పూర్తి వివరాలు తెల్వదు దాంతో నాకుకూడ తెల్వదన్నట్లు మొఖము పెట్టింది.

కాని వాకిట్లో పండుకున్న సాయిలు పరాసికంగా "అక్కాచెల్లండ్లు ముచ్చటాడుకున్నట్టను కుంటాండ్లాఏంది? బాయిపనంటే" మంచముల పండుకొనే పళ్ళుయికిలిస్తు వాళ్ళకేసి తిరిగిండు. "ఆ! బహుకష్టపడుతాండ్లు ఉత్తగున్నదిమేమేనా బాయి ఎందుకు బందున్నదో తెలిస్తెచెప్పరాదు....లేకుంటే ఊకోరాదు" కొమురమ్మ మొగన్నిదెప్పింది

సాయిలు వాళ్ళమీదినుంచి దృష్టిమళ్ళించుకొని వెలికిల్లా పండుకొని పందిరి గుంజకేసిచూస్తు చెప్పుకొచ్చిండు "కంపినోనికి మారెక్కలకష్టమెట్లా పిండుకోవటము, ఎలాగు లాబాలు పెంచుకోవటము ఉత్పత్తి పెంచటము, ఎట్లా అన్నఆలోచన తప్ప కార్మికుడు ఎట్లపనిచేస్తాండు- వాని కష్టసుకాలేమిటన్నజాస వాడికెందుకు. కసాయోని తీర్గ కంపినోడు. మా నెత్తురు పిండుకొంటాండు. అందుకు కొత్తకొత్త పద్ధతులు పెడుతాండు. యూనియనోడు ఇదేందిఅని అడుగుతలేదు. మొన్న మా బాయిల వర్కింగ్ పేసుల పదిమంది ఉండే వర్కింగ్ పేసుల్ల పన్నెండుమందిని పెట్టిండు. పన్నెండుమంది లాడీసోల్లు మస్షి రెండుటబ్బులు నింపితేకాని కూలిగిట్టదు. పేసుల్ల యిరకాటమైతది. కోల్ కట్టరు ఇదివరకంటే పొక్కలు ఎక్కువకొట్టాలి. షార్టు పైరర్స్ అంతే. టబ్బులసంగతి సరెసరే అవిసరిగా అందయి. దాంతో లాడీసోనికి కూలిగిట్టదు. లాడీసోనికి కూలిగిట్టినా గిట్టకపోయినా, కోల్ కట్టర్స్‌లోని, షార్టుపైరర్లతోని సర్దార్లతో ఎక్కువపనిచేయించుకోవచ్చు. ఇదివరకు పదిమందికి చేసేకాడ ఇప్పుడు పన్నెండుమందికి పనిచెయ్యాలె అంటె వాళ్ళమీద వర్కులోడు పెరిగింది. పేసుల్లరద్దీఎక్కువై మనిషికి మనిషిరాసుకుంట ఇర్కుడయితాంది. లేబరోడు ఎట్లనత్తేంది మాకు పొలిటిషన్ రావాలంటడు కంపినోడు పేసుల్ల. పదిమందికంటే

ఎక్కువపెట్టద్దని చట్టముకూడఉంది. కంపినోడు చట్టాన్ని కాతర్ చేయకున్నా ఇదేం దని యూనియన్‌వాడు అడగుతలేడు. ఇకభరించలేక మేమే బాయిబందుపెట్టినము" సమ్మెందుకు జరుగుతుందో సాయిలుచెప్పేసరికి ఒక్కక్షణం ఏటుతోచింపికాదు లచ్చిమికి. 'ఏంబతుకులో పాడుబతుకులు' అనుకుంటు మళ్ళీ ఇంటికొచ్చింది.

మల్లవ్వ నీల్లకుండపట్టుకొచ్చి అంపలికాడపెట్టింది. బొగ్గుపొయ్యి అంటించా లన్న జాసకొచ్చి "బిడ్డా కాస్త సిఎస్‌పి కాడికన్నపోయి ఓ తట్టెడు బొగ్గుతీస్కరావే నీ కాల్లుమొక్తగని" బతిమాలుతున్నట్టుగా.

"అక్కడ బొగ్గు తీస్కరానియ్యరే. వాచ్‌మన్ ఉంటడు. చూస్తె కొట్టడానికి వస్తడు నేనుపోను" అంది మల్లవ్వ మారాముచేస్తు.

'మాఅవ్వ మంచిదానవుకాదుబిడ్డా ఎట్లయినాపోయి గీ తట్టెడు తీస్కరాపో. పొయ్యిఅంటేయ్యకుంటే బువ్వఎట్లతింటవు' బుజ్జగిస్తూ తట్టచేతికిచ్చింది.

మల్లవ్వ గునుసుకుంటూ, మారాముచేసుకుంటనే తట్టతీసుకొన్నది. దంగానికి ఉన్న పాతరైకను సుట్టబట్టకోసమని తీసుకున్నది.

మే మాసము ఎంత. ఉదయము సూరీడు బారెడుపొద్దెక్కగానే ఎండ చురచుర లాడుతుంది. రోడ్డుమీదపర్చుకున్న నల్లటిబొగ్గుదుమ్ము కొద్దికొద్దిగా వేడెక్కుతుంది. బావులు బందుండటమువలన ఆ రోడ్డుమీదతిర్గే కంపినిలారీలులేక రోడ్డునిశ్శబ్దంగా ఉంది. అటుఇటుపోతున్న మనుష్యులు తాపీగా నింపాదిగాపోతున్నరు. బావులు నడిచి నప్పుడున్న తొందర ఇప్పుడెక్కడిది ?

మల్లవ్వ గుడిసెలనుంచివచ్చి సి.ఎస్.పి. రోడ్డుఎక్కింది. వోవరుబ్రిడ్జిమీదికొచ్చి సి.ఎస్.పి. కేసి చూసింది. అక్కడొక్కటి ఇక్కడొక్కటి లారీలు స్టాకుకోలు నింపు కొంటున్నాయి. మన్నుతిన్నమంజరలా సి.ఎస్.పి నిశ్శబ్దంగాఉంది సిఎస్‌పి నడిచినప్పు డుండే బడబడ సప్పుడుగాని, ఆకాశానికిఅంటే నల్లటి బొగ్గుధూళిగానిలే ఎండకు ప్రతిఫలిస్తుంది.

మల్లవ్వ తట్టపట్టుకొని రోడ్డుదిగి ఎగుడు దిగుడు నేలమీదుగా బావులునడిచినా నడవకున్నా ఎప్పుడుపారే మురికికాలువ పక్కగానడిచింది. సి.ఎస్.పి.కంటే ముందు వచ్చే "బంకరు"కాడ చూసింది బొగ్గుఏమన్నా అగుపిస్తుందోఏమోనని కాని బావులు

బందుండటము మూలంగా 'బంకరు' కాడ ఊడ్చినట్టుగా నోరుమూసుకున్నదయ్యం తీర్గ నేలకేసి చూస్తుంది. బంకరుమీద మనుష్యులున్నజాడ కనిపించలే. బంకరు పక్కగా సి ఎస్.పి. కేసి నడిచింది.

సి.ఎస్.పి. పక్కన బావులు బాగనడుస్తున్నప్పుడు రైల్వేవ్యాగన్ల సప్లయి సరిగా లేనప్పుడు 'డంప్' చేసిన బొగ్గు కుప్పలు కుప్పలుగాఉంది. ఆ కుప్పలు ఎటుఫర్లాంగు దూరమువరకు పరుచుకొని ఉన్నాయి. ఆ బొగ్గుకుప్పల చివరన స్టాక్‌కోల్‌ను లిఫ్టు చేస్తున్న లోడరుచప్పుడుతప్ప అంతా నిశ్శబ్దంగాఉంది.

మల్లవ్వ అటుఇటుచూసింది. ఎవరులేరని నిర్ధారించుకొని ఓ కుప్పచాటుకు కూసొని తట్టలోకి బొగ్గునింపుకొంటుంది.

కాని వేబ్రిడ్జుపక్కన గోడకుఆనుకొని స్టూలుమీదఃకూచున్న ముసలి 'వాచ్ మన్' అదేపనిగా దవడలు లొట్టలుపడంగ సుట్టకాల్చుకుంటు నింపాదిగా కూచునోడు తన గద్దచూపుతో బొగ్గుఎత్తుతున్న పొల్లను చూసిండు. చూసినోడు ఇక్కడినుండే కేకవేస్తే పారిపోతుందని బొగ్గు దొంగతనముచేస్తున్న పోరినిపట్టుకొని సీనియర్ ఇన్‌స్పెక్టరుముందు హాజరుపర్చి ముసలోడైనా మంచిపనోడు అనిపించుకోవాలనో ఏమో? మెల్లగా పిల్లిలా అడుగులువేసుకుంటు లాటీపట్టుకొని బయలుదేరిండు. కంగారుగా తట్టలోకి బొగ్గునింపుకుంటున్న మల్లవ్వ చిన్నగా ఏదోఅలికిడి అయ్యే సరికి తలెత్తిచూసింది. ముసలివాచ్‌మన్ దగ్గరికి రానేవచ్చిండు. ఒక్కక్షణం భయంతో వణికిపోయింది. గబుక్కన తట్టను అక్కడేకుమ్మరించి తట్టందుకొని పరుగుపెట్టింది. ముసలివాచ్‌మన్ 'ఓపోరీ ఆగుః' అని అరిచిండు. కాని ఆగకుండా అదేతీరుగా పరుగెత్తుతున్న అమ్మాయినిచూసి తను పరుగెత్తి పట్టుకోలేనని నిర్ధా రించుకొని పరిగెత్తుతున్న మల్లవ్వకేసి చేతిలోని లాటీని రువ్విండు.

రివ్వున లాటీ మల్లవ్వకు తాకకుండా పక్కగావచ్చి మల్లవ్వకంటేముందే పడింది. ఆ లాటీయేకనుక తాకేదుంటే అడ్డముపడిపోయేది. కాని తప్పిపోయింది. ముందుపడ్డ లాటీనిచూసి భయంతో ఇంకా బాగాపరుగెత్తింది....

వోవరుబ్రిడ్జిరోడెక్కి వెనక్కితిరిగిచూసి 'అమ్మయ్య' అంటు అప్పుడు నిట్టూర్చింది. వాచ్‌మన్ వెంటరావడంలేదని నిర్ధారించుకొని ఆయాసంగా మెల్లగా నడవటము మొదలుపెట్టింది. వోవరుబ్రిడ్జిమీదికొచ్చి చూసేసరికి సి.ఎస్.పి ఈవలివైపు

లోడ్ చేయబడిఉన్న రైల్వేవ్యాగన్లనుండి కొంతమందిబొగ్గు ఎత్తుకపోతున్న దృశ్యము కళ్ళపడ్డది. కాస్త చెమ్మరించి పరకాయించి చూసింది. పది పదిహేనుమందిదాక వ్యాగన్లనుండి బొగ్గు తట్టల్లోతీస్కపోతుంటే చూసి 'ఎలాగైనా ఇంటికి బొగ్గు తీస్కరమ్మ"న్న తల్లిమాటలు గుర్తుకొచ్చి.... ధైర్యము తెచ్చుకొని మళ్ళి రోడ్డుదిగి ఈసారి వ్యాగన్ల కేసినడిచింది.

సి ఎస్. పిలో 'లోడ్' అయిన బర్తి వ్యాగన్లపైకిఎక్కి కొన్నిబొగ్గుపెల్లలు క్రిందికి రాల్చి.... రాల్చినబొగ్గును తట్టల్లోకి నింపుకొంటున్నారు. అక్కడ వాచ్‌మన్ ఎవరు ఉండరని వ్యాగన్లకాడికొచ్చింది.

అప్పటికే తట్టల్లో బొగ్గునింపుకున్నవాళ్ళు మెదలిర్గిపోతయా అన్నట్టుగా అఘాచ్చనతో బరబర ఎల్లిపోతాండ్లు. మరికొంతమంది వ్యాగన్లనుండి బొగ్గుపెల్లలు క్రిందకు పడదోస్తుంటే తట్టల్లోకి ఏరుతున్నారు మరికొంతమంది.

మల్లవ్వ అతికష్టముమీద వ్యాగిన్ పైకెక్కింది.... తన చిన్నచిన్న చేతులతో బొగ్గుపెల్లలను క్రింద తోస్తుంది.

అంతలకే కలకలము బయలుదేరింది.... ఉరికినోల్లు ఉరికిండ్లు.... ఉరకనోల్లు దొరికిండ్లు.... మళ్ళ, సేలు రాయిరప్పలు ఎత్తుగాగుట్టగా పోసికున్న కుప్పసాటునుండి రైల్వేసిబ్బంది దాదాపు పదిమంది టూతాత్తుగా దాడిచేసి దొరికినోల్లను దొరికినట్టుగా పట్టుకున్నరు.

వ్యాగన్‌పైనున్న మల్లప్వకు ఈ సంఘటనచు సి పైప్రాణంపైన్నే పోయినంత పనయింది.... ఏడ్వటము మొదలుపెట్టింది

"దొంగపోరీదిగు సోయగాల ఎడ్పుఏడుస్తానవు" గడ్డము మీసాలను సోగ్గా పెంచుకున్న రైల్వేఉద్యోగి అరిచిండు....

భయంతో యింకా బాగా ఏడ్వటము మొదలుపెట్టింది.

"సీయవ్వ....దిగుతవా....లేదా.... లేకుంటే రాయితో యిసురత దిగునీయవ్వ" రైల్వే యునిఫారమ్ వేసుకున్న నల్లటోడు బెదిరించిండు.

అయినా మల్లవ్వ ఏడ్పుఅపలే వ్యాగన్‌దిగలే

దొరికినోర్లందరిని వరుసగా నిలబెట్టిండుఒకడు. వాళ్ళెక్కడికి పారిపోకుండా మరోనర్గురు కాపలాకాస్తున్నరు.... దొరక్కుండా పారిపోయినోల్లు దూరంగా ఉండి

చోద్యంచూస్తున్నరు. వ్యాగన్ ఎక్కిన రైల్వేఉద్యోగి మల్లవ్వ రెండు జబ్బలు పట్టుకొని జారవిడిచిండు.... కిందపడ్డ మల్లవ్వ కడుపుల పేగులు తెగిపోయేట్టు ఏడుస్తూనే ఉంది. ఇందాకటి రైల్వే యూనిఫాం వేసుకున్నవాడు "నీయవ్వ పోరి ఊకుంటవా లేదా" అంటు ఒక్కటి సరిచిండు.... మల్లవ్వ బెదిరిపోయి మూతిముడుచుకొని ఎక్కి ఎక్కి పడ్తాంది....

తెల్లబట్టలేసుకొని ఇన్‌షర్ట్ వేసి బెల్టుపెట్టుకున్న నడీడుమనిషి 'కొట్టకు' అని వారించిండు.

దొరికినోల్లందరిని ఒకచోటనిలబెట్టిండ్లు. వారిలో ఆస్మాన్‌రంగు రెక్కల బనీను వేసుకున్న ముసలోడు "బాంచెన్ ఏంచేత్తరు.... ఏదో పొయ్యిలకు పెల్లలు లేవంటే రెంటికచ్చినోన్ని రెండుపెల్లలు పట్టుకపోతనని వచ్చిన బాంచెను ఇడ్సిపెడ్తె యింటికిపోతా.... మరోసారి ఈచాయలకురాను బాంచెను" అంటు తెల్లబట్టలాయన్ను ఉద్దేశించి రెండుచేతులు జోడించి దండంపెడ్తు బతిమాలిండు.

'ఈ దొంగనాటకము సాలు. ఇది నీఅవ్వమిండందని బొగ్గు తీస్కపోను వచ్చినావురా ముసలోడా. బొగ్గుఎత్తుకపోయి అమ్ముకుంటామని కాదురా' జర్దానోరు కస్సర బిస్సర నములుకుంటు కసిరిండొకడు.

'అవ్వతోడు పొయ్యిఅంటిస్తమంటే బొగ్గుపెల్లలేకుంటె వచ్చిన.... ఇంకోసారి ఈ తప్పుచేయముసార్' పెయ్యిమీదఅంగిలేని లేబరాయన అన్నాడు.

"అయితె ఇంకోసారి మేము పట్టుకోము సరెనా" అంటు జవాబిచ్చిండు అంతవరకు ఒక్కమాటయిన మాట్లాడని బోడిమూతాయన.

ఇదంతా ఏమి అర్థముగాని ముసల్ది ఒకతి "పట్టకపోయి ఏంచేస్తరయ్యా" అంది దీర్గముతీస్తూ.

"అత్తగారింటికి తీస్కపోతము" యూనిఫామ్‌వాని జోక్‌కు కిసుక్కున నవ్విండు ఇంకొకడు.

ముసల్దానికి కోపమొచ్చింది నింపుకున్న బొగ్గుతట్టను కుమ్మరించి "నీబొగ్గు నేనేమి తీస్కపోతలేను".... పోబోయింది.

"ఎక్కడికి పోతానవు అత్తగారింటికి రానంటే ఊకుంటరా గుంజకపోతరు" ఎటకారంగా పల్లికిలిస్తు అన్నడు యింటాకటివాడే.... ముసల్దాని ఒళ్ళుమండి ముందుకు పోబోయింది.

ముందుకుపోతున్న ముసల్దాని చెయ్యిపట్టిలాగిండు రైల్వేపోలీసు.... ముసల్ది అడుఃపుకు కూలబడి కోపంతో నీచేతులకు జెట్టలుపుట్ట.... ఎంతగనము పదేస్తివికదరో నిన్నెత్తుకపోను.... అంటు శాపనార్థాలుపెడ్తుంది....

పోలీసోడు కోపంతో లాటీ ఎత్తిండు

ముసల్ది అదిచూసి ముందుకొస్తు "కొడ్తావురా....కొట్టు ఎందుకు కొడ్తవురా నీఇంట్లకెల్లి ఏమన్నాఎత్తుకొచ్చినానురా నీఇంట్ల పీనుగెల్లా నా నడుము యిరగ్గొడ్తివి కదరో...." అంటూ ఆయాసంగా మూల్గింది.

లాటిఎత్తిన పోలీసోడు ఏమనుకున్నడో ఏమో లాటిదించిండు,

ముసల్ది అదే పనిగా ఊరుపేరు లేకుండా తిడ్తూనేఉంది.... "బాయిల పన్జెసె టోనికి కుంపటి రాజేసుకుంటమంటే బొగ్గుకరువైంది మేమేమన్న దొంగతనంగా లారీలకు లారీలు వ్యాగన్లకు వ్యాగన్లు అమ్ముకుంటానమా గట్లలారీలకు లారీలు అమ్ముకునోడు సుఖంగనే ఉన్నడు. వ్యాగన్లు వ్యాగన్లు మాయమైపోయినప్పుడు ఎటుపోయింది ఈఃతెలివి. పొయ్యిలకు నాల్గుపెల్లలు తీస్కపోతే దొంగతనమైందా "

ముసల్ది ఆదేపనిగా ఏమో వదురుతూనే ఉంది.

అంతలకే మరోరైల్వే ఉద్యోగి ఖాఃగాపోతున్న లారీనిఆపి అందరిని అందులో బలవంతంగా ఎక్కించుకొని బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు లారి పోనిచ్చిండు.

వాడవాడంతా అట్టుడికిపోయింది. లచ్చిమికి ఎవలపొల్లగాడోవచ్చి 'మీ మల్లవ్వనుకూడా పట్టుకపోయిండ్లని' చెప్పేసరికి ఎక్కడలేని ఏడుపువచ్చింది. ఏడుస్తూనే ఊరుపేరులేకుండా శాపనార్దాలు పెట్టింది, "వాళ్ళచేతులకు సరుప్పలుపుట్ట పొలగాండ్లని సూడకుండా పట్టుకపోయిండ్లు.... వాళ్ళనుఎత్తుకపోను, వాళ్ళకుగత్తరతాక." తిడ్తూనే బిడ్డను ఏంచేత్తరో ఏమో అంటూ దీర్ఘాలుతీస్తు ఏడ్చింది.

పక్కింటిసాయిలు వాకిట్లోకివచ్చి "ఎందుకుఏడుస్తావు. సావకొత్తరా. పట్టుకపోయినోళ్ళు వాళ్ళే యిడ్చిపెడ్తరు. ఏడుస్తె ఏమొస్తది. చంద్రిన్నఉంటే బెల్లంపల్లికి పంపుతే ఏసంగతి తెలుసుకొస్తడు." అంటూ ధైర్యముమాటలుచెప్పినా కాని మనసులో ఒకమూల పీకతూనేఉంది. పట్టుకపోయినోల్లను కోర్టులో హాజరుపర్చి దండుగ వేస్తరని కాకుంటే జైలుకుకూడ పంపిస్తరని తెలుసు అయినా ఏమైతె అది అవుతుందిలే అని తనలోతనే సమాధానపడ్డడు చిఃరికి" "మస్టరు ఏసుకోను పోయినోడింకారాలేదా"

"ఏడనచ్చిందో ఏమో" లచ్చిమి.

"జరనువ్వన్నాపోయి జాడ తెల్సుకరారాదు. బాయిబందున్నదికదా అని తీరిపారి వస్తడు" కొమురమ్మ మొగన్నిపురమాయించింది.

లచ్చిమి కుడ్తిలపడ్డ ఎల్కతీర్క గిజగిజలాడింది. బుర్రఏమిపన్జేయలేదు.... అదేపనిగా ఏడుస్తుండిపోయింది.

సరే నేను బాయిదాక పోయివస్తానంటు" సాయిలు చంద్రియ్య జాడకు పోయిండు. పొద్దున మస్టరేసుకొని వస్తానని బాయిమీదికిపోయిన చంద్రియ్యకు బాయి మీద కాకిబట్టల పోలీసులు లాటీలు ఊపుకుంటు దర్శనమిచ్చిండ్లు.

ఆ రోజైనా బాయినడిపించాలని స్ట్రైక్ పెయిల్ చేయాలని ప్రియత్నచేంస్తున్న మేనేజుమెంట్ చివరికి యూనియన్ నాయకులను పిలిపించింది. యూనియన్ నాయ కులకు కూడ కార్మికులమీద మంటగానేఉంది. ఎందుకంటే 'కార్మికులు రోజు రోజుకు తెలివిమీరిపోతాండ్లని. నాయకుల్ని లెక్కచేయటములేదని నడమంత్రిపు సిరి గాండ్లు బాయిలమీదికివచ్చి బాయిలు చెడగొడుతాండ్లని. ఇదంతా మంచికిరాలే చెడుకే వచ్చిందని లీడరు కార్మికుల చెవుల ఇల్లుకట్టుకొని చెప్పినా వినేటోడే కనిపిస్త లేడు.... ఇక ఇట్లయితే లాబములేదని బాయిలమీద 'రాడికల్' అని అనుమాన మొచ్చిన వాళ్ళందరి పేర్లురాసి పోలీసులకిచ్చిండ్లు. కాని ఎంతమందిని అరెస్టుచేసినా అసలు వాళ్ళకు అంతులేకుండాపోయింది. ఎవడు 'రాడికలో' ఎవడుకాదో తెలియ కుంటయింది. ఏ లేబరోన్ని చూసిన ఇదివరలా కాకుండా, అదెట్లా ? ఇదెట్లా అని ప్రితిది ప్రిశ్నిస్తుండు? లీడరుగిరి ఇదివరలా లేదు ఏదో సావలేకబ్రితుకుతున్నట్టున్నది" అని బాధపడిపోతున్నరు.

అయినా పడిపోతున్న పలుకుబడిని నిల్పుకోవటానికి చెయ్యగల్గింది అంతా చేస్తునే ఉన్నరు. చివరికి తమకు అనుకూలమైన అనుచర బృందాన్ని తాగబోయించి ఆరోజు ఫస్టుసిఫ్టురో పనిలోకి దించాలని చూసిండ్లు. దాంతో 'సమ్మెవద్దు' అనేవాల్లకు సమస్య పరిష్కారము అయ్యేంతవరకు దిగేదిలేదనే వారికి ఘర్షణ జరిగింది పట్టు పట్టి దిగడానికి సిద్దపడ్డవాడొకడు బాగాతాగ్రి "నాదిఏం పీకుతరో పీకుండ్లి నేను దిగుతా నంటు" దిగపోయిండు.

"ఆ లంజకొడుకును అపుండ్లెహ.... బాయిలు సక్కగనడ్చినప్పుడు ఇంట్ల పంటడు బాయిబందున్న రోజున బాగాతాగొచ్చి దిగుతనంటడు...." బక్కగాపొడుగ్గా ఉన్న కార్మికుడొకడు.

"వాన్ని గుంజుకరాండ్లి.... వాని మత్తుగిత్తంతా వదిలిపోవాలి" మందిలనుండి అరిచిండొకడు అరిచిండు.

"చూస్తారేమి కానియ్యి"

గుంపుమధ్యలో యిరుక్కపోయిండు దిగటాన్కి ప్రయత్నం చేసిన కార్మికుడు.

బలం కల్ల కార్మికుడొకడు వాన్ని ఎత్తిపట్టిండు బాగ అందరికి అగుపించాలని మెడలో పాతబూట్ల దండతో హఠాత్తు పరిణామానికి చిత్తరవయిపోయిన వాన్ని చూసి దూరం దూరంగా నిల్చున్నవారు కిసుక్కునసవ్వింన్డ్లు.

నిముషాలమీద జర్గిన ఈ గందరగోళాన్ని చూసి పోలీసులు లాటీలు ఊపు కుంటు వచ్చేసరికి కార్మికులు ఎక్కడివారు అక్కడ జారుకున్నరు.

అంతవరదాక బాయిమీదున్న చంద్రయ్యను రాయలింగు జరఇంటిదాక రమ్మంటూ పిల్చుకపోయిండు. వాళ్ళరెండో అమ్మాయిని చూడవత్తాండ్లంటే కాదన కుంటా పెళ్ళిండు. అక్కడనుండి అటే మాటమాట మాట్లాడుకుంటాపోయి కల్లుబట్టీ కూసున్నరు.

సాయిలు ఆరాలు తీసుకుంటు కల్లుదుకాణ్ణకు వచ్చేసరికి రాయలింగు, చంద్రయ్య ఊగుకుంటు అదేపనిగా వాగుతు కల్లుబట్టినుండి బయటికివస్తు కనిపించిండ్లు.

సాయిలు అగముఆగంగా జర్గినసంగతి చెప్పేసరికి చంద్రయ్యకు తాగిన మైకము దిగిపోయింది. 'అయితే పోల్లను ఎటుతీస్కపోయిండ్లు' గాబరాపడిపోతు అడిగిండు.

"బెల్లంపల్లికి తీస్కపోవచ్చు అందరు బెల్లంపల్లికి తీస్కపోయుంటరని అంటాండ్లు"

"అయితె నేను బెల్లంపల్లికిపోత"

"జర ఇంటిదాక వచ్చిపోరాదు వదిన ఒక్కతీర్గ ఏడుస్తాంది" అని చంద్రయ్య అన్నమాటలు విన్పించుకోక జేబులో డబ్బులులేకుంటే సాయిలుదగ్గర అడిగితీసుకొని అప్పుడే వచ్చిన 'టెంపో'లో కాలుపెట్టసందులేకున్నా దూరిండు.

తీరా బెల్లంపల్లికిపోయి వంగతేందో తెల్సుకుంటే 'అర్ధగంటముందు వచ్చిన జయంతి జనతా' ఎక్స్‌ప్రెస్‌లో "హైదారాబాద్ తీస్కపోయిండ్లని అక్కడ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపిస్తరని "రైల్వేఉద్యోగి ఒకడు చెప్పిండు."

చేసేది ఏమిలేక తిర్గి ఇంటికొచ్చిండు. ఆ రోజంతా ఇంట్ల ఏడ్పులు అరుపులతోనే గడిపింది. పొయిమీద ఎసరుపెట్టలేదు. పిల్లలకుమాత్రం పక్కింటి కొముదమ్మ తీస్కపోయి బువ్వతినిపించింది.

తెల్లారితె హైద్రాబాద్‌కు పోవాలని ఆరాత్రి ఊరు ఊరంతా తిరిగిండు చంద్రయ్య డబ్బుకోసము. ఎవరిని అడిగిన 'లేదన్న' జవాబే. స్ట్రయిక్ జర్గరోజుల్లో ఎవరిదగ్గరమాత్రం పైసలుంటయని. చివరికి ఎటుతోసక ఇంట్లో కొప్పెరఉంటే తీస్కపోయి కుదువపెట్టిండు. ఎంతోబ్రతిమిలాడంగ అరువైరూపాయలకంటే ఎక్కువ రావన్నడు వడ్డీలకిచ్చె షావుకారు. కొప్పెర కుదువబెట్టినందుకు మరోసారి అయితే లచ్చిమి లొల్లిపెట్టేదే కాని ఇప్పుడు కిమ్మనకుండా ఉండిపోయింది.

మరురోజు ఇదేకేసులో హైదార్బాద్‌కువస్తున్న హుసెన్‌తోకల్సి బయలుదేరిండు. అక్కడికి చేరినతరువాత మరోనల్గురు కల్సిండ్లు. అంతకల్సి విచారణచేస్తున్న కోర్టుకు వెళ్ళేసరికి పదయింది. పదకొండింటికి విచారణ జరుగుతుందనితెల్సి ఈలోపు లాకపురూమ్‌లో ఉన్నవాళ్ళను చూడాలనుకుంటే పోలీసుజవాను అడ్డుతగిలిండు. చివరికి తలోరూపాయి చేతులోపెట్టి కేసువివరాలుచెప్పి ఏమంత ప్రమాదమైన కేసు కాదని నిర్ధారణ చేసుకున్నతరువాత జవాను ఒక్కొక్కరినిపోయి కల్సిరమ్మన్నడు.

మల్లమ్మ తండ్రినిచూసి అప్పటివరకు సన్నగాఏడుస్తున్నదల్లా బాగాఏడ్వటము మొదలు పెట్టింది.

చంద్రయ్యకు కళ్ళలో గిర్రున నీళ్ళుతిర్గినయి. అయినా ధైర్యముతెచ్చుకొని "ఏడ్వకుబిడ్డా నిన్ను తీస్కపొయెందుకు వచ్చిన" అంటూ ఊరడిస్తూ సలాకుల మధ్యగా తలమీదచెయ్యేసి అదిరిపడ్డడు. ఒళ్ళంతా జ్వరముతో కాగిపోతాంది. గుబగుబ నీళ్ళు పొంగివచ్చినయి.

లాకపులోఉన్న ముసలాయన "నిన్నటి నుంచి ఏమి తింటలేదు. బెంగపెట్టుకొన్నదేమో ఒక్కటేఏడ్పు. రాత్రింత జ్వరమే. లోకంమీద న్యాయంలేదుబిడ్డా ఏం పాపం చేసినమని...." ముసలాయన ఏదో చెప్పబోతున్నాడు. కాని జవాన్‌వచ్చి ఏంటీఅల్లరి ఉత్తగచూడుండ్లి అంటే ఏడ్పులుమొదలుపెట్టిండ్లు. న డ వు మ ం టు చంద్రయ్యను తోసుకుంటు పోయిండు. "కోర్టుకుతీస్కవస్తము మీరంతా అక్కడికి పోండి. ఎందుకేడుస్తవు. మంచి మంచికేసులు కొట్టుకుపోయినయి. అంతో ఇంతో జరుమానవేసి వదిలిపెడ్తరు." చంద్రయ్యను చూపి జవాను అన్నడు.

విచారణ మొదలైంది- కోర్టుహాల్‌లోకి జనం నిండుకొంటున్నరు. యథా విధంగా పంకలు తిరుగుతూనే ఉన్నయి. గోడమీద గాంధీగారు మాసిపోని చిలక నవ్వు నవ్వుతూనే ఉన్నడు. జడ్జిగారు యాంత్రికంగావచ్చి కుర్చిలో కూలబడ్డడు. తల మీద మిగిలిపోయిన వెంట్రుకలు గాలికి రెపరెపలాడుతున్నయి. లాయర్లు నల్లకోటు సవరించుకుంటు టూడావిడిగా తిర్గుతున్నరు.

మొట్టమొదటిసారి విచారణ కొచ్చిన ఆవారకేసు సెక్షను 109 కింద రాత్రి బస్‌స్టాండులో నిద్దురపోతున్న వారిని పట్టుకొచ్చారు. పోలీసులు కొత్తగావచ్చిన పెద్ద పోలీసాఫీసర్ ఒకాయన తన నిర్వాకము ప్రజలందరికి తెలియాలని కింది వాళ్ళకి అర్డర్సు జారిచేసారు. "ఈనెల చివరిదాకు ఎలాగైనా నాలుగువందల కేసులు బుక్ చేయాలని" దాంతో పోలీసులు ఊరుమీదపడ్డరు.

జడ్జిగారు గుమస్తాయిచ్చిన కాగితాలను చూసిండు. కోర్టుజవాను అర్థంకాకుండా ఎవరిపేర్లో పిలిచిండు- ఎనిమిది మందిదాక తీసుకొచ్చి బోనులో నిలబెట్టిండు పోలీసులు జడ్జిగారు సన్ననిపెదాలిప్పి "మీరంతా రాత్రి అనుమానాస్పద పరిస్థితిలో తిరుగుతుంటే తీస్కవచ్చినట్టు మీమీద కేసుపెట్టారు. మీరేమన్నా చెపుతారా ?" మెల్లగా చిన్నగా నాజూగ్గా అడిగిండు.

ఆ మాటలకు అందులో కొందరు బయటికంటే జేల్లోనే ఇంత తిండిదొరుకుద్ది అనుకునేవారు అవునన్నట్టూ తలూపిండ్లు.

వారిలో మాసిపోయిన గడ్డము. మట్టికొట్టుకపోయిన గుబురు తల- చెమటతో అట్టలు కట్టుకపోయిన మాసిపోయిన మాసికల చేతినంచిగల నడీడుమనిషి "అయ్యా బాంచెను ఒక్కమాటచెప్పాలె. మా పొల్లదానికి పాణము బాగాలేకుంటే ప్రభుత్వ దావఖాన్ల సరీకుచేసిండ్లని మతలాబునస్తె- చూసిపోతమని వచ్చిన- వచ్చేటాల్లకు పొద్దుపోయింది. రాత్రిపూట దావఖాన్లకు పోనియ్యకుంటే వచ్చి బస్సుస్టాండుల పండుకున్నబాంచెను- గారాత్రే పోలీసులు పట్టుకొచ్చిండ్లు బాంచెను గంతకుమించి ఏంలేదు. పొల్లది ఎట్లున్నదోఏమో ? యిడ్చిపెడ్తె ఎల్లిపోతబాంచెను."

జడ్జిగారు ఆ మాటలు విన్నరోలేదో- మరైతే ఒక్కసారి గాజుకళ్ళుపెట్టుకొని చూసిండు. అంతలకే ఎస్. ఐ. గారు పి. పి. తో ఏదోమాట్లాడిండు. పి పి జడ్జి గారితో ఏదో సగౌరవంగా విన్నవించుకున్నడు. జడ్జిగారు కాగితముమీద ఏదో గిలి కిండు. చివరికి అందరిని పదిహేనురోజులు రిమాండ్‌కు పంపిస్తున్నట్టుగా జడ్జి మెంటు వినిపించాడు.

ఆ తర్వాత మరో రెండు సైకిల్ దొంగలను విచారించిండు. ఆ తర్వాత బొగ్గు దొంగతనము చేసిన నేరానికిగాను రైల్వేవారి కేసు విచారణకొచ్చింది.

ఆనవాయితీగా పి. పి. మాటలిన్న జడ్జిగారు అందరిని 15 రోజులు రిమాండుకు పంపించాడు.

మల్లవ్వ బెదిరిపోయి భయం భయంగా ఏడుస్తుంది.

చంద్రియ్య నోటిమాటరాక చూస్తుండిపోయాడు. పటపట కన్నీళ్ళు కారుతుండగా బిడ్డకు ధైర్యంచెపుతామని ముందుకుకదిలిండు. కాని పోలీసు జవాను దగ్గరికి రాకుండా నెట్టివేసాడు.

రడీగావున్న వ్యానులోకి ఎక్కించటానికి పోలీసులు తొందర తొందరగా తోలుకపోయిండ్లు.

చంద్రియ్య కోర్టువరండాలో మందిని తోసుకుంటు పరుగెత్తిండు. చివరికి ఎలాగైతేనేమి కూతురును సమీపించి "ధైర్యంగా ఉండుబిడ్డా మళ్ళ నేనువచ్చి తీస్కపోతా" వక్కనేఉన్న ముసలమ్మతో "అవ్వజరకనిపెట్టు రెండురోజులకే బిడ్డనగమైంది పదిహేనురోజులు ఎట్లగడుస్తయో" దుఃఖముతో మాటపెకులలేదు.

'ఏడ్వకుబిడ్డా నేను చూసుకుంటా' ముసల్ది చంద్రియ్యకు ధైర్యముచెప్పింది.

వ్యాన్ కదిలింది

కళ్ళనీళ్ళతో కనుచూపుమేర వరకు చూస్తుండిపోయిండు కోపంతో పెదాలు కొరుక్కున్నడు. చేతినరాలన్ని తెగిపోంగ పిడికిలి బిగించి ఎక్కడలేని కోపముతో కోర్టుముందు రోడ్డుమీద నిలబడి అదేపనిగా తిడ్తున్నడు పిచ్చివానితీరుగా....

(మందమర్రి డివిజన్‌లో జరిగిన సంఘటన ఆధారంగా)

విజ్ఞప్తి

మహోజ్వల శ్రీకాకుళ పోరాటానికి సంబంధించిన కథలను సంకలనంగా తేవాలనే ప్రయత్నంలో ఉన్నాము. ఆ ఉద్యమాన్ని గురించి తెలిసిఉన్న ... తులు రాసిగాని, రాయించిగాని తమ కథలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పంపి సహకరించగలరు.

ఏ. రాంబాబు,
C/o ఎ. ఎర్రియ్య, పాన్‌షాప్, యం. జి. రోడ్,
విజయనగరం : 531 202.

చర్చావ్యాసం :

యజ్ఞం

గరికిపాటి నిరంజనరావు

(జూన్ సంచిక తరువాయి)

(2) శ్రీరాములు నాయుడిపాత్ర స్వభావం :

శ్రీరాములు నాయుడిలో కన్పిస్తున్నట్లున్న 'ద్వంద్వాత్వం' విషయంలో రంగ నాయకమ్మ చేసినవిమర్శల్లో కొంతన్యాయంవుంది. ఈన్యాయం 'ద్వంద్వాత్వం' వుండటంవల్లగాదు, వుందేమోననే అనుమానం కల్గేట్లు కా. రా. రాయడంవల్ల.

(i) "శ్రీరాములు చిత్తశుద్ధికలవాడా, కపటత్వం గలవాడా ?
ఈ పాత్రకి రచయిత ఎటువంటి స్వభావంయిచ్చారు ?
శ్రీరాములు రెండురకాలవాడూను" — రంగనాయకమ్మ.
ఇది సరైన అవగాహనకాదు.

శ్రీరాములు ద్వంద్వరాముడుకాడు. చిత్తశుద్ధికలవాడే. అతనిలో కపటత్వం లేదు. గ్రామస్థాయిలోవచ్చిన "అభివృద్ధి" పథకాలవల్ల అందరూ బాగుపడతారు బాగుపడాలి అనేధోరణి కలవాడు శ్రీరాములునాయుడు. అయితే కా. రా. అన్నట్లు "అతనిక్కూడా పుట్టుకా అవలంబించిన జీవనపద్ధతులవల్ల ఒక వర్గస్వభావం వుంటుంది." తానుబహిరంగంగా ఒప్పుకున్నా లేకున్నా అతను పీడితప్రజల ప్రయోజనాలకు అంతగా వుపయోగపడడు. కాని తానందరికీ సేవచేస్తున్నాననే సైకిల్ ధీమాలో నాయుడున్నాడు. అంచేతనే అప్పలాగ్రముడు మండపంముందు నిల్చొని నాయుడి ప్రయోజకత్వంగూర్చి నిష్కర్షగా చెప్పేవరకూ తనకి ఒక వర్గం వైపు మొగ్గువుందని తెలియదు. తెలిసినా ఏమీచేయలేనిస్థితిలో వుండిపోయాడు— ఎందుకంటే అనూచానంగా వస్తున్న సాంఘికనీతులూ, గ్రామధర్మాలూ తనతీర్పు "న్యాయ"మైనదేనని తేలుస్తాయిగాబట్టి.

గాంధీవాదం :

(ii) "శ్రీరాములు గాంధీవాదానికి ప్రతినిధిఅని అందరూ ఒప్పుకొంటు న్నారు" — రంగనాయకమ్మ.

క్షమించాలి, నేనుఒప్పుకోవడంలేదు. శ్రీరాములు గాంధీవాదానికి ప్రతినిధి ఎలాఅయ్యాడు ? కొంతమంది సమర్థకులుకూడా ఈ వాదాలగొడవల్లో తప్పుఅంచనా

వేసినట్టున్నారు. వారుగాని, రంగనాయకమ్మగాని యజ్ఞం కథనుండి ఏ క్లాస్ తీసి యిచ్చారు?

రంగనాయకమ్మగారి క్లాస్ ఇవి :

"రచయితకి గాంధీమీద సదభిప్రాయం వుందనే సంగతి కథే ఋజువుచేస్తుంది. ఆ సదభిప్రాయమే లేకపోతే, 'మహాత్ముని బోధలు అతనికి చిన్ననాడే ఒంటబట్టాయి' అంటూ రచయితే డైరెక్టుగా (కనీసం పాత్రలద్వారాకూడా కాకుండా) మహాత్ముణ్ణి గొప్పచేయగలిగేవాడుకాడు, రచయితే డైరెక్టుగా మాట్లాడిన ఈ రెండువాక్యాలూ చూడండి.

చిన్న సెన్సారింగ్ :

"నాయకత్వం విషయంలో నాయుడి ఆదర్శాలు వున్నతమైనవి." "నాయకత్వం విషయంలో మహాత్ముడేమన్నాడో విశదీకరించి నాయుడు ప్రస్తుతాంశానికివస్తూ...." రంగనాయకమ్మ (2 వ్యాసాలు పే. 42-43)

ఇక్కడొక చిన్నసెన్సారింగ్ జరిగింది. అసలు కా.రా.గారు రాసింది :

"నాయకత్వం విషయంలో నాయుడి ఆదర్శాలు వున్నతమైనవి. ఈవిషయంలో మహాత్మునిబోధలు అతనికి చిన్ననాటే వంటపట్టేయి." (యజ్ఞం ఇతరకథలు పే. 25)

ఈ రెండు వాక్యాలనీ వేరుగాచూసి, "మహాత్మునిబోధలు" అనే మాటలకి ముందున్న "ఈ విషయంలో" అనే మాటల్ని మింగేస్తే నాయుడు గాంధీవాదేమో ననే "భ్రమ" ఎవరికైనా కల్గుతుంది.... కల్గించబడుతుంది! కా రా.గారి మాటలకి ఏ అర్థం చెప్పుకోవాలి? ఏ సందర్భంలో అన్నమాటలవి?.

శ్రీరాములు వూళ్ళో లేకపోతే అప్పలాస్వుడి అప్పుతగాదా మూడురోజులుగా నలిగినా మిగిలిన పెద్దలు తీర్చలేకపోయారు. ఆఖరికి క్రితంరోజు సూర్యంబాబు నాయుడి కోసం పట్నంవెళ్ళి మేనమామ జబ్బుతో బిజీగావున్న అతన్ని గ్రామం తీసికొని రావాల్సి వచ్చింది. నాయుడు నిరంకుశనేతగాడు. తానువున్నా లేకపోయినా తాను స్థాపించినసంస్థ తాను తలపెట్టిన కార్యక్రమం కొనసాగించాలనేతత్వం అతనిది. గాంధీ జైలులోవున్నా మిగతావాళ్ళు వుద్యమం నడిపినట్లు. అందుకే నాయుడంటాడు:

"ఒకవ్యక్తి తక్కువైనంతమాత్రాన మనసంస్థ నిర్వహించవలసిన కార్యాలు స్థంభించిపోయాయంటే అది చాలా చిక్కువిషయం. ఈనాడు మన యీ కార్యక్రమ

మంతా ఒక్క శ్రీరాములు నాయుడు మీదే ఆధారపడినట్లు మీరు వ్యవహరించినా లోకం అర్థంచేసికొన్నా నాకు చాలా కష్టంవేస్తుంది. ఈ పది పదిహేనేళ్ళుగా ఏ పనీ ఏనాడూ నేనొక్కణ్ణీ చేయలేదు. ఇంకా మీరు మీ బాధ్యతలను ఆసక్తితో నిర్వహించలేకపోతున్నారంటే నేనెవర్ని నెపపెట్టాలో తెలియడంలేదు. బహుశా అది నాలోపమే అయ్యుండాలి. ఇందుకు నా మనస్సు నిజంగా విలవిలలాడిపోతుంది."

"నాయుడి మొహంమీద ఆ విలవిలలు నిజంగానే కనిపిస్తున్నాయి. నాయకత్వం విషయంలో నాయుడి ఆదర్శాలు వున్నతమైనవి. ఈ విషయంలో మహాత్ముని బోధలు అతనికి చిన్ననాటే వంటపట్టాయి" (యజ్ఞం ఇతర కథలు, పే. 24-25)

అంచేత మహాత్ముని బోధలు అతనికి వంటబట్టినవి గాంధీ నాయకత్వంగూర్చే గాని, గాంధీవాదం (సోషియో ఇకనామిక్ ప్రోగ్రామ్ లేక ఐడియాలజీ) గూర్చికాదు.

గాంధీ నాయకత్వం :

గాంధీ నాయకత్వంలో ముఖ్యాంశమేమిటి? నిజం చెప్పటం, అహింసావద్ధతుల్లో ఉద్యమాలు నడపడటం, తానుచేసిన తప్పుల్ని (హిమాలయన్ బ్లండర్స్) పబ్లిగ్గా ఒప్పుకోవడం, తాను నమ్మినదాన్ని స్టబర్న్‌గా అంటిపెట్టుకొని వుండటం, తానుచెప్పేది తానే ముందుచేసి చూడటం యిత్యాదులు. గాంధీ నాయకత్వంలో వున్నయీలక్షణాల్ని వీలున్నంతవరకూ నాయుడు అనుసరించాడు అయితే శ్రీరాములు నాయుడు గాంధీ "వాదా"నికి ప్రతినిధికాదు.

"నాయకత్వం విషయంలో మహాత్ముడినుంచి నేర్చుకున్నాడు నాయుడు. అతనికి నాయకత్వ ఆదర్శాలు వున్నతమైనవి అంటే మహాత్ముడి ఆదర్శాలు వున్నతమైనవి"
— రంగనాయకమ్మ.

మొదటి రెండు వాక్యాలూ సరిగానేవున్నాయి. మూడో వాక్యం రంగనాయకమ్మగారి వ్యాఖ్యానం లేక యింటర్‌ప్రెటేషన్. నేననేది ఈ యింటర్‌ప్రెటేషన్ సరికాదని.

గాంధీ వాదం :

గాంధీవాదం అని దేన్నంటాం? ముఖ్యంగా సాంఘిక ఆర్థికతాత్వికవిషయాల మీద గాంధీ దృక్పథాన్ని. గాంధియన్ ప్రోగ్రాంలో యివి కాంక్రీట్‌గా తెలుస్తాయి. హరిజనోద్ధరణ, అంటరానితనం నిర్మూలన, గ్రామీణ స్వయంపోషకత్వం, చరఖా,

ఖాదీపరిశ్రమలకి వ్యతిరేకత గ్రామనగర "అభివృద్ధు"లలో గ్రామాలవైపు మొగ్గు, ట్రిస్టీషిప్, భౌతిక అవసరాలని సాధ్యమయినంత వరకూ తగ్గించుకోవడం, ఒక దశలో బ్రహ్మచర్యం ఇత్యాదులు. అయితే సుందరపాలెంలో జరిగిన "అభివృద్ధి" ఈ అంశాలమీద ఆధారపడిజరిగిందా ? కాదని రంగనాయకమ్మగారు కూడా ఒప్పుకుంటారనుకుంటాను.

శ్రీరాములు నాయుడు గాంధీవాది కాడు, నెహ్రూవాదానికి దగ్గర ఇక్కడ మళ్ళీ రంగనాయకమ్మగారి నెహ్రూ కాన్షస్ ఏజెంటా లేక అన్‌కాన్షస్ ఏజంటా అంటారు కాబోలు ! నెహ్రూ ఫిలాసఫీ, మోటివేషన్స్‌గూర్చి చర్చించడానికి యిది సమయమూ కాదు, ఆ అవసరమూలేదు. నన్నడిగితే ప్రధానిఅయ్యాక నెహ్రూ మాజీరాడికల్‌గా తయారయ్యాడు, అతనొక పాత ఫేబియన్ సోషలిస్టు. తర్వాత దోపిడీవర్గాలతో కాంప్రమైజ్ అయ్యాడు. మాటల్లో సోషలిజం- చేతల్లో ఇఫెక్టివ్‌గా పెట్టుబడిదారీ విధానం. నెహ్రూ సంగతి వదిలి నాయుడి సంగతి చూద్దాం.

పంచవర్ష ప్రణాళికల బండారం :

కా. రా. గారు నాకురాసిన లేఖలోచెప్పినట్లు 1950 తర్వాత నెహ్రూహయాంలో పంచవర్ష ప్రణాళికలక్రింద 'అభివృద్ధి' కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఆ భాగోతంవల్ల నిజంగా పేదప్రజలకి మేలుజరగలేదని చెప్పడానికి, తప్పుపట్టలేని ఒక వ్యక్తిని గ్రామనాయకుడిగా చిత్రించి, యింత నిస్వార్థపరుడూ, ప్రజాస్వామ్యవాదీ గ్రామానికి నాయకుడుగావున్నా కూడా 'అభివృద్ధి' యొక్క ప్రయోజనాలు, శ్రమజీవులకి ఎలా అందడంలేదో చూపించారు కా. రా. అంచేత శ్రీరాములునాయుడు గాంధీవాదని, సమర్థకులూ, రంగనాయకమ్మ నమ్మి వాదప్రతివాదాలకి దిగడం శుద్ధ దండగ ! అయితే,

"తనపనులవల్ల ఏ వర్గం లాభపడుతుందో తెలీని శ్రీరాములు ధనికులకు కొమ్ముగాయడమేమిటి ? తనకి తెలీకుండానే ఆ పని చేశాడనిచెప్పడమా ? తెలీక చేసినా తనపనివల్ల ధనికులకు వుపయోగపడ్డాడు గాబట్టి అతనిమీద రచయితకి సానుభూతి లేదని చెప్పడమా ?" — రంగనాయకమ్మ (2 వ్యాసాలు పే. 59)

రంగనాయకమ్మగారితో వచ్చిన చిక్కేమిటంటే కా. రా గారి పరసనల్ ఫిలాసఫీ, ప్రిఫరెన్సూ, ఐడియాలజీమీద ఒక నార్మేటివ్ జడ్జిమెంట్ ఏర్పరుచుకొని ఆయన రాతల్లో క్లాజికల్ కాంట్రిడిక్షన్స్ (వైరుధ్యాలు) కనపడ్డంలేదని భావించి ఆయనలో

ఆమె పుందనుకుంటున్న డ్యూయాలిటీని పాత్రల్లో చూపించారని విమర్శించడం. శ్రీరాములు ధనికులకి కొమ్ముగాశాడు అంటానికి చెప్పేరుజువు అప్పలాగ్రిముడిది 'తప్పే' ననడమూ, ఆ అప్పుని గోపన్నని తీర్చాలనడమూకదా! సుందరపాలెంలో హరిజనేతరులకు కల్గిన లాభమంతా ఆ యజ్ఞం (గ్రోత్-ప్రాసెస్)లోంచి పుట్టుకొచ్చిందే. గ్రామంలో ఒక ప్రణాళికని సిద్ధంచేసుకొని, శ్రీరాములునాయుడూ, లక్ష్మంనాయుడూ, అన్నమయ్యా, మునసబూ, కరణమూ పేదలకి ఆలాభం దక్కకుండా కాన్షస్‌గాచేసిన పనిగాదు. ఆ కుటీరంలో ఆర్థిక విధానాలని ఏర్పరచడంలో మాక్రో లెవెల్‌లో జరిగివుండాలి. (వివరాలకి కా. రా. గారి 'కుట్ర' చదవాలి). సామ్యవాదేతర దేశాలలో జరిగిన పురోగతి తప్పనిసరిగా పైవర్గాలకి చెందుతుంది. అది సహజం. కాని ఈ నిజాన్ని చివరివరకూ తెలీనినాయుడు "అందరూ బాగుపడాలి, బాగుపడతారు" అనే పనికిమాలిన నమ్మకంతో పున్నవాడు. ప్రత్యేక పరిస్థితులనుకుంటూ దోపిడీవర్గాలతో కాంప్రమైజ్ అయి, పురోగతివస్తేఫలాలు అన్నివర్గాలు బాగుపడతాయనీ నైవ్‌ధీమాతో నెహ్రూవున్నట్లే, గ్రామస్థాయిలో నాయుడుకూడా నమ్మాడు. కొన్నివిషయాలు గమనంలోకితీసికొంటే నాయుడ్ని సుందరపాలెంలో పున్న "మినీ-నెహ్రూ"గా పేర్కొనవచ్చు. ఈ నెహ్రూ పాలసీల్లోని దివాళాకోరుతనాన్ని ఎత్తిచూపడమే యజ్ఞం కథలక్ష్యం.

అయితే ఇది "అప్పే, అప్పే, అప్పే" అని నాయుడు ఆవేశంగా ఎందుకని అనాల్సివచ్చింది. ఎందుకంటే నాయుడి పైకి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, తాను "నిష్పక్షపాతి" అని స్వయంగా భ్రమించుకున్నా తనవర్గప్రయోజనాలూ, ఈ ఆర్థిక సంస్థయొక్క నీతులూ, సమాజధర్మాలూ అతనిలో ఇమిడివున్నాయి. కా రా గారి మాటల్లో, "అతనికిగూడా పుట్టుకా అవలంబించిన జీవన పద్ధతులవల్ల ఒక వర్గస్వభావం వుంటుందిగదా" అందుకనే తాను "న్యాయమే" అనినమ్మిన తీర్పు యిచ్చాడు.

"చిత్తశుద్ధి సరసన కపటత్వం
వున్నతాదర్శాల సరసన నక్కజిత్తులు"

— రంగనాయకమ్మ

"బాబయ్యా నువ్వెంతకైనా సాహసిపంటాను.... నీదెబ్బన్నది
తగిలిన చోటకనపడదు. నువ్వేంజేసినా సాపకింద
నీరులాగా సల్లగ ముంచుతావు"

— అప్పలాగ్రిముడు

అప్పలాప్రిముడిలా ఎందుకన్నాడు ? ఎందుకంటే న్యాయంచెప్పమని తనదగ్గరికివస్తే నాయుడు న్యాయం చెప్పాలిగాని, తాను చెప్పదలచుకున్న న్యాయం అప్పలాప్రిముడ్నే చెప్పమంటే ఎలా ? అంచేత ఆసందర్భంలో ఇరిప్రిటేట్ అయి అప్పలాప్రిముడలా అన్నాడు. నాయుడి నిజాయితీని అతను శంకించలేదు. ఒకవేళ కించిత్తుశంకించినా ఆ శంకని నిలుపుకోలేదు. అందుకనే అప్పలాప్రిముడంటాడు:

"నువు సదువుతున్న ఓడివి. సమస్తం ఎరిగుంటావనే అనుకున్నాను. నీకూ నిజంతెలిసుండదన్న సంగతి నాకు తెలిసింది కాదు. తెలిస్తే నువ్వింత నిబ్బరంగా నువ్వన్నమాటలనవు. నానూ ఆమాట అలాతూలకపోదును".

(యజ్ఞం ఇతర కథలు పే. 44).

<u>ఒకచిన్న డయగ్రెషన్ :</u>

కా·రా. గారికి గాంధీమీద, గాంధీవాదంమీద సదభిప్రాయంగాని భ్రమలు గాని వున్నాయా లేవా అనేప్రశ్న పైచర్చవల్ల అప్రస్తుతం అని తేల్తుంది. గాంధీ మీద రంగనాయకమ్మగారు చాలా స్వీపింగ్‌స్టేట్‌మెంట్స్ యిచ్చారు.

"గాంధీ మాలమాదిగల క్షేమం ఎంతనిజంగా కోరాడో తెలుసుకోవాలంటే అంబేత్కర్ పుస్తకాలుచాలు.... కార్మికులమీద పెట్టుబడిదారుల దోపిడీని గాంధీఎంత గట్టిగా సమర్థించాడో తెలుసుకోవాలంటే కార్మికసంఘాల్ని అతను ఎంతవ్యతిరేకించాడో తెలుసుకుంటేచాలు. ఇలా ఎన్నోవిషయాల్లో గాంధీ పేదప్రజల వ్యతిరేకి"

— రంగనాయకమ్మ (2 వ్యాసాలు, పే 43)

ఈ పాసేజ్‌మీద రాయబోయేముందు ఒక సొంతవిషయం చెప్పాలి. లేకుంటే "ఇదిగో ఇతనికికూడా గాంధీమీద, గాంధీవాదంమీద భ్రమలున్నాయి" అని రంగనాయకమ్మ అనేయగలరు :

గాంధీవాదంమీద నాకెలాంటి భ్రమలూ లేవు. నా వుద్దేశంలో మార్క్సిజమ్ లాగ గాంధీయిజం సమాజాన్నీ సమాజచరిత్రనీ అర్థంచేసికోడానికి తోడ్పడదు. చరిత్రనడిపే Prime-mover- అదే వర్గపోరాటాన్ని- మార్క్సిజమ్ చూపెడుతుంది. సాధనాలతోపాటు పరిశీలనా పరిధి (anelytical framework) ని గూడా మార్క్సిజమ్ యిస్తుంది. అంతేగాని మార్క్సిజమ్ ప్రతిసందర్భానికీ రెడీమేడ్ ఆన్సర్సు యివ్వదు. వ్యక్తుల్నిగాని, వర్గాల్నిగాని బ్లాక్ అండ్ వైట్‌గా చూడ్డం అంటే ఈ

మార్క్సిస్టు టూల్స్‌ని మెకానికల్‌గా ఎప్లై చేయడన్నమాట. అంచేతనే గాంధీ పేద ప్రజలకి కాన్షస్‌గా వ్యతిరేకిఅయ్యాడు అనే పిడివాదధోరణి వస్తుంది. గాంధీ గాంధీయిజం పేదల్ని వుద్ధరించలేదని, వుద్ధరించబోదని అంటే ఫరవాలేదుగాని, గాంధీ పనిగట్టుకొని కాన్షస్‌గా పేదప్రజల వ్యతిరేకి అయ్యాడంటే అది కేవలం పోలెమిక్స్‌గానే మిగిలిపోతుంది.

గాంధీ నాయకత్వంలో లోపాలు లేవనిగాదు. ఒకొక్కప్పుడు ఉధృతమవు తున్న ప్రజావుద్యమాన్ని అహింసపేరుతో నీరుగార్చేవాడు. యూదులకి సలహా యిచ్చాడు; మతమూ రాజకీయాలు కాక్‌టెయిల్ చేస్తే వచ్చే కన్‌కాంక్షన్ యిలాగే వుంటుంది! అయితే ఒకవిషయం గుర్తుంచుకోవాలి. ఎంతభారస్తుడయినా, చైనాలో మావోలాగా, భారతదేశంలో ప్రజల్నీ, ప్రత్యేకపరిస్థితుల్ని అర్థంచేసికొని వుద్యమాన్ని వాటిపద్ధతుల్నీ నడిపిన నేటికీ జీనియస్‌గాంధీ. గాంధీ నాయకత్వంలో ముఖ్యంగా కన్పించేది నిజాయితీ.

గాంధీకి అంబేద్కర్‌కీ భేదాభిప్రాయాలున్నమాట నిజం. కాని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విభజించి పాలించమన్న తరుణంలో ఈ భేదాభిప్రాయాలొచ్చాయి. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన వారిలో గాంధీ ముఖ్యుడు. అతను హరిజన వ్యతిరేకి అనడం చరిత్రని తిరగతోడడమే.

గాంధీ కార్మికసంఘాల్ని వ్యతిరేకించాడన్నారు రంగనాయకమ్మ. వుదాహరణలు చూపితే బాగుండేవి. అహమ్మదాబాద్‌లో గాంధీ నాయకత్వంలో కార్మికులు సమ్మెచేసినట్లు చరిత్రలో చదువుతాంమరి. గాంధీలో సవాలక్షలోపాలున్నా కాన్షస్‌గా పేదలకీ, హరిజనులకీ అపకారం తలపెట్టలేదు. అక్కడే నేను రంగనాయకమ్మ గారితో విభేదిస్తున్నాను.

(3) అప్పలాప్రముడి అప్పుస్వభావం :

(i) "అప్పలాప్రముడూ పేదవాడే, గోపన్నా పేదవాడే కదా ఇద్దరు పేదవాళ్ళ మధ్య ఇంతశత్రుపూరితమైన తగువేమిటి?"

(ii) "షావుకార్లు రైతులదగ్గర చాలా మోసాలు చేసేవారనీ అప్పలాప్రముడు అన్నమాట ప్రతిఒక్క షావుకారుకీ వర్తిస్తుందనుకోగూడదు. ఆ మోసాలలో

ఎక్కువ తక్కువ తేడాలులేనట్టు అందరికీ ఒకేస్థాయిలో వర్తించదు. గోపన్నలాంటి వాడు అసలుమోసాలే చేసివుండడనుకున్నా ఆశ్చర్యంలేదు"

— రంగనాయకమ్మ (2 వ్యాసాలు పే. 66)

(ii) "ఒక చిన్నవ్యాపారిని, అందులోనూ చాలా మంచివాణ్ణి దోపిడీదార్ల ప్రతినిధిగా నిలుచోబెట్టారు.... ఇదీ ఆయన చేసినపొరపాటు" (2 వ్యాసాలు పే.68) ఇద్దరు మంచివాళ్ళ మధ్య, పేదవాళ్ళమధ్య వచ్చిన తగువుని వర్గాలమధ్యవున్న శత్రుపూరితమైన తగువుగా తీసికోవచ్చునా? లేదనేచెప్పాలి. ఎంచేత? విప్లవంకోరే రచయిత వర్గపోరాటాన్ని సృష్టించేటప్పుడు వర్గశత్రువుమీద ద్వేషంకలిగేటట్లు చిత్రించడం రివాజు. మరి ఈ గోపన్న పరమసాత్వికుడే! రచయిత ఎందుకిలా రాసివుంటారు? ఇక్కడ ఆయన ప్రధాన లక్ష్యం వర్గపోరాటాల్ని చిత్రించడం కాదేమో? నాకు తెలిసినంత వరకూ రెండు లక్ష్యాలున్నట్లుతోస్తుంది:

ఒకటి : వ్యాపారపంటలు ప్రవేశించడంవల్ల సుందరపాలెంలోని తిండికోసం జరిగే వ్యవసాయోత్పత్తికి ఒక Shock తగిలి వ్యవసాయందెబ్బ వ్యాపారీకరణజరగటంతో 1920-1950 మధ్య గ్రామాల్లోని వర్గాలమధ్య అసమానత ఏర్పడి, peasant pauperisation జరిగి, కంబార్లసంఖ్యపెరిగి, వస్తుమార్పిడిలో డబ్బు పాత్ర ఎక్కువయి, dominant Cultivating Caste లో చాలామందీ, వర్తకుల్లో కొంతమందీ బాగుపడటమూ, వ్యాపారపంటల ధరల ఎగుడుదిగుళ్ళల్లో సన్నకారురైతులు చితికిపోవటమూ, పైనించివచ్చే ముప్పుతో (Imperalism thoughworld trade) గ్రామవ్యవస్థలో అవకతవకలు ఏర్పడి సాంఘిక శాంతి నశించడమూ యిత్యాదులతో మొదటి లక్ష్యం ముడిపడివుంది.

రెండు : 1950-1962 మధ్యవచ్చిన infrestructural improvements వల్ల ప్రణాళికా బద్ధమైన 'అభివృద్ధి'వల్ల గ్రామాదాయమూ తలసరిఆదాయమూ పెరిగి ఆర్థికపురోగతి (Economic Growth) జరగ్గా, పేదలవంతు నిరుద్యోగమూ, ఆర్థిక అధోగతీ, స్వర్ణకులాలకు, మధ్యతరగతి, పెద్దరైతాంగానికి యజ్ఞ ఫలం చేరడమూను.

పేదరైతుల్ని చిన్నషావుకార్లూ, చిన్నషావుకార్లని పెద్దషావుకార్లూ — జంక్షను కాడ, బేసనుకాడవాళ్ళు. వాళ్ళని అంతకంటే పెద్దషావుకార్లూ పంచేసుకున్నారు. ఇది తిమింగిలన్యాయం. ప్రపంచ పెట్టుబడిదారీ రాజ్యాలు సామ్రాజ్యాలు ఏలిన

రోజులు కథలోని మొదటిదశ. వలసదేశాల్లోని వ్యవసాయమూ, వ్యవసాయదారులూ చిన్నపెద్ద వ్యాపారస్తులూ ప్రపంచ వ్యాపార కబంధహస్తాలలో వుక్కిరి బిక్కిరయ్యారు. 1929లో వచ్చిన Great Depression ఈ పరిస్థితికి పరాకాష్ఠమాత్రమే. అందుకే తన అస్పష్టచైతన్యంలో అప్పల్రాముడు తన ఆవేదనని వెలిబుచ్చుతాడు :

"బాబయ్యా, ఒర్తకం జూదం ఒకటేనన్నారు పెద్దలు నిజమే. అదెందుకు పుట్టింది? జనమెందుకు ఆడతన్నారు? నన్నుముంచి నువ్వెందుకు మునిగిపోతన్నవు? బెమ్మదేవుడు కొడతన్నాడుగాబట్టి అమఁవోణ్ణి బలివోడు కొట్టడమేనా? నువ్వు తినా పెట్టనికాడికి నన్నుపట్టుకెల్లి అల్లకెందుకు మేపుతావు? ఇదంతా నరుడుతెస్తున్నముప్పా నారాయనుడు బెడుతున్నసిక్సా? మీరేసెప్పండి" (యజ్ఞం ఇతరకథలు, పే 53). సరుకుమార్పిడిలో జరిగిన దోపిడీ పెద్దదోపిడీలో మొదటి మెట్టుమాత్రమే. గ్రామ స్థాయిలో ఈ దోపిడీయొక్క fallout ఫలితం ఏమిటంటే పేదరైతులు భూములు పోగొట్టుకొని కంబార్లుగావడం, చిన్నవ్యాపారస్తులుగూడా దివాలాతీయడం. కాబట్టే గోపన్నపాత్రగూడా సింపథెటిక్‌గానే చిత్రించబడింది. గోపన్నని పరమ సాత్వికుడిగా ప్రజలు ఎంచేమాట నిజమే. అయితే అతనూ ఒకప్పుడు వ్యాపారేగదా! వ్యాపారికి వ్యాపారన్యాయం వుండివుండాలి.

"వ్యాపారన్యాయం"

"గోపన్నలాంటి వాడు అసలేమోసాలు చేసివుండడ"నుకోవటం చాలపొరపాటు అప్పల్రాముడంటాడు :

"ఆబాబువల్ల నానే పైకొచ్చినానో నావల్లఆయనే పైకొచ్చినాడో మా యిద్దరం ఆపరమాత్ముడివల్లే పైకొచ్చినాఁవో- అయిదారేళ్ళు యిద్దరం కలిసికట్టుగా మీదికి లెగసినాఁవు. తరవాతేఁవయ్యిందో తెలీదు. ఆబాబు లేగడం మానేడు. నానుకిందికి దిగజారడవారంబఁవయ్యింది". (యజ్ఞం ఇతర కథలు, పే. 51)

గోపన్న మోసం చెయ్యకపోతే యిదెలా సాధ్యమయింది? కాబట్టి "మంచి" వాడైనా గోపన్న "వ్యాపారన్యాయం" ప్రకారం అప్పల్రాముడ్ని మోసంచేసి తప్పు లెక్కవేసి రెండువేలరూపాయల అప్పుతేల్చి వుంటాడు. అప్పల్రాముడు దీన్ని అప్పు అని అంగీకరించకపోవడానికి అదే కారణం. మోసంజరిగిందని అప్పల్రాముడికి గట్టినమ్మకం. కాని ఆమోసాన్ని ఋజువు చెయ్యలేడు. ఋజువు చెయ్యడానికి

అతనిదగ్గర వున్నవి ఇంట్యూషనూ, ఇన్‌స్టింక్టూ తప్ప మరేమీలేవు. అప్పలాప్రిముడు ఎంతమంచివాడైనా అతను హరిజనుడు. ధర్మాన్నిచెప్పే పెద్దమనుషులు అగ్రవర్ణాల వారు. అదీగాక గోపన్న పరమసాత్వికుడిగా వూళ్లో పేరుపొందాడు. అంచేతనే అప్పలాప్రిముడు పురోణీపత్రంమీద వేలిముద్ర వేసేవరకూ వూరిజనాభా సానుభూతీ Public opinion గోపన్న వైపేవున్నాయి.

"నెత్తిమీద మూటపెట్టుకొని వూళ్ళన్నీ తిరిగి సరుకుఅమ్ముకునే వ్యాపారులకు వచ్చే సంపాదనలో వాళ్ళ స్వతశ్రమఫలితం కూడా వుంటుంది. వాళ్ళకివచ్చే సంపాదన అంతా ఇతరుల శ్రమఫలితమే కాదు"– రంగ్గనాయకమ్మ (2వ్యాసాలు పే. 63)

రంగనాయకమ్మ ఇక్కడ కొంచెం కన్‌ఫ్యూజ్ అయినట్లున్నారు. అప్పలాప్రిముడితో వ్యాపారసంబంధాలు ఏర్పరచుకొనకముందు మాత్రమే గోపన్న, "బుజం మీద పుగాకు దుట్టాఏసుకొని అగ్గురోరం, పూడిమడక, తాటిసెట్లపాలెం నాగోరుసంతలకీ సవు(ద)పొడ్డుపల్లెలకీ కమానుతిరుగుతుండేవోడు. ఆయాడాదే ఓంపెదమ అంటూ మెరకపంటల ఒర్తకంలోకి దిగబోతున్నాడు." (యజ్ఞం ఇతర కథలు పే. 51). అంటే ఈనెత్తిమీది మూట వ్యవహారం పుగాకుబాపతుది. వర్తకపు పంటల్లోదిగాక అతని స్థాయిపెరిగి "స్వంత శ్రమఫలితం" తగ్గివుండాలి! మరి యిప్పుడు గోపన్న దోపిడీదారుల ప్రతినిధి అవుతాడాలేదా?

"శతృ"పూరితమైన తగువు :

ఈతగువుని శతృపూరితంగా చూపడం జరిగిందా? లేదే. ఒకవిషయం. రచయిత పాత్రలమీద చూపించాడన్న "సానుభూతుల" సంగతి అలావుంచుదాం. ఎందుకంటే ఆ లైనుప్రకారం విచారిస్తూపోతే ఫలితాలురావు. దీనికికారణం రామారావుగారు మనుషుల్ని నలుపుతెలుపు గూప్రులుగాకాక, మనం నిత్యంచూస్తూన్న సహజమైన సగటు మనుషులుగానూ, ఉత్తరాంధ్ర తెలుగుతనం మూర్తీభవించిన వ్యక్తులుగానూ, మనముందుంచారు. సామ్యవాద సాహిత్యంలో మనం మామూలుగాచూసే కరుడుగట్టిన భూస్వాములూ, షైలాకులూ యిక్కడదొరకరు. అంచేతనే ఈ అప్పుగొడవల్లో కులతత్వం తలకెక్కిన భూస్వాములుగూడా సాధ్యమయినంత వరకూ సౌమ్యంగానే తమపెత్తనం చెలాయించుకోజూస్తారు. అన్నమయ్యలాంటి వాళ్ళు అరుదు. ఇక తగవుధోరణి గురించి శతృపూరితమా కాదా? కథ చివరలో హఠాత్తుగా జరిగిన స్వయంహింసనలావుంచి చూస్తే గోపన్నా- అప్పలాప్రిముడూమధ్య

అసలు వాదప్రతివాదాలేలేవు. మూడేళ్ళక్రిందట అప్పుఒప్పుకొని నోటురాయబోయే ముందు అప్పల్రాముడు చాలాసౌమ్యంగా వ్యవహారకర్తగా గోపన్నతో అంటాడు :

"బాబూ గోపన్నబాబూ! నామొహంచూసి కాకపోతే నా పెద్దలమొహం సూపన్నా నేసెప్పేది సెవినుంచు. నన్నూ నాపిల్లల్నీ కూలోళ్ళనుసేసేయకు తరతరాల బట్టి మాది రైతుకుటుంబం. ఇయాలరేపు నా మనవలుగూడా ఎదిగొస్తన్నారు, నానూ నా కొడుకులూ కాకపోయినా నా మనవలైనా నీ రుణం తీర్చేసుకుంటారు, కాని వుంచీసుకోరు నీ రుణం సానాకాలంబట్టి వుండిపోనాది. కాని యింకొక్క మూడేళ్ళ గడువీయ్". (యజ్ఞం ఇతర కథలు, పే. 13-14) గడువిచ్చేడు. గడువుచెల్లేలోగా అప్పుతీర్చలేకపోయారు వున్న ఆ కొండ్రి అమ్మి అప్పుతీర్చుదామని అప్పల్రాముడి ప్రయత్నం కాని కొడుకు సీతారాముడు ఎదురుతిరిగాడు. అంచేత అప్పల్రాముడు సమస్యని మొదటికితెచ్చి "అసలిది అప్పోకాదో తేల్చం"డన్నాడు. శ్రీరాములి నాయుడిమీద అప్పల్రాముడికి గుడ్డినమ్మకం, అయితే అప్పునైజం సరిగ్గా తనకు తెలియకపోడంవల్లగాని, గ్రామాల్లో సర్వసాధారణంగా యిటువంటి తగాదాల్లో "పెద్ద మనుషులు" చెప్పేతీర్పులు అలా వుంటటంవల్లగాని, మొండితగువుగాతేలే అవకాశం వుందని విసుగుచెందడంవల్లగాని, లేదా తన వర్గనైజంవల్లగాని అది "అప్పే" అన్నాడు నాయుడు.

గోపన్నకూడా పట్టుదలకి పోకుండా, "ఏలినవాడు ఏమిస్తాడో భగవంతుడే తమబుద్ధికితోపిస్తాడో ఇప్పించండి అదే మహాప్రసాదమని పట్టుకుపోతా"ననే సామరస్యధోరణిలో చెప్పాడు. గోపన్నవాదంలో కూడా శతృత్వంలేదు. 50 ఏళ్ళ గ్రామ చరిత్ర చెబుతున్నప్పుడు గూడా అప్పల్రాముడు శతృత్వవైఖరి చూపలేదు. మరి యీతగువు శతృపూరితంగా ఎక్కడ చూపినట్లు ?

అయితే యివేమైనా స్నేహపూరితమైన వాగ్వివాదమా? కాదు శతృపూరితమూ స్నేహపూరితముగాకుంటే యిదిఎలాంటి తగువు ? ఈ తగువుకి ఈకథలో ఎంత వరకు ప్రాముఖ్యతనివ్వాలి?

అప్పువున్నదాలేదా ? వుంటే ఎలాంటి అప్పు ? తీర్చాలనడం న్యాయమా ? అనే ప్రశ్నలకి ఎక్కువ ప్రాముఖ్యతనీయ నక్కరలేదు. ముఖ్యప్రశ్నలూ అంశాలు యివిగావు. సాంప్రదాయక/ Sudsistence Agriculture నుండిCommercialised agricultureకి మారుతున్న దశలో పేదరైతులూ చిన్నవ్యాపారులూనలిగిపోతారు

అనేదే ముఖ్యాంశం. ఇవి చూపించడానికే ఈతగవు వుపయోగపడింది. దీన్నొక పెద్ద వర్గపోరాటంగా చిత్రించడం దానిమీద వాగ్వివాదాలు పెంచుకోవటం కూడా అంతఅవసరం కాదేమో! అయితే సమస్యని నాటకీయంగా చెప్పడానికి, ఆమంటపమూ పంచాయితీ తగువు చివరిలో అట్వేస్తూ యిచ్చారు. వర్గపోరాట అంశాలు యిందులో కొన్నివున్నా, గ్రామం పైనుండివచ్చేశక్తుల దుష్ప్రభావమే బడుగువర్గాలPauperisation కి ఎక్కువ దోహదంచేసిందని చెప్పడం రచయిత వుద్దేశమయినట్లుంది. అంఛేత వర్గపోరాటాల గురించి, గోపన్నవిలనీ గూర్చి, శ్రీరాములు నాయుడు "కపటత్వం" గూర్చి వాదనలు ప్రతివాదనలూ చర్చనీయాంశాల్ని ప్రక్కదారిపట్టిస్తాయి.

(4) కథముగింపు :

కథ ముగింపుమీద రంగనాయకమ్మగారి విమర్శనాంశాలిలా వున్నాయి.

(i) "కథముగింపు అసహ్యంగా, జుగుప్సాకరంగావుంది".

(ii) "రచయిత సీతారాముడితో మాట్లాడించిన మాటలు విప్లవ చైతన్యంతో వుంటాయి. సీతారాముడు ముందడుగు ఎందుకు వేయలేదన్నదికాదు ప్రశ్న. వెనకడుగు ఎందుకువేశాడన్నది ప్రశ్న." (2 వ్యాసాలు పే. 85-82)

(iii) "సీతారాముడి ప్రవర్తనలో సహజంగా జరగవలసిందేదీ జరగలేదు. అతనికి విప్లవకారుడి స్వభావమూలేదు' కార్మికుడి స్వభావమూలేదు. రైతుస్వభావమూ లేదు. ఆఖరికి అతి సామాన్యుడి స్వభావమూలేదు" (2వ్యాసాలు పే. 89)

(iv) "గోపన్నకి కొత్తనోటు రాయగూడదా ? లేకపోతే యింకోచోట అప్పుతెచ్చి గోపన్న అప్పుతీర్చగూడదా ? (అప్పలాముడికి).... అప్పుపుట్టదా ?" (2 వ్యాసాలు పే. 78).

(v) "అప్పుతీర్చాలనే అభిప్రాయమూవుంది. అప్పుపుట్టించుకోగల పరపతీ వుంది! ఆ అప్పుతీర్చుకోగల అవకాశమూవుంది ఇకఏమిటి సమస్య ? భూమి అమ్మకం తప్పనిపరిస్థితి ఏమిటియిక్కడ ? .... ఇదేదో పెద్దభూమిసమస్య లాగ, రెండువర్గాలమధ్య సాగే భూమిపోరాటంలాగ చెయ్యడంతప్ప నిజంగా భూమిసమస్యవుందా ఇక్కడ ?" (2 వ్యాసాలు, పేజీలు 78-79)

(vi) "అసలు ఈబానిసత్వానికి దేన్నికారణంగా చెబుతారో ఆ కారణమే చాల బల హీనమైన కారణం. ఒకతలీ తండ్రీ నలుగురుకొడుకులూ వాళ్ళభార్యలూ

బిడ్డలూ అంతా రెండెకరాల పొలంలో బానిసత్వం లేకుండా స్వతంత్రంగా బతుకుతున్నారని చెప్పడం యిది." (2 వ్యాసాలు పే. 76-77).

షాకింగ్ స్టేట్ ఆఫ్ మైండ్ :

కథచదివాక ఒక షాకింగ్‌స్టేట్ ఏర్పడుతుంది. "ఇదేంటి? ఇలా ఎందుకుజరిగింది? ఇందుల్లో Poetic justice లేదు. ఇలాజరగదు. జరగకూడదు. ఇది అసహజం" అనే ఆలోచనలు చాలమంది పాఠకుల్లో వచ్చివుంటాయి. యజ్ఞంకథ వివాదాస్పదంగా మిగలడానికి ఈ ముగింపు ఎంతోతోడ్పడింది.

కుర్రాణ్ణిచంపి తలామొండెం ముందుపారేస్తే ఎవరికిమాత్రం జుగుప్సకలగదు? సీతారాముడిలా ఎందుకుచేశాడు? వెనకడుగు ఎందుకేశాడు? సీతారాముడిలో విప్లవ చైతన్యంవుందా? సీతారాముడిలో వాస్తవంగా విప్లవచైతన్యం లేకపోయినా, అతని మాటల్లో విప్లవచైతన్యం కన్పిస్తుందా?

యజ్ఞంకథలో 68వ పేజీనుండి 70వ పేజీవరకూ అక్కడక్కడా సీతారాముడి మాటలున్నాయి. మొదటగా "ఎవడుసెప్పినదరమం ఏటాదరమం" అంటాడు. తర్వాత తండ్రినినిందిస్తూ తనకి బానిసబతుకు యిష్టంలేదంటాడు. ఆ తర్వాత శ్రీరాములు నాయుడ్ని సంబోధిస్తూ "పూర్వం" తనకు అతనిమీద కసివుండేదని, యిప్పుడు లేదని ఎందుకంటే శ్రీరాములు ఒట్టిఎర్రిపీరువనీ అంటాడు.

ఆ గ్రామాన్ని నిజంగా ఏలేదికరణమూ మునసబూ అంటాడు. వాళ్ళని ధిక్కరించి శ్రీరాములు నాయుడు 'రాజ్జం' ఏలలేడనీ చెబుతాడు.

ఇందులో గ్రామంలోవున్న ధర్మాన్ని ఎద్దేవా చేయడం వుంది. ఉన్న కొద్ది కొండ్రాపోతే బానిసనవుతాననే వేదనవుంది. నిజమైన అధికారం రెవెన్యూఅధికారుల చేతుల్లో వుందనే వాదనవుంది. అటన్నిట్లోకీ, వున్న రెండెకరాలూఅమ్మేస్తే కుటుంబ సభ్యులు భూమిలేని కంబార్లుగా తయారవుతారనే దుగ్ధ ముఖ్యమైనది. భూమి చెయ్యిజారిపోతుందనే బాధ సీతారాముడ్ని సెమీ-మానియాక్‌స్టేజిలోకి దింపింది. తండ్రిమీద అలిగి పసికందుని నరికిన ఆవేశపరుడు. అయితే శ్రీరాములుమీద 'పూరవం' ఎందుకుంది కసి? యజ్ఞంవల్ల పేదలకు మంచి జరగడంలేదనీ, దీనికి కారణం యజ్ఞకర్త శ్రీరాములు గాబట్టి అతనిమీద కోపంగల్గివుండవచ్చు. లేదాఅప్పు

గావచ్చు. ఏదేమైనా సీతారాముడు విప్లవవాదీగాదు, అతని మాటల్లోగాని చేతల్లోగాని విప్లవచైతన్యం కన్పించడమూ లేదు. వాడిబాధంతా చేతిలోవున్న ఆకాస్త కొండాప్రి పోతుందనే,

ఆల్టర్నేటివ్స్ :

గోపన్నకి కొత్తనోటు రాయగూడదా ? "అప్పలాప్రిముడి 'అప్పు' "శానా కాలంనుండి వుండిపోనాది". ఈ అప్పుడబ్బుల కొరకు నోటు రాయించుకొని మూడేళ్ళనుండీ గోపన్న ఎదురుచూస్తున్నాడు. అతనూ బ్రితికిచెడినవాడు, గంపెడు సంసారం. డబ్బు అవసరం చాలా వుంధి.

మరో అప్పుచేసి గోపన్నబాకీతీరిస్తే ఆ అప్పుతీరేదెలా? కుటుంబంలో ఎవడో ఒకడు బాండెడ్ లేబర్‌గావాలిగదా. అంచేత ఆ అప్పుతీర్చుకోగల అవకాశం వుండను కోను. ఇది భూమి పోరాటంగాని మాట నిజమేగాని నాలుగైదుదశాబ్దాలుగా మధ్య తరగతి / సన్నకారురైతులు భూములు పోగొట్టుకొని కంబార్లుగావడంలోవున్న చివరి దశ. కాబట్టి "ఇదేదో పెద్దభూమి సమస్య కాదా"నుకోవడం అంటే అప్పలాప్రిముడి ద్వారా కా.రా. చెప్పిన గ్రామవ్యవసాయ చరిత్రని మరచిపోవడమే అవుతుంది.

ఆ రెండెకరాలపొలం వుండటంవల్ల అంతపెద్ద కుటుంబమూ స్వతంత్రంగా ఎలా బ్రితుకుతున్నారనేది మరో ప్రశ్న. ఆడామగా కూలికివెళ్తాండాలి. కాని 'తర తరాలుగా' అప్పలాప్రిముడిది రైతుకుటుంబం. అందువల్ల ఈకాస్త చెక్కాపోతే సంఘంలో pauperised peasentry గా వాళ్ళస్థితి అధోగతిపాలవుతుంది. వ్యవసాయ దేశాలలో రైతుకీ భూమికీవున్న సంబంధం తండ్రికీ బిడ్డకీవున్న సంబంధం కంటే గట్టిది. (అంచేత స్వయంహింసకు దారితీస్తుందని తీయాలనీ నేనడంలేదు.) పేద రైతాంగంలో ఈ భూమిమీది మమకారం చాలా తీవ్రంగా వుంటుంది. భూమివల్ల మానసికంగా, సాంఘికంగా రైతుపొందే ఆనందం, అనుభూతి కేవలం ఆర్థిక ప్రాతిపదిక మీదే ఆధారపడివుండదు. అందుకే ఆ పేదకుటుంబం భూమికోసరం అంతరొాష్టపడింది.

యజ్ఞంలో నాటకీయతా మరికొన్ని విషయాలు :

యజ్ఞంలోని నాటకీయతనిగూర్చి కె. రాధాకృష్ణమూర్తిగారు చక్కటి వ్యాసం రాశారు. ఈ కథని చదివి ఎంజాయ్ చెయ్యడానికి ఈ వ్యాసం ఎంతో తోడ్పడు

తుంది. "యాక్షనూ, రియాక్షనూ, డైలాగు- ఈ మూడు నాటకప్రక్రియలూ కలిసి 'యజ్ఞం' కథని మనకంటిముందు కదలాడే నాటకంగా పొందుపరుస్తున్నాయి; కథలోని వ్యక్తుల్ని చిత్రపటాలుగా కాకుండా జీవించివున్నట్లు రూపింపజేస్తున్నాయి.

(యజ్ఞం ఇతర కథలు, పే. 97).

'యజ్ఞంలోని నాటకంలో సంఘర్షణ.... ధర్మాధర్మాలమధ్య జరిగే సంఘర్షణ.... యీ ధర్మాత్మకమైన సంఘర్షణ.... (ఎవరి) .... మధ్య? అప్పలాస్వాముడికీ, శ్రీరాములునాయుడికీ మధ్యఅని ఘంటాపథంగా చెప్పవచ్చు." (పే. 97)

అభివృద్ధి కార్యక్రమాలు :

అయితే గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలగూర్చి రాధాకృష్ణమూర్తిగారి వ్యాఖ్యానం సరిగావున్నట్టులేదు.

"రోడ్డు రావటంవలన పేదప్రజలకొరిగేదేమిటని వాళ్ళకనుమానం. కాని ప్రభుత్వంవారికి ఏ అనుమానంలేదు. హైస్కూలువల్ల 'చదువుకున్న కూలీలు' తయారవుతారని, రోడ్డువల్ల మెషీన్లనిపెట్టి కామందులు గోదాలు నింపుకోవచ్చనీ, ఈ రెండంటిమిలనాకూడా ప్రయోజనం ధనికవర్గానికే అని ప్రభుత్వంవారికి సరిగా అర్థం మయింది ప్రభుత్వయంత్రాంగం ధనికవర్గాలకి లోబడివుండేదికాబట్టి వారికది సముచితమైనదే అనికూడా సరీగా బోధపడింది." (పే. 102)

పెట్టుబడిదారీ దేశాల్లోగాని, సామ్యవాదదేశంలోగాని "అభివృద్ధి"లేక మార్పు చెందే దశలో infrastructure చాలా అవసరం. ఇది రవాణాసౌకర్యాలవల్ల, నీటి పారుదలవల్ల, విద్యవల్ల, ఆరోగ్యకేంద్రాలవల్ల కలగవచ్చు. ఇవి రావడంవల్ల పురోగతికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. అయితే వాటిప్రయోజనాలు వాస్తవంలో ఎవరికి చేరుతాయి అనేది ఆ ప్రాంతంలోవున్న క్లాస్-కాంపోజిషన్ మీద చాలవరకు ఆధారపడి వుంటుంది. పెట్టుబడిదారీ, సెమీపెట్టుబడిదారీ దేశాలలో ధనికవర్గాలకే ఆ ప్రయోజనాలు ఎక్కువగా చెందుతాయి: అందులో సందేహంలేదు. అయితే విద్యవల్ల చదువుకున్న కూలీలని గ్రామాల్లో తయారుచేసికోవచ్చని అంచేతనే ధనికవర్గాలూ ప్రభుత్వమూ గ్రామాల్లోస్కూళ్ళేర్పరుస్తారని అనుకోవడం లాజిక్‌ని అవసరానికి మించి సాగదీయడమే.

రాధాకృష్ణమూర్తిగారు యరప్రియ్య చుట్టంచేసిన వాదనల్ని సమర్థించాడు. యరప్రియ్యచుట్టం అంటాడు.

"పండినపంటంతా కాంపందుల. గోదాలకెల్లాల ఎల్లకుండా కూలోడు అడ్డు తగుల్తున్నాడు. ఎనకటోర్జుల్లో తన్నిసేయించుకొనేవారు. ఇప్పటిరోజుల్లో ఆ పప్పు ఉడకవు. కూలోడిఅడ్డు వొదిలించుకోవాలంటే మిసీన్లురావాలి. మిసీన్లుతేవాలంటే యెలట్రిసిటీ, రోడ్డూరావాలి. అంతేకాదు, సదువుకున్నకూలోళ్ళు కావాలి. అందుకనే యీ అయిస్కూళ్ళు. అందుకనే యీరోడ్లూ యీ ఎలట్రిసిటీ. యియన్నీ మన కోసవే అనుకోడం మనబుద్ధి తక్కువ." (యజ్ఞం ఇతరకధలు, పేజీలు 60-61). శ్రామికవర్గంలో చైతన్యంఏర్పడి, సంఘటితం అయినప్పుడో, అయ్యేఅవకాశం వున్నప్పుడో పాతకాలంనాటి పప్పులుడకనిమాట నిజమే. అంచేతనే ధనికరైతులు Labour-saving technologyని వెతుకుతారు.

కాని యిది అన్నిచోట్లా ఒకేలాజరగదు. చదువుకోని కూలీలతోనే గ్రామాల్లో భూస్వామ్యవర్గాలూ, ధనికరైతులూ నిరంకుశమైన దోపిడీకొనసాగిస్తూండటం ఈ దేశంలో యింకా చూస్తూనేవున్నాం. బీహార్, తెలంగాణా దీనికి వుదాహరణలు. అంతేగాక వ్యవసాయం వ్యాపారీకరణ జరగటంవల్ల తప్పనిసరిగా పెట్టుబడిదారీ సంబంధాలు ఏర్పడాలనీ, అంచేత దోపిడీవర్గాలు infrastructure నీ, కొత్తగా వస్తున్న టెక్నాలజీని వుపయోగించుకోడానికి ప్రభుత్వంతో కుమ్మక్కయి ఆ సదుపాయాల్ని ఏర్పరుస్తాయనుకోవడం సత్యంగాదు.

ఒక్కసారి పంజాబ్, హర్యానాలాంటి ప్రాంతాల్లో ఏం జరుగుతుందో చూడండి. గ్రీన్-రివల్యూషన్ (వాస్తవంగా wheat-revolution) అంటూ వస్తున్న వ్యవసాయమార్పులలో, ఆ ప్రాంతానికి చెందిన ధనికరైతులూ, మధ్యతరగతి రైతులూ, ట్రాక్టర్లు ఎరువులూ, కొత్తవిత్తనాలూ మొదలయిన వాటితోపాటు, బీహారు ఒరిస్సాలాంటి పేదరాష్ట్రాలనుండి నిరక్షరాస్యులైన బాండెడ్‌లేబర్‌ని వినియోగించి దోపిడీ కొనసాగిస్తున్నారు. చెప్పేదేమంటే infrastructure వల్ల శ్రామికజనం చదువుకున్న కూలోళ్ళుగా తయారయేఅవకాశంవున్నా, దానిముఖ్యోద్దేశం చదువుకున్న కూలీల్ని ఏర్పరచడంగాదు. ఎర్రియ్య చుట్టంచేసిన వాదనలు పాక్షికసత్యాలు మాత్రమే.

కళాకారునిగా కా. రా.

కా. రా.ని కేవలం విప్లవాన్ని ప్రోత్సహించే రచయితగా మాత్రమే చూడ్డం సరికాదు. నిస్సందేహంగా ఆయన విప్లవాన్ని కోరుతున్నారు. ఆయనకు శ్రామికజనం

మీద అపారమైన ప్రేమ. ఆయన తీసుకొనే సమస్యలు జనానికి, అందులో పేద జనానికి సంబంధించిన సమస్యలు. పేదలగూర్చి చాలామంది రాస్తున్నారు. కాని ఆయన ప్రత్యేకత ఆయనదే.

సమస్యనిగూర్చి తీవ్రంగా ఆలోచించందే ఆయన కలంపట్టరు. అనన్యమైన పరిశీలనాశక్తీ, పరిశోధనాసక్తీ కా.రా. కున్నాయి. సమస్యల్ని క్లినికల్ గా పరిశీలించ గల మేధాసంపత్తి ఆయనకుంది.

కొడవటిగంటి కుటుంబరావుగారి తర్వాత పాఠకుల మేధస్సుని పరీక్షించే బహుకొద్ది మంది రచయితల్లో కా రా. ఒకడు. కుటుంబరావుగారి కథల్లోని వాదనా పటిమ, పతాభికథల్లోని లాలిత్యమూ, రా. వి శాస్త్రిగారి రచనల్లోవున్న సిన్సియారిటీ, తెలుగు వచనంమీద చలం గారికున్న అథారిటీ కా.రా. కథల్లో కన్పిస్తుంది.

కా.రా. కథలు కేవలం కథల్లావుండవు. జీవితంలా వుంటాయి. ఆ పాత్రలు మనముందు సజీవంగా నిల్చొని మాట్లాడుతున్నట్లుంటుంది. అప్పలాౖముడు మొదలు అన్నమయ్య వరకూ ఒక్కోరూ ఒక్కోవైపు. ఏ పాత్ర ప్రత్యేకత ఆ పాత్రదే. 'ఆర్తి' లాంటి కథలు ఎన్నిసార్లు చదివినా మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది.

పుస్తకం చదివాక "ఎలా రాయగలిగారీయన !" అనిపిస్తుంది. ఈయనకి జీవితాన్నిగూర్చి యింతలోతుగా ఆలోచించే ఓపికా, తీరికా ఎక్కడినుండి వచ్చేయి!!

కా.రా. కేవలం సాహితీవేత్త మాత్రమేగాదు. నిరంతరం జీవితాన్నిగూర్చి ఆలోచిస్తూ జనాన్ని ఆలోచింపజేస్తున్న తత్వవేత్త. జీవితాన్ని కాచివడపోసి మనబోటి సామాన్యులకి సారాన్ని దయతోఅందించే జ్ఞాని. పేదజనం బాగుపడాలనీ, ఈ నైరాశ్యం, దుఃఖం, అశాంతీ దోపిడీలు పోవాలనీ మనసారాకోరే యేవ్యక్తిఅయినా, ఏ సాహితీవేత్త అయినా ఏ శాస్త్రకారుడైనా కా.రా. ప్రతిభకి, చిత్తశుద్ధికి పరిశోధనా పటిమకి ముగ్ధులవుతారు.

కా.రా. కథల్లో తెలుగు జీవితంవుంది. తెలుగు జీవితంతో కా. రా. కథలు అవిభాజ్యాలయ్యాయి. బలహీనవర్గాలమీద ఆర్తివున్న ప్రతితెలుగువాడూ కా. రా.కి ఎంతో ఋణపడివున్నాడు. ఆయనకీ, ఆయన్ని మార్క్సిజమ్‌తో పరిచయం చేసిన రా.వి. శాస్త్రి లాంటి ఆయన మిత్రులకీ తెలుగు సాహిత్యం ఎంతో ఋణపడివుంది.

కా.రా. విప్లవరచయితే అయినా ఆయన్ని ఆ పరిధిలో మాత్రమే చూడ్డంతో ఆయన్నిగూర్చి పూర్తి అవగాహనరాదు. యజ్ఞానికి ముందు, యజ్ఞం తర్వాత మనం

ఎంతో విప్లవసాహిత్యాన్ని చూశాం. ఆ సాహిత్యం విలువనెవ్వరూ తగ్గించలేరు. ఒకచారిత్రిక పాత్రని ఆ సాహిత్యం నిర్వహించింది, నిర్వహించుతుంది. అయితే తెలుగునాడులో- అందులోనూ ఉత్తరకోస్తా ఆంధ్రిలోవున్న - ప్రత్యేక చారిత్రిక, భౌతిక పరిస్థితుల్ని గమనించి, ఆ పరిస్థితుల్ని తనలో ఇంటర్నలైజ్ చేసికొని, ఏడి వాద ధోరణికి, యాంత్రిక వ్యాఖ్యానాలకీ తావివ్వకుండా, తెలుగునేలలోవున్నప్రత్యేక సాంఘిక, సాంస్కృతిక Ethosని ప్రతిబింబిస్తూ పేదజనంలోవున్న అంతస్సంఘర్షణ లన్నీ, మొలకెత్తుతున్న అసమ్మతినీ, తిరుగుబాటుతనాన్ని అతినైపుణ్యంతో శుష్కమైన జాలితో పనిలేకుండానే, తన కళాఖండాల్ని సృష్టించగలిగారు కా.రా.

వాస్తవపరిస్థితుల్ని యధాతధంగా తనరచనలో ప్రతిబింబిస్తేనో, కేవలం విప్లవాన్ని ప్రోత్సహిస్తుంచేనో రచనలు కళారూపాలుకాలేవు. సామ్యవాదకళకి ఈరెండూ అవసరమేగాని అవి రెండూవున్న కొన్ని రచనలు కారికేచర్స్‌గానో, ప్రాపగండా మెటీరియల్‌గానో మిగిలిపోతాయి. అలాగే కళవేరు, శాస్త్రీయజ్ఞానంవేరు. భౌతిక వాస్తవాలని శాస్త్రీయవిజ్ఞానం ప్రతిబింబిస్తుంది; ఇదికళలోజరగదు. వాక్వజ్‌చెప్పినట్లు

"Artistic truth is not determined by a full correspondence between art and ideology... Art as knowledge of reality— not in can show as a portion of realits- its objective essence, which is the Scientific task of science, but in its relationship to human nature". (Adolfo Sanchez Vasquez, Art and Society, Essays in Marxist Aesthetics, P. 26,31).

కళకీ అయిడియాలజీకి సంబంధంలేదనిగాదు. ప్రతి కళారూపకానికి ఒక సిద్ధాంతిక భాగంవుంటుంది. అయితే అది కళలో సమ్మిళితమైవుండాలి. అలాగే వాస్తవాన్ని గూర్చి చెప్పి జ్ఞానప్రబోధచేసేపాత్రగూడా కళకుంది.

"From a truly aesthetic point of view the work of art does-not depend for its life on either the ideology that inspiresit or its function of reflecting reality. It exists by it self with its own reality into which that which it expressesor reflects is integrated. A work of art is Primarily a human creation and it exists through the creative Power it incarnates" (Vasquez, cP. cit. pp40&41)

ఈయాంగిల్లోచూస్తే రంగనాయకమ్మగారి విమర్శ one-side గా (ideology-oriented గా) వుంది. కళ సిద్ధాంత వ్యాఖ్యానరూపంగానేగాక జ్ఞానంయొక్కమనోరూపంగావుండాలి. ఈరెండు ప్రయోజనాల్ని కా. రా. కథలు పుష్కలంగా సాంధించాయి. అంచేతనే ఆయన గొప్పకళాకారులయ్యారు.

[(i) యజ్ఞం కథమీద గతసంవత్సరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్థిక శాఖలోని M.Phil విద్యార్థులతోనూ, ఉపాధ్యాయులతోనూ చర్చించే అవకాశం లభించింది. ఈచర్చకి ప్రోత్సాహమిచ్చిన మిత్రులు ప్రొఫెసర్ ఆర్. రాధాకృష్ణ, డా॥ వి. వి. ఎన్. సోమయాజులు, డా॥ యమ్. అచ్చిరెడ్డి గారలకి నా కృతజ్ఞతలు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ త్రివేండ్రంలోని M.Phil విద్యార్థులతోనూ, మిత్రులు. శ్రీయుతులు వి.జె.పి. బోస్, ఎన్. చంద్రమోహన్‌గారలతోను మరో మారు చర్చించా. ఈచర్చలు సమీక్ష వ్యాసరచనలకి ఎంతో వుపయోగపడ్డాయి. కా.రా. గారితో కొన్నివుత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఎంతోఓపికతో వారు నా ప్రశ్నలకి సమాధానాలు యిచ్చారు. అయితే ఈ సమీక్షలోని భావాలకీ, యింటర్ప్రెటేషన్‌కి వారు బాధ్యులుగారు.

(ii) యజ్ఞంమీద అందరికన్నా ముందుగా నేను చర్చించింది ప్రియమిత్రుడు ప్రొఫెసర్ ఆర్. ఎస్. రావుగారితో. యజ్ఞంమీద నా ఆసక్తికి, వుత్సాహానికి వారు ఎంతో ప్రోత్సాహమిచ్చారు. అడిగిందే తడవుగా ఈ సమీక్షావ్యాసం మొదటి ప్రతి మీద ఏమ సుదీర్ఘమయిన విమర్శనీ. వ్యాఖ్యానాన్ని రాసిపంపారు. వారికి నాహృదయ పూర్వక కృతజ్ఞతలు. అయితే ఒకటి రెండుచోట్ల వారివిమర్శని సలహాని యీప్రతిలో చేర్చలేకపోయాను. కారణం నాకున్న భిన్నమైన అవగాహనే.

(iii) 1920-1950 మధ్య సుందరపాలెంలాంటి గ్రామాల వ్యవసాయాన్ని ఎలా characterise చెయ్యాలి? ప్రధానంగా feudal అంశాలున్నాయా, present Proprietorship అంశాలున్నాయా లేక capitalist agriculture యొక్క అంశాలున్నాయా? ఈ ప్రశ్నలకి సమాధానాలివ్వాలంటే సైద్ధాంతిక చర్చతోపాటు సుందరపాలెంలాంటి గ్రామాల వ్యవసాయ చరిత్రనుంచి evidence సేకరించాలి. అంతవరకూ నిర్దిష్టంగాచెప్పడం కష్టం. నా టెంటేటివ్ అవగాహన ఏమంటే 1910ప్రాంతంలో సుందరపాలెంలోవున్న dominant characteristic ఫ్యూడలిజంకాని Peasant-Proprietorship. 1920-1950 మధ్య అనేకమార్పులు జరిగాయి. Peasant Proprietorship base మీదనే కొన్ని feudal ఎలిమెంట్సూ, మరిన్ని capitalist ఎలిమెంట్సూ juxtapose అవబడ్డాయి. అంచేత 1910కి ముందుగాని, 1910-1950 మధ్యగాని dominant mode of production ఫ్యూడలిజంకాదు. దీన్ని Semi-feudalism అనిగూడా అనలేము. ఇదే నా భిన్నమైన అవగాహన. ఈ అవగాహనకి శ్రీ కా. రా. గాని శ్రీ ఆరెస్‌రావుగారు గాని బాధ్యులుగారు. ఆ బాధ్యతపూర్తిగా నాదే — జీయస్రీవు]

కవితలు :

శత్రువు నీడలో నా మిత్రుడు

పిఎచ్. మధు

వాడూ నా మిత్రుడే

మా నడకమీద పరిశోధనచేసి
వర్గగీతలు గీసినవాని గతస్మృతులు
వాడు నేడు రాయి - రత్నం తెలియని పిల్లవాడు
వెన్నెల ఎండ తెలియని గొప్పోడు
మేడ - గుడిసె చేతులుకలుపాలని
తూర్పు - పడమరకు వారధికట్టాలని
గాలిలో రాత్రి - పగలు కాలంమీద ప్రయాణంచేసి
అస్తమిస్తున్న చీకటిని
ఉదయిస్తున్న తూర్పును శ్లాఘించి
వెలుగు వెలిగి నేలరాలిన నక్షత్రాలకు జోహార్లుపలికి
కవితలలో దుఃఖించి
కామెంట్రీలలో గర్జించిన
నా మిత్రుడు మేధావి
నేడు
కాషాయబట్టల రాజర్షిమీద
గ్లామర్ పెంచుకున్న కలంగాడు
ఉదయం కొరకు ఎత్తినచేతుల
ఆకాశానికెత్తే సాడని
జనంమీద అభిమానంతో కసులుమెరిసాయని
'ఆర్ద్రిత' గొంతులో లక్ష్యం వికసించిందని
వాని నటనానుభవం మరిచి
మంచోణ్ణి చేసాడు మా వాడు
జైలు ద్వారాలు తెరిచేవుంచారని
లాఠీలు జనంమీత మ్రోగుతున్నాయని
ఎన్‌కౌంటర్ రక్తం భూమిని ఎరుపుచేసిందని

నా మిత్రునికి తెలిసినా
పాలునీళ్లు వేరుచేయలేని వివేకివాడు

జనం, సమానత్వం, విప్లవం
పదాల గారడీలో
దోపిడీ చేతులను శక్తివంతం చేస్తున్న
తృణావర్త కూప సన్నిభుని మీద
అభిమాన అక్షరాల పూలమాలలేస్తున్న
నా మిత్రుడు
తెలిసి - తెలిసీ అణచివేతపక్షం చేరిన అమాయకుడు

నా మిత్రుని
గీతలు శత్రువుకు దారిచూపిస్తున్నాయి
నా మిత్రుని
రాతలు శత్రువుకు రక్షణవలయాన్ని నిర్మిస్తున్నాయి

అడవి ఉప్పొంగిన రాత్రి

విమల

చీకటి కదులుతోంది
చెట్లుకొమ్మల నాలుకల్నిచాచి
భయపెడుతున్నాయి
అర్థంకాని అస్పష్టపుధ్వని....
రాళ్ళపై వాగు ప్రవహించేధ్వని....
ఎండిన ఆకులపై
నాపాదాల చప్పుడు
నన్నే ఉలిక్కిపడేలా
జాగురూకురాల్ని చేస్తుంది

ఇక్కడ
అనుక్షణం అప్రమత్తత
అడవి శిక్షణ నాకు
శబ్దాన్ని చూడటం నేర్పింది
అడవిలో ఈ రాత్రి........
నేను దారితప్పలేదు
దారితెలిసే వచ్చాను
జమ్మిచెట్టెక్కించిన
ఆయుధాల్ని
కిందికిదించి
ధరించడానికే వచ్చాను

రాత్రి....
కొండశిఖరాన
నేనొంటరి సెంట్రీ
అయిఉన్నప్పుడు....

అడవిన విశ్శబ్దం నుండి
ఆదిమ మానవుడి
స్వేచ్ఛాగర్జన-
నా గుండెల్ని పిండేస్తూ
రక్తం కణకణాన
శబ్దం నిండి
బద్దలవుతున్నట్లు
నన్నుక్కిరిబిక్కిరి చేస్తున్నది

మహానగరాల్లో
కిక్కిరిసిన
జనసందోహం మధ్య
నాడు నేను ఏకాకిని
నేడు....
అడవికి - మైదానానికి
మధ్య 'కొరియర్'ని
చలిరాత్రుళ్ళు, వర్షపుచినుకులు
సూదుల్లా వర్షిస్తూ
శరీరాన్ని తాకుతూఉంటే
"కొప్పెరకాగితం" కప్పుకొని
పొలంగట్లపై
అడవిఅంచున
గుట్టల్లో బండరాళ్ళపక్కనా
నేనూ రాయినై
ఒంటరిగా
ఒంటరిగానే
జనంకోసం
జనంమధ్యన
నేను ఏకాకిగానే
"సందేశాలకై"
జాగరణలు చేశాను

రాత్రి.......
కళ్ళనిండా చీకటి కుమ్మరించి
వెళ్ళిన రాత్రి-
దార్నిండా పల్లేర్లున్నా
'ఎలుగు'లు నన్ను
తాకుతూవెళ్ళినా
నాచేత నిప్పున్నా
నెగడు వెలిగించకూడని
రాత్రి....
"అడవిగాచిన వెన్నెల"
నాకు దారిచూపుతుంది

కిరాయికి అమ్ముడుపోయిన
వాడి మిషన్‌గన్
ప్రాణత్యాగాలకు
సిద్ధపడ్డ వాళ్ళముందు
మందు దట్టించిన బర్మారు
కొబ్బరికొన నిప్పురవ్వకి
గజగజ వణుకుతుంది
రాత్రి....
నిద్రిస్తున్న కామ్రేడ్స్‌ను
కాపాడు కునేందుకు
శత్రువునువెతికే
సెర్చ్‌లైట్లవుతాయి
నా కళ్ళు
రక్తాన్నిగడ్డకట్టించే
ఈ అడవి చలిలో
శరీరానికి చల్లగాతాకుతున్న
ఆయుధం
నాలో వేడిరగిలిస్తుంది

భుజాల్ని కృంగదీసే
బరువుల్తో....
ఆయుధం మరింత బరువైనా
అదినన్ను నిటారుగా
నిలబెడుతుంది.

వాగుల్ని, గుట్టల్ని
తుప్పల్ని దాటి
ఒకరివెనుక ఒకరు
'చలిచీమల' బారుల్లా
నడచి, నడచి
మనిషి ఎన్నడూ
సంచరించని
అడవి మారుమూలల్లోని
"డెన్"కి
నేనూవెడుతున్నా!

మేమిక్కడఉన్నది
వ్యర్థంగా
అర్థంలేకుండాకాదు
మనుష్యులు సంచరించనిచోట
"స్థావరం"
భయపడి దాక్కునేందుకుకాదు
యుద్ధంలో కందకంలా
అడవి విప్లవంలో
బ్యారికేడ్ అవుతుంది

తీవ్రనిర్బంధంలో-
అప్పుడేకన్న కసికందుల్ని
అడవిదాటించలేక
క్యాంపులముందే
వదిలేయాల్సివచ్చిన
కడుపుకోత-
బిడ్డల్ని వేటగాడికి
బలిఇచ్చిన
ఆడపులి ఆక్రోశంలా
కసిగా
ఈ వ్యవస్థపై బద్ధలైన
బాంబులు-
నా అక్కలు
పద్మక్క, లలితక్క,
పంచాది నిర్మలలు

అడవి
తల్లి ఒడిలాముడుచుకున్న
తనకంటిపాపల్ని
రక్షించుకోలేక
కన్నీటి ఆకుల్నిరాలుస్తూ
విలపిస్తున్నది

తుపాకీ పైకెత్తి
చేస్తున్న ప్రతిజ్ఞకు
ఒక కొత్త గొంతుకు
ఒక కొత్త స్పర్శకు
తిరిగి అడవి పులకిస్తుంది

అమరవీరులు
అడవిలో ఎన్నటికీ
వాడిపోని
పచ్చటి మొక్కలు

జన సముద్రానికి
శాఖ అడవి

ఇప్పుడు-
అడవి సముద్రంలా
ఉప్పొంగుతోంది
చెట్ల అలలు
మైదానాల్ని తాకుతున్నాయి
అడవి నా రక్షకవచం
ఆయుధం నాకు దిక్సూచి.

బెంగాలీ కవిత :

ఆ మనిషి

కొందరాయనను
దేవుణ్ణి చేశారు
మరికొందరు
ఆయనను రాక్షసుణ్ని చేయాలని
పిచ్చెత్తిపోయారు
ఆయన 'ఒక మనిషి' అన్నందుకు
ఇద్దరూ మమ్మల్ని తప్పుపట్టారు

ఏదో ఓ పెద్దచప్పుడుతో బద్దలవుతుంది
మా గ్రూపుకూడా చీలిపోతుంది
కొందరికళ్ళు మోసంతో మెరుస్తాయి
మరికొందరి కళ్ళలో
నిజమైన కన్నీటిచుక్కలా కొన్ని
మొలుస్తాయి

ఇక ఏ దేవుడూ మిగిలిలేడు
రాక్షసుడూ లేడు
మనతో లేకుండాపోయినవి
ఇంకెన్నో ఉన్నాయి

ఐనా జనానికి పాటలుకావాలి
వాళ్ళు బతకదలుచుకున్నారు
కానీ-
ఎవరి వెనుక నడుస్తారువాళ్ళు ?

చావుతోకూడా
అంతమనేది లేదు
ఇవాళ్టికీ
వివాదాలు గుట్టలుగా పేరుకుపోతాయి
ఓవైపున ఓగ్రూపూ
మరోవైపున మరో గ్రూపు మోహరిస్తాయి
సరిగ్గా మధ్యలో
నిలబడతాడా మనిషి-
తను తాగిన విషంతో
నీలంగామారిపోయి
నిలబడతాడు చారుమజుందార్ !

— కౌశిక్ బెనర్జీ

సవరణ

'విరసం సంస్థాపకసభ (ఖమ్మం)లో ప్రసంగిస్తున్న చెర' అని రాసివేసిన ఫోటో (సృజన, జులై 83 సంచిక-సం") ఖమ్మం ప్రారంభసభల నాటిదికాదు. అది విజయవాడలో జరిగిన ఆం. ప్ర. ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభల్లో కవితాపఠనం చేస్తున్న చెర ఫోటో. ఇదే Caption పొరబాటు చెర 'నా జీవితరేఖలు'లో కూడా దొర్లింది. (ఈ ఫోటోలో నగ్నముని కూడా వున్నాడు. ఆయన ఖమ్మంరాలేదు.)

— నిఖిలేశ్వర్

భారతదేశంలో జాతుల సమస్య

ఆగస్టు 1981 లో మద్రాసులో ఆంధ్రప్రదేశ్ రాడికల్ విద్యార్థి సంఘం జరిపిన సెమినార్‌లో సమర్పించిన వ్యాసాలసంపుటి 'భారతదేశంలో జాతుల సమస్య'. ఇది భారతదేశంలోని జాతుల సమస్యను చాలా విపులంగా చర్చించింది. భారతదేశంలోని వివిధ జాతుల సమస్యను విశ్లేషించిన విద్యావేత్తల, ఉద్యమకారుల గొప్ప సిద్ధాంతపరమైన వ్యాసాలు, ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి "ముందుమాట", డా॥ నరేంద్రసింగ్, సి. ఎఫ్. టి. ఆర్. ఐ. మైసూర్ సుదీర్ఘమయిన స్వాగతోపన్యాసం ఇందులో వున్నాయి. చాలాబాగా విశ్లేషించబడ్డ జాతులు, తిలోత్తమమిశ్రా, ఉదయన్‌మిశ్రా (డిబ్రూగర్ యునివర్సిటీ)లు అస్సాం మరియు నాగాలమీద రాసిన వ్యాసం, మిగితా జాతులసమస్యల్లో పెరియార్ ఉద్యమం యొక్క మూలపురుషుడు టి అనైముత్తు విశ్లేషించిన తమిళనాడు సమస్య, పార్లమెంట్ సభ్యుడు ఎ.కె.రాయ్ జార్ఖండ్ ఉద్యమం, కార్మికనాయకుడు శంకర్‌గుహానియోగి ఛత్తీస్‌ఘడ్ ఉద్యమం, విద్యార్థి ప్రగతిసంఘటన్‌వారి 'ప్రత్యేక విదర్భ ఉద్యమం' ఉన్నాయి. వీటితోపాటు విప్లవనాయకుడు, ఎ. పి. ఆర్. ఎస్. యు కార్యకర్త ఆర్. కృష్ణమూర్తి రెండు అత్యుత్తమ సిద్ధాంతవ్యాసాలు, ఇవికాక ఇంకాకొన్ని చిన్న, స్కెచ్ వ్యాసాలు ఉన్నాయి. విద్యార్థిసంస్థలవి, విద్యావేత్తలయిన డా. ఎ.ఆర్. దేశాయ్, ప్రొఫెసర్ నిర్మల్‌సేన్‌గుప్తా, ప్రొఫెసర్ ఆర్.యస్. రావ్ సమర్పించినవికూడా ఉన్నాయి. ఈ పుస్తకంలో ఒక లోపమేమిటంటే ఇందులో కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య ప్రాంతాలవంటి ముఖ్యమైన జాతుల గురించి పట్టించుకోలేదు. అయినా ఇది గొప్ప ప్రయత్నమే.

'జాతి విముక్తియొక్క కొత్తపాట' పరిచయంతో పుస్తకం మొదలవుతుంది. ఇందులో "జాతి విముక్తియొక్క గర్జనలు పెద్దప్రతీఘాతుక ధ్వని మరుగునపడ్డాయా? చాలా మంది అట్లాగే అనుకుంటున్నారు. కాని అది పొరపాటు. మనం గర్జనలు వినకుండా క్రొత్తపాలకులు తమ బ్యాండును చాలా బిగ్గరగా వాయిస్తున్నారు. ఇప్పుడు బ్యాండు ధ్వనిని అతిక్రమించి జాతివిముక్తి కొత్తధ్వనిగా కోరస్ పాడుతున్నది. పెద్దగా బ్యాండు వాయిస్తున్న వాళ్ళు భయపడడం మీరు చూడవచ్చు."

అవును అస్సాం ప్రజలు గర్జిస్తున్నారు, కేంద్రప్రభుత్వం బ్యాండువాయించే వాళ్ళు భయపడుతున్నారు. ఇవ్వాళ భారతరాజకీయాల్లోకి జాతుల సమస్య మళ్ళీ ముందుకు నెట్టబడుతున్నది. ఇది చాలా రూపాలు తీసుకొంటుంది. విదేశీయులకు

వ్యతిరేకంగా కావచ్చు లేక భాషాసమస్య, కేంద్రరాష్ట్ర సంబంధాలు కావచ్చు. అన్నీ కలిసి ఇవ్వాళ భారతరాజకీయాల్లో, ఉద్యమాల్లో జాతులసమస్య ముఖ్యమైన భాగమయ్యాయి. కాని ఇది ఇప్పుడు మొదలయ్యింది కాదు. నిజానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత (బ్రిటిష్ ఇండియాలో కూడా) భాషా రాష్ట్రాల ఏర్పాటుకు చాలా ఉద్యమాలు దేశమంతటా మొదలయ్యాయి. ఇందులో చెప్పుకోదగ్గవి 1950 నాటి ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం. ఇలాంటి బలమైన ఉద్యమాలున్నా, ఈ ఉద్యమాల గురించి ప్రత్యేకంగా, భారతదేశంలోని జాతుల సమస్య గురించి మొత్తంగా అంచనా, విశ్లేషణ, అర్థంచేసుకోవడం, సిద్ధాంతపరమైన ఆలోచన జరగలేదు. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన చెప్పుకోదగ్గ పుస్తకం ఎ. ఆర్. దేశాయ్ రాసిందే. అప్పటినుంచి మళ్ళీ చెప్పుకోదగింది ఏమీలేదు. ఎ. పి. ఆర్. ఎస్. యు వారి ప్రస్తుత పుస్తకం 'భారతదేశంలో జాతుల సమస్య' చాలాకాలంగా వున్న శూన్యాన్ని పూరించింది.

ఇవ్వాళ జాతులసమస్యను రంగంమీదకు నెట్టింది అస్సాం ఉద్యమం. నిన్న నాగా, మణిపూరీల ఉద్యమం, అంతకుముందు తమిళనాడు భాషాసమస్య. ప్రభుత్వం ఇటువంటి ఉద్యమాలను శాంతిభద్రతల సమస్యగా భావిస్తున్నది. కాని ఈ ఉద్యమాల గురించి అర్థంచేసుకోవాలంటే చాలా వివరంగా జాతుల చరిత్రగురించి తెలుసుకోవడం అవసరం. ఇందుకు ఈ పుస్తకం చాలా ఉపయోగిస్తుంది.

వివిధ జాతులు

మొదట అస్సాం సమస్యగురించి తిలోత్తమమిశ్రాయొక్క పరిశీలన తీసుకుందాం. అస్సాం 1228 నుంచి 1816 వరకు అహోంరాజులచే స్వతంత్ర రాజ్యంగా పాలించబడి 1826లో మాత్రమే బ్రిటిష్‌వారిచే ఆక్రమించబడ్డది. అది అంతకుముందు భారతదేశపాలకుల అధీనంలో ఎప్పుడూలేదు. బ్రిటిష్ అధికారం, అధికమైన పన్నులభారం అస్సాంలో 19వ శతాబ్దంలో అధికసంఖ్యలో బ్రిటిష్ వ్యతిరేక సాయుధరైతాంగ తిరుగుబాట్లకు దారితీసింది. తిలోత్తమమిశ్రా చెప్పినట్టు "అస్సాం రైతులు సాయుధ తిరుగుబాటు మరియు సమాంతర ప్రభుత్వం ఆలోచనకు ఎంత దగ్గరవారంటే 1942లో ఉద్యమం తీవ్రమైన పోరాటరూపందాల్చి బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధం అస్సాం గ్రామప్రజలమీద ఉన్నా రైతురాజ్యం స్థాపించేస్థాయికి ఎదిగింది." ఈ ఉద్యమంతో సాంప్రదాయకమైన రేజ్‌మేల్ తరహా ప్రజల

మీటింగులు ఏర్పడి నిర్మాణాత్మకమైన చర్యలగురించి చర్చించడం మొదలు పెట్టారు. దీనిప్రభావం పట్టణప్రాంత ప్రజలమీదపడి ఈ ఉత్తేజంతో రైతు సభలు ఏర్పాటుచేసుకొని రైతులు తమ కోర్కెలను ప్రకటించుకున్నారు. సభల ఆశయాలతో ఇవి 1882లో అస్సాం అసోసియేషన్‌గా ఏర్పాటయ్యింది. బ్రిటిష్ పాలనలో అస్సాం బెంగాల్‌లో చేర్చడంవల్ల ఉద్యోగాలు ఎక్కువగా బెంగాలీలకే చెందడం జరిగింది. అస్సాంభాష భారతదేశ ఇతరభాషల్లాగే అభివృద్ధి చెందిందయినా పాలనాభాష, బోధనాభాషకూడా బెంగాలీయే, అస్సామీకాదు. బ్రిటీష్ వ్యతిరేకత, అస్సామీల ఆర్థిక, సాంస్కృతిక జీవితాల్లో బెంగాలీల ఏలుబడి ఇతబడి అస్సాం గతస్వతంత్ర చరిత్రకూడా కలసి అన్నీ బలమైన అస్సామీ జాతీయభావానికి తోడ్పడ్డాయి. తిలోత్తమమిశ్రా చెప్పినట్లుగా "అస్సాం అసోసియన్, అస్సాం ఛాత్రపరిషద్ (1916), అస్సాం సాహిత్యసభ (1917) అస్సామీ జాతిచైతన్యాన్ని పెంపొందించడానికి ఏర్పడ్డవే. ప్రముఖ అస్సామీసాహిత్యకారుడు లక్ష్మీనాథ్ బెజ్ బారువా అస్సాంకొరకు జాతీయగీతాన్ని రాసాడు. అది అన్ని పాఠశాలల్లోను, కాలేజీల్లోను, బహిరంగసభల్లోను పాడేవారు. ఇప్పటికీకూడా ఈపాట అస్సామీలలో 'జనగణమన'కన్నా జాతీయగీతంగా ఎక్కువ ప్రసిద్ధికెక్కింది. తిలోత్తమమిశ్రా ఇంకా కేంద్రప్రభుత్వం అస్సాంను ఆర్థికంగా ఎలా దోచుకుంటున్నదిచెప్తూ, ఈ పూర్వరంగంలో ప్రస్తుత అస్సాంఉద్యమం పరిశీలించాలంటాడు. విదేశీయులకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రస్తుతఉద్యమం పరిశీలించడానికి ఈ వ్యాసం అస్సాం జాతీయచరిత్రమీద వెలుగు ప్రసరించింది.

ఉదయన్‌మిశ్రా నాగాజాతీయుల చరిత్రనువివరిస్తూ నాగాలు శతాబ్దాలుగా స్వతంత్ర గిరిజనతెగ రాజ్యాలుగా నివసించారని పేర్కొన్నాడు. 1835 నుంచి బ్రిటిష్‌వాళ్ళు నాగా సరిహద్దుల్లోకి చొచ్చుకొనిపోవడం ప్రారంభించి చివరకు 1878లో కోహిమాను ఆక్రమించుకున్నారు. నాగాలు తీవ్రమైన ప్రతిఘటనచేసి 1879/80లో 11 రోజులుగా కోహిమాను చుట్టుముట్టినా బ్రిటిష్‌వాళ్ళను తరిమికొట్టలేకపోయి మొదటిసారిగా బలవంతంగా విదేశీపాలనలో బ్రతకాల్సివచ్చింది. బ్రిటిష్‌వారు నాగాలను ఎప్పుడూ బ్రిటిష్ ఇండియా పరిధిలోకి తేకుండా విడిగాఉంచారు. కాని 1930 మొదట్లో (భారత జాతీయోద్యమం పెరిగిన తర్వాత) బ్రిటిష్‌వాళ్ళు ఒకవేళ వెళ్ళిపోతే వాళ్ళను స్వతంత్రంగా ఉంచాలని నాగాలు స్పష్టంచేసారు. కాని బ్రిటిష్‌వాళ్ళు వెళ్ళిపోయేటప్పుడు నాగాలకు తెలువకుండా నాగాలాండ్‌ను ఇండియన్ యూనియన్‌లో భాగంగా

చేర్చారు. నిజానికి ఈ భయంతోనే 1946 లో నాగానేషనల్ కౌన్సిల్ (ఎన్.ఎన్.సి) నాగాలందరి మొదటి ఐక్యసంస్థగా ఏర్పడింది. ఉదయన్‌మిశ్రా ఇలా చెప్పాడు: "ఎన్. ఎన్. సి అన్ని నాగా తెగల ఐక్యతకు వారి స్వాతంత్ర్యం కొరకు ఉద్దేశించబడిందని మన దేశంలో మనపాలనను అనుభవిద్దామని భారత దేశంలో ముడిపడ్డ సరిహద్దు సమస్యలకోసం, పోట్లాడుదాం పరిష్కరించుకుందాం, నిఘాఉంచుదామని డిసెంబర్ 6, 1946న ఎన్. ఎన్. సి సెక్రిటరీ ప్రకటించారు. కాని కొత్త భారతప్రభుత్వం ఎన్. ఎన్. సి కోరికలను ఒప్పుకోలేదు. 1949 లో ఎన్. ఎన్. సి మిలిటెంట్ సంస్థగా రూపొంది, 1951 లో నాగా స్వాతంత్ర్యం మీద ప్రజల ఉద్దేశ్యాన్ని అభిప్రాయసేకరణ ద్వారా విజయవంతంగా తెలుసుకొని 1952 సాధారణ ఎన్నికలను బహిష్కరించారు." తర్వాత సహాయనిరాకరణోద్యమం పాఠశాల టీచర్ల మూకఉమ్మడి రాజీనామాలు, భారతప్రభుత్వ పాలనను బహిష్కరించడం, పన్నుల నిరాకరణోద్యమం మొదలయ్యింది. ఉద్యమాన్ని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం శతవిధాల ప్రయత్నించి, చివరకు నిర్బంధకాండకు పాల్పడింది. దానితో కేంద్ర ప్రభుత్వానికి, భారతసైన్యానికి వ్యతిరేకంగా ప్రజాఉద్యమం గెరిల్లా పోరాట రూపంగా మారింది.

ఈ విధంగా పుస్తకం తమిళనాడు జాతిసమస్య, జార్ఖండ్ ఉద్యమం, ఛత్తీస్‌ఘడ్ ఉద్యమం, ప్రత్యేక విదర్భ ఉద్యమాలను తరువాత భారతదేశంలో జాతుల సమస్యను పరిశీలిస్తుంది.

భారతదేశంలో జాతుల సమస్య

డా. ఎ. ఆర్. దేశాయ్ మొదట కొన్నిముఖ్యవిషయాలు లేవనెత్తితే ప్రొఫెసర్ ఆర్.ఎస్. రావు జాతులసమస్య భూస్వామ్య వ్యతిరేకపోరాటానికి ఎలా సంబంధం కలపాలో చూపెట్టాడు. తరువాత ఎ కె. రాయ్ తనసిద్ధాంతమైన 'అంతర్గతవలస విధానం'ను వివరిస్తాడు. దానిలో అభివృద్ధిచెందిన ప్రాంతాలకు వెనకబడ్డ ప్రాంతాలు 'అంతర్గత వలసలు' అని ప్రతిపాదిస్తాడు. ఈ సిద్ధాంతం సరియైనదికాదు. వలస విధానానికి ఒక అర్థంవుంది. ఒకవేళ జార్ఖండ్ ఒక వలసఅయితే దాన్నివలసగా చేసుకున్న జాతిఏది? అయితే మహారాష్ట్ర ఒక అభివృద్ధిచెందిన జాతా? వలస పాలన జాతా? దానికి దాదాపు భారతదేశంలోని సంపద, పరిశ్రమల్లో 40% ఉన్నాయి.

అట్లయితే మహారాష్ట్రలో వెనకబడ్డ ప్రాంతాల సంగతేమిటి? లేక ఇవి బొంబాయి, పూనావంటి పారిశ్రామిక ప్రాంతాలవలనలా? 65% ఫ్యాక్టరీలు, 70% ఉద్యోగాలు, ఉత్పత్తిలో 81% ఈ రెండునగరాలలో ఉన్నాయి. వీటితోపాటు ఆర్. కృష్ణమూర్తి తన అద్భుతమైన వ్యాసంలో జాతుల పెరుగుదలనేది ఒక క్రమబద్ధమైన పద్ధతని, అది పెట్టుబడివిధానం పెరుగుదలతో దేశంలో ఒక నిర్దిష్టమైన రూపంతీసుకుంటుం దని వివరించాడు. పెట్టుబడిదారీ విధానంవైపు అభివృద్ధి చెందేక్రమంలో 'జాతి సమస్య' వివిధ రూపాంతరాలు చెందుతుంది. ప్రధానంగా అర్ధభూస్వామ్య, వెనుక బడ్డ దేశమైన భారతదేశంలో ప్రధానంగా పెట్టుబడిదారీ సంబంధాలు పూర్తిగా అభి వృద్ధి చెందకపోవడంవల్ల జాతులసమస్యకూడా ప్రాంతీయ భాషాసమస్య, నిరుద్యోగం మొదలయిన సమస్యలతో కలసి మార్పుచెందుతూ వస్తుంది. భారతదేశం నానాజాతుల రాజ్యమైనా ప్రస్తుతవ్యవస్థలో అన్నిజాతులు పూర్తిగా పుష్పించడం సాధ్యంకాదు, కాబోదు. ప్రస్తుతం అవి బడాదళారీ బూర్జువా అధీనంలోని కేంద్రప్రభుత్వం సేవ చేస్తూ దానిపాదాలకింద నలుగుతున్నవి. జనతా ప్రజాస్వామిక విప్లవం విజయ వంతంఅయి భారత రిపబ్లిక్ ఏర్పడి నిజమైన ఫెడరల్ ప్రభుత్వం- స్థాపించబడిన తరువాతనే అన్ని జాతులు పుష్పించడం జరుగుతుందని హామీ ఇవ్వబడునని ఈవ్యాసం చెప్తుంది.

ఈ పుస్తకం మనకు భారతదేశంలోని జాతుల సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవ డానికి, కొన్ని జాతీయ పోరాటాల గురించి సరియైన అవగాహన పెంపొందడానికి, ఈశాన్యరాష్ట్రాల గురించి, తమిళనాడు భాషాసమస్య, కర్నాటక భాషాసమస్య, వెనక బడ్డప్రాంతాల ఉద్యమాలు, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, విదర్భ మొదలయిన వాటి గురించి వివరిస్తూనే సమయం వచ్చినప్పుడు జాతులసమస్య ఏరకమైన రూపం ఎంచుకుంటుందీ చెబుతుంది. ముందుమాటలో మనోరంజన్ మహంతి చెప్పినట్టు "మార్చింగ్ గీతం"లో ఇవ్వాళ ఎన్ని గొంతులైన ఉండవచ్చు. కానీ అవి హిమా లయాల నుంచి హిందూమహాసముద్రం వరకు విముక్తిని ప్రతిధ్వనిస్తాయి. ఈ పాట నిర్మాణంలో భాగస్థులయిన ఆర్. ఎస్. యును తప్పకుండా అభినందించాలి. దీన్ని లక్షలాదిమంది పాడుతారు. కాలంగడుస్తుంది. దేశంయొక్క బ్యాండు వాయించేవాళ్ళు తగ్గకతప్పదు.

— కోబడ్‌గాంధీ

సాహిత్యలేఖ :

చెరబండరాజు 'వందేమాతరం' : సోదుం సమర్థన

దిగంబరకవులు తమ కవిత్వంలోని లోటుపాట్లనూ, మంచిచెడ్డలనూ బేరీజు వేసుకుని, కొంతమందైనా శాస్త్రీయ ఆలోచనాధోరణికి దారిమరల్చారు. 'స్త్రీ'ని దూషణ పదవ్యుత్పత్తిలోవాడటం, సహజంగా బూతుతో బూర్జువానిసైతం తిట్టటం విప్లవతత్వానికి ఏమాత్రం దోహదంచేయదని అంగీకరించారు. ఈ నేపధ్యంలోనే జ్వాలాముఖి 'వందేమాతరం'గేయం చేసిన అపకారాన్ని పలుచోట్ల ప్రస్తావించారు. ఆంధ్రయూనివర్సిటీ విద్యార్థి సమూహంఎదుట నిఖిలేశ్వర్ 'అమ్మా, భారతీ' గేయం చదివితే ఆవేశపడిన విద్యార్థులు వందేమాతరం గేయం రాజుచదవగానే మౌనంవహించారు. గుసగుసలు ప్రారంభించారు. ఇప్పుడు కొత్తగా ఆ సెంటిమెంటును సమర్థించటానికి సోదుంగారు బరితెగించి గిరిలోకిదూకటం "శాంకోపాంజా - గాలిమరలు" గుర్తుకుతెస్తుంది.

'జాతీయభావం'గూర్చి కమ్యూనిస్టు నిర్వచనానికి పోయేముందు చిన్నసంగతి. తెలుగునోటి అనూచాన తిట్టుసంప్రదాయంలో "నీఎమ్మ" అనివుందికాని "నాఎమ్మ" అనిలేదు. మరీతెలివితక్కువతనం అయితే తమ్ముణ్ణి "నీఎమ్మ" అనితిట్టినట్లు! రాజు హృదయంమీద ఎవరికీ రెండు అభిప్రాయాలులేవు. కాని రాజుపడ్డ పొరపాటు, "ఒరే, రాజ్యాధినేతా, నీఎమ్మా" అనబోయి, "అమ్మా, మాతృదేశమా....నీవు ప్రక్క మీద...." అనేయటం, జరిగింది. ఏ తల్లినీ "నీవు ప్రక్కమీద ఇలా చేసావు" అనటం, మానవత్వానికి ఏకోణంనుండి చూసినావిరుద్ధం. తల్లి నిర్భాగ్యురాలై తనువుఅమ్ముకున్నా తిట్టటంనేరం. "నువ్వుకులటవు" అనటం ఘోరం. "To do or not to do" అని హామ్లెట్‌కొచ్చిన పాటి విచక్షణ రాకపోవటం అత్యంత విచారకరం.

"సంపన్నునిచేతిలో మైమరచి" మాతృదేశం నిద్రించదు. "దుండగులతో కులుకుతున్న"ది మాతృదేశంకాదు. మాతృదేశంయొక్క అశక్తత. నిస్సహాయత. దౌర్భాగ్యస్థితి. అందుకే "మాతృదేశవిముక్తి"అంటారు కమ్యూనిస్టులు. "ఈజాతిని పీడించే" ఉన్నతవర్గ నాశనంతో "జాతి"కి స్వేచ్ఛావాయువులొస్తాయన్నది కమ్యూనిస్టు సెంటిమెంటులోభాగం. కమ్యూనిస్టులు 'సెంటిమెంటాలిటీ'కి వ్యతిరేకులు. సెంటిమెంట్లకు వ్యతిరేకులుకారు. 'Of human values in literature' అని ఇటీవల సోవియట్ ప్రచురించిన గ్రంథంనిండా ఏ విలువలున్నాయో గమనించారా....! నా

దేశం, నా ప్రజలు, నాసోదరులు, నా'జాతి'అనేవి ఉత్తమోత్తమమైన మానవ విలువలుగా పరిగణించటం సోషలిష్టు వాస్తవికతలో అంతర్భాగం అనటం సోదుంవారు విన్నారా.

"Nationalism is a legitimate pride as long as it does not degenerate in to sabre - rattling Chauvinism" అని శ్రీశ్రీ అనటం ఎంత సరైనదో చూసారా. ఉన్నతవర్గాల జాతీయత ఉత్తపాటలభక్తి, ప్రజాభక్తికాదు. కనుకనే "వారిజాతీయత వారిదోపిడీలో అంతర్భాగం" అనేది. అలాగని జాతీయతే అబద్ధంకాదు. జాతి (Nation) వేరు, రాజ్యం (State) వేరు. మాతృదేశంవంటి సెంటిమెంట్లు జాతిని నిర్మిస్తాయి. ప్రభుత్వమూ, న్యాయస్థానాలూ, రాజ్యాన్ని నిర్మిస్తాయి. రాజ్యాధినేతల్ని తిట్టబోయి రాజు అపరిణత మనస్తత్వంతో అలనాడు దేశాన్నితిట్టాడు. "ప్రభుత్వమా, అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టావే" అనబోయి "ఓనామాతృదేశమా" అని తప్పుగా ప్రారంభించాడు కవి.

ఇది బూర్జువాల సెంటిమెంట్లనుమాత్రమే దెబ్బతీస్తుందనటం సోదుం గారి తిరుగులేని అజ్ఞానం. బూర్జువాలకు సెంటిమెంట్లుఅంటూ ఏడుస్తాయా.... దెబ్బతినటానికి ! అసలు బాధకలిగేది మధ్యతరగతికీ. క్రిందితరగతి మేధోజీవులకూ.... బుద్ధిజీవులకూ !! "వర్గచైతన్యంవున్న శ్రమజీవిఎవరూ" ఇదివిని బాధపడరన్నారు సోదుంగారు.

కరెక్టే. ఎందుచేతనో ! ఎందుచేతనంటే.... శ్రమజీవులు కవిత్వం.... అందులోనూ వచనకవిత్వం వినటంలేదు.... విన్నా అర్థంచేసుకోలేరుకనుక. వచన కవిత్వం మధ్యతరగతి బుద్ధిజీవుల్నిదాటి క్రిందికి వెళ్ళటంలేదుగనుక. "మరి సరిగ్గా వాళ్ళ hurt" అవుతున్నారు అని జ్వాలాముఖిఅంటే, సోదుంవారు burst అవటం దేనికి. జ్వాలాముఖికి ఎక్కడ మధ్యతరగతి చైతన్యం అంటుకుందోఅని భయపడటం దేనికి. "ప్రజల్ని దూరంచేసుకుంటారేమో"అని జ్వాలాముఖి అంటే, దిగంబర కవికంటే ఎక్కువగా బూతులో పరమార్థంఉందని కవినిమించిన కవిభక్తి సోదుం వారికి దేనికి !

ఈబాష, ఈసంస్కృతి, ఈ దేశం, ఈప్రజలు, ఈనాగరికత వెరసి "జాతి" అనికదా. వారి "సెంటిమెంట్లను గౌరవించాలనేకదా" జాతులసమస్య సోవియట్‌లో అతిజాగ్రత్తగా పరిష్కరించబడింది. అటువంటి జాతీయభావనపై అతిజాగ్రత్తగా

మెలగటం 'కమ్యూనిస్టుల దేశభక్తి' అనిపించుకుంటుంది. శుష్కభక్తి నినాదనాడి, జాతీయత శక్తిగామారాలనటం కమ్యూనిస్టులధ్యేయంగా పరిణమిస్తుంది. బలమైన జాతీయతే అంతర్జాతీయతకు సోపానమవుతుంది.

"అంతేకాని దేశంలోని ఒకవర్గానికీ, వర్గాధిపత్యానికీ ఆపాదించవలసిన నికృష్టపుతిట్లు మాతృదేశం పరంగా ఎక్కుపెట్టటం చెయ్యరానిదోషం"అని నిర్ద్వంద్వంగా అంగీకరించటంబోయి.... బూర్జువా మేధావులకీ, కమ్యూనిస్టు మేధావులకూ ఉన్నతేడాలు చర్చించబోవటం శుద్ధ అప్రస్తుతం. తాను 'కమ్యూనిస్టుమేధావి'అనిపించుకుంటేచాలు, జ్వాలాముఖితోసహా వాస్తవాలు ఏగంగలోకలిసినా ప్రమాదంలేదనే ధోరణిలో అంతర్భాగమిది. చెరబండరాజు కవిత్వంలో దోషంఉండటానికి వీల్లేదన్నతత్వం, రాజుకీర్తికి మచ్చతెస్తుందేతప్ప హెచ్చుమేలుచేయదు.

— చందు సుబ్బారావు

పుస్తక స్వీకారం

1. వేదాల్లో ఏమున్నది ? —కొడవటిగంటి కుటుంబరావు, పేజీలు : 94; వెల 1.25
2. మీ పేరుఏమిటి ? —గురజాడ అప్పారావు, పేజీలు 44 వెల : 1.25 లు
3. ఆలోచించండి —డా. మిత్రా, పేజీలు : 32 వెల : 1 రూ,
4. గణపతి — పురాణం సుబ్రహ్మణ్యశర్మ, పేజీలు : 44, వెల : 1.25రూ.
5. గౌరి — పురాణం సుబ్రహ్మణ్యశర్మ, పేజీలు : 68, వెల : 1.75 రూ
   1 నుండి 5 వరకున్న పుస్తకాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 3-6-697, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029
6. శ్రీశ్రీ సంస్మరణిక — శ్రీ"కాట్రగడ్డ" గేయాలు ఉచితప్రతులకు : శ్రీ "కాట్రగడ్డ", పెదపాడు - 534 437
7. ప్రకంపనం (కవితాసంకలనం) పులిపాక శ్రీరామచంద్రమూర్తి, పేజీలు vi + 48, వెల : 4 రూ. లు, ప్రతులకు : 1. నవోదయ పబ్లిషర్స్ ఏలూరురోడ్, విజయవాడ - 2, 2. పి. యస్. ఆర్. మూర్తి, C/o ఎస్. సి. యు. పి. స్కూల్, మణుగూరు, ఖమ్మం - 507 117
8. ఊపిరి (మొదటి సంచిక) ప్రచురణ : చైతన్య సాహితీ మిత్రులు, సిద్ధిపేట
9. రెండుపదులపైన (చేరా గేయాలు) పేజీలు xx + 52, వెల : 10 రూ. ప్రచురణ : శ్రీదేవి పబ్లికేషన్, 2-1-527/7, నల్లకుంట, హైదరాబాదు - 500 044

కథనం ;

ధూదిపులి

గోదావరి

అప్పటిదాకా నిర్విరామంగా తాపీఆడించిన తాపీమేస్త్రీ తాపీ గోడమీదపెట్టి నిలబడ్డాడు. మరోకమారు ఆ కట్టడాన్ని నాలుగు పక్కలనుంచి చూడాలనేతలంపు కలిగింది మేస్త్రీకి.... ఆ కట్టడానికి పదడుగులదూరంవెళ్లి బుర్రమీసాలు ఎడంచేత సవరించుకుంటూ ఎగాదిగాచూశాడు. సిమెంటు కలుపుతున్నవాళ్ళు, ఇటికలుమోస్తున్న వాళ్లు పనాపి మేస్త్రీచూసినట్టుగానే వాళ్లూచూశారు.... మేస్త్రీ ముఖంలో వెలుగు. కట్టడం తను అనుకున్నవిధంగానే వస్తున్నందుకు తృప్తిగా ఊపిరిపీల్చుకున్నాడు.

మళ్ళీ తాపీఅందుకున్నాడు.... "మాల్ మాల్.... అందుకోండి.... ఒరేయ్.... అగో అట్లాంటి సగంకాలిన ఇటికలుతేవద్దు. జెర కాలాడియ్యండ్లి.... లంజకొడుకులకు ఏ ఘడియల ఏబుద్ధిపుడుతదో? ఆనకాలం దెవుసం.... గింతపూర్తి జేస్తే...." మేస్త్రీ కూలీలను వేగిరపరుస్తున్నాడు. అతని మనసులో ముప్పయిఅడుగుల స్థూపం. దానిమీద తానురూపొందించబోయే ఇద్దరిరూపం అతనికళ్ళముందు కదులుతోంది.

"ఇది ఏబస్తీనుంచిచూసినా కనిపియ్యాలె.... వాళ్ళముఖాలల్లో సరిగ్గా మార్కెట్ల ఉపన్యాసం యిచ్చినప్పుడు చూసిన ఉద్వేగం ఉండాలె" మేస్త్రీ అంతరంగంలో....

మేస్త్రీ ఇంతకుముందు వంకీలకట్టడాలు, పెద్దపెద్ద బిల్డింగులు కట్టాడు.... సిమెంటుకు పోత్రిణంపోశాడు. లతలు, సింహాలు, దేవుళ్ళవిగ్రహాలు చాలాచాలాకట్టాడు.... కాని ఈ స్థూపం కడుతున్నప్పుడున్నంత ఉషారుగా ఎన్నడూలేడు.... పునాదులు తవ్విస్తున్న దగ్గరినుండి- ఒక్కొక్క ఇటుక పేరుస్తున్నకొద్ది అతను రాత్రి పగలు ఒకటేకలవరింత- ఈస్థూపం బస్తిబస్తికి కనిపియ్యాలే. తానురూపొందించబోయే అమరవీరులు తమబస్తీవాళ్లే- చిన్నతనంనుండి వాళ్ళు ఎర్రజెండాఎత్తుకొని దుమ్ము రేగుతుండగా తమవాడలల్లో తిరిగిన దినాలు గుర్తుకుతెచ్చుకున్నాడు.... తను ఆ దుమ్ములో వాళ్ళెంట తిరిగినవాడే. వాళ్ళు ఉపన్యసిస్తుండగా వీధిలోనిలబడి ఆ మాటలువిన్నవాడే. వాళ్ల పోయినతరువాత వాళ్ళమాటలు మనసులో పోటెత్తేవి.

దాదాపు రెండుసంవత్సరాల తరువాత పైసా పైసా పోగుచేస్తే ఇప్పటికి తమ బస్తీవాళ్ళకోరిక ఫలించబోతోంది. మేస్త్రీకి గంగారాం తల్లి గుర్తొచ్చింది. గుడ్ల నిండా నీళ్ల గుబగుబలాడగా రోజుకోమారువచ్చి తయారవుతున్న స్థూపందగ్గర కూలబడుతుంది.... పసిగుడ్డును తడిమినట్టు- ఆ ఇటుకపెల్లలను తడుముతుంది. పెద్ది

శంకర్ తండ్రి కాకీనెక్కరుతో నెత్తిమీద హెల్మెటుతో దూరంగా నిలబడి "మావోడు దేన్నైతేకోరిండో దేనికోసమైతే తన పానాలిచ్చిండో అదింకా మిగిలేఉన్నది". అంటున్నట్లుగానే మేస్త్రీకితోచింది.

వాళ్లిద్దరు తమనాయకులు.... వాళ్లిద్దరు తమకోసమే మరణించినవాళ్లు- వాళ్లు తమవాళ్లు- వాళ్లజ్ఞాపకాలను, తమమసిబారిన కళ్ళముందు- తమ పూరిగుడిసెలమధ్య మహోన్నతంగా నిలబెట్టుకోవాలని కలలుకన్న కార్మికులు వస్తూపోతూ స్థూపందగ్గర నిలబడి మరీ వెళ్లేవాళ్లు....

మేస్త్రీకి ఇట్లాంటి ఎన్నో సంగతులు జ్ఞాపకంవస్తున్నాయి.... ఆ స్థూపానికి ఇటుకలు మోసేవాళ్లు, సిమెంటు అందించేవాళ్లు వాళ్లందరికీ ఆ అమరవీరుల జ్ఞాపకాలున్నాయి....

స్థూపం లేచిపోతోంది.... పారలగరగర- ఇటుకలమీద తాపీదెబ్బ.... మేస్త్రీ గొణుగుడు మొత్తానికి యమసందడిగానే ఉన్నది....

బహుశా సమయం రెండుదాటిఉండవచ్చు. స్థూపం సగబడలేచింది.... పని జోరుగా సాగుతోంది.... అలాంటిసమయంలో డిసిల్‌జీబొచ్చి దూరంగాఆగింది.... అందులోనుండి నలుగురుపోలీసులు, ఒక యస్.ఐ. ఒక సర్కిల్ దిగారు. కర కర లాడే బొగ్గునెరుసులమీద తోలుబూట్లు టకటకలాడించుకుంటూ స్థూపందగ్గరిదాకా వచ్చారు.

"రాడికల్ నాకొడుకుల అరెస్టు చేయండి." సర్కిల్ ఊబిచెంపలు ఊగు తుండగా....

"యే మాకేలాడోంకో పకడో" బక్కచెంపల కోతిముఖపు యస్.ఐ....

మేస్త్రీ విస్తుపోయాడు. కూలీలు పనాపి నిల్చొన్నారు.

"మేం రాడికల్లంగాదు మేషన్లం" మేస్త్రీ గొణిగిండు.

రెండేరెండు నిమిషాలు.... పోలీసులు కూలీలమీదపడ్డారు.... ఆడకూలీలను విడిచిపెట్టి కంటికి నజరుగకన్పించిన వారినల్లా ఏరుకొని జీపెక్కించారు.... మేస్త్రీని, మేస్త్రీపనిముట్లను, తట్టలను పారలను అరెస్టు చేశారు....

అందులో ఒక వయసుమళ్లిన పోలీసుకు పెద్దిశంకర్‌ను తొలిసారి అరెస్టుచేయడం గుర్తొచ్చింది.... 'ఆ స్థూపాన్ని అరెస్టుచేస్తే....' సర్కిల్‌కు చిత్రమైనఆలోచన వచ్చింది.... జీపు కదిలింది.... నల్లటిదుమ్ము రేగింది....

గుడిసెల్లనుండి బిలబిల జనం పరుగెత్తుకొచ్చారు.... సగంలేచిన స్థూపం.... కలిపినసిమెంటు- పేర్చిన ఇటుకలు....

"పనిఇసిరెలు పట్టుకపోయిండ్లు గాడ్దికొడుకులు.... కొడుకుల్లాలా మా రోజు లత్తయి.... మీహోలర్ల- మీజీబుల- మీ తుపాకుల.... మీతూటుకొమ్ముల- మీకుర్సీల ఇర్సికట్టేయకుంటే నాపేరు ఏల్పుల బాలిగాడుగాదు...." ఓ కార్మికుడు వదురుతున్నాడు.

"ఇగో ఆల్లిల్లు కామునిపెంటగాను.... ఆళ్లమీదదుబ్బబడ.... లావుసెల్లిచ్చు కుంటండ్లు.... ఇగో మనరెక్కలున్నయి.... ఎట్లతీసుకపోతరోసూత్తాం.... అందరం కడుదాం.... మనకొడుకుల మనం నిలుపుకుందాం...." ఓ నల్లటిదొడ్డుట్లామె- చేతులాడుస్తోంది....

సైకిళ్లు కిరకిరలాడాయి- బోకినోళ్లుతిట్టాయి.... గుడిసెలు గుసగుసలాడాయి. మొత్తానికి ఊరంతా వార్త గుప్పుమంది.... ఓరచూపులచూస్తూ కడక్‌కాకీగుడ్డలేసుకొని వాడవాడలా సి.ఆర్.పి. పోలీసులు గస్తీతిరిగారు....

* * * *

చిమ్మెట్లుపలుకుతున్నాయి.... నీటిగుంటల్లో ఒకటి అర చిన్న కప్పలు అరుస్తున్నాయి.... ఆకాశం మసకేసిపోయింది. గుడ్డి చుక్కలు ఒకటీ అరా వెలిగిమలుగుతున్నాయి.... మబ్బుతెప్పలు కూడావిడిగా తిరుగుతున్నాయి.... వీధిలైట్లచుట్టు పేడపురుగులు తిరుగుతున్నాయి....గుడిసెలచుట్టు చీకటి గుసగుసలాడుతోంది అర్థరాత్రి.. అలాంటి అర్ధరాత్రి.... తుపాకులుమోస్తూ తలలువంచుకొని కండ్లునులుపుకుంటూ గొణుక్కుంటూ దాదాపు రెండుపందలమంది పోలీసులు స్థూపంచుట్టూ నిలుచున్నారు బారులుతీరి.... వాళ్లమధ్య యస్. పి. నిలుచున్నాడు.... చల్లటిగాలి తోలుతున్నా, అది వానకాలమైనా యస్.పికి చెమటలు కారుతున్నాయి. అతనిపక్క నలుగురైదుగురు అధికార్లు కిక్కురుమనకుండా నిలుచున్నారు....

"అందరూ వినండి.... వాళ్లు బతికుండగా ఈ ప్రాంతంలో ఎంత గడబిడ జరిగిందో మీకు తెలుసు.... ఈ స్థూపంపూర్తయితే- చచ్చినవాళ్లు మళ్ళీ బతుకుతారు. మనకంట్రోల్లో ఈఏరియా ఉండదు. సో- పదినిమిషాలల్లో దీన్నికూల్చెయ్యాలి...." యస్.పి ఇంగ్లీషులో బొంగురు గొంతుతో చెప్పాడు.... అప్పటికే అతడు అలిసిపోయాడు.... ఇంకా వాళ్లగురించి, వాళ్ల 'దురాగతాల' గురించి చాలా చెప్పాలనుకున్నాడు.... కాని గొంతు పెకలలేదు.

"యస్. సర్." ఎవడో అధికారి కీచుగొంతుతోగాజిగి ఆచీకట్లోనే బూట్లు తాకించి సెల్యూట్ చేశాడు.

ఓకే ఒకనిమిషం.... పోలీసులు మాట్లాడలేదు.... బంగారం లాంటినిద్ర- ఈ ఘనకార్యం పగలు చేయకుండా ఇంతరాత్రి ఎందుకుచేయాలో అర్థంకాలేదు.... ఎవడో అధికారి కొందరిని తుపాకులతో కాపలాకాయమన్నాడు.... పోలీసుపనంటే తుపాకి ఎక్కుపెట్టడం, పరేడ్ చేయడం, బాయేముడ్, దాయేముడ్‌లు.... కడక్‌బట్టలు గడ్డాలుగీసుకోవడం, బూట్లకుపాలిష్ రాసుకోవడం.... వీడు గడ్డపారలెత్తమంటండు. జోగుతూనే స్థూపాన్ని సమీపించారు. గడ్డపారలెత్తారు.... తప్పటోతే భయం.... గోరీలల్లో దయ్యాలుంటాయి.... అసలే కమ్యూనిస్టులు.... తప్పుతుంటే గుప్కీ-గుప్కీ-చప్పుడు.... పోలీసులకు చెమటలు కారుతున్నాయి....

పెళ్లలుకూలి కాళ్లమీదపడ్డాయి.... జబ్బలు తీపునంబెట్టాయి. ఒకడు గునపం పక్కవాడికాలుమీద పారేశాడు....

యస్.పి... సిగరెట్టుతాగుతూ జీపులో కూర్చున్నాడు- సిగరెట్టుపొగల నుండే సైగలుచేశాడు- లారీలొచ్చాయి. తిడుతూ గొణుగుతూ స్థూపాన్ని నేలమట్టం చేశారు.

"లోడ్ ది.లారీస్" యస్, పి.

కారిననెత్తురంత కడవల్లకెత్తినట్టు, చిందిననెత్తురంత పీపాలకెత్తినట్టు.... ఆ ఎర్రటి ఇటుకపెల్లలు, ఆ సిమెంటు తమముఖాలకు, తమ బట్టలకు అంటుతుండగా లారీలకెత్తారు.... లారీలు కదిలిపోయాయి.

ఊరుఊరంతా నిశ్శబ్దంగానేఉన్నది.... చుక్కలు కళ్లుమూసుకున్నాయి. దిక్కుతోచని చిమ్మెట్లు అమరవీరులకు జోహార్లుపలుకుతూ ఎడతెరపిలేకుండా పలుకుతూనే ఉన్నాయి.

* * * *

తెల్లారింది.... స్థూపందగ్గరికి పరుగెత్తుకొచ్చిన తల్లి గుండెలుబాదుకున్నది.... చప్పిడి దవడలవాళ్లు, మసిబారిన ముఖాలవాళ్లు, దగ్గులోళ్లు, దమ్ములోళ్లు, హెల్మెట్ల వాళ్లు, చెమ్మాసులు భుజంమీద వేసుకొచ్చినవాళ్లు.... ఒపరేమిటి పిల్లాజెల్లా, ముసలీ ముతకా, స్త్రీలు అంతా కలబెనిగారు. తిట్టారు, ఏడ్చారు....

ఒక దమ్మురోగపు హేలర్‌మాన్ బొక్కటోపి తీసి మౌనంగా ఒకనిముషం నిలుచున్నాడు.... ఆతరువాత "ఇదేమన్న బాంబా? బత్తా? పేలిపోయి ఆళ్ల గు....ల

కింది కుర్చీలు కూలిపోవటానికి- ఆళ్లబంగ్లాలు గంగలకలువటానికి.... భయపడ్డరు బద్మాషి లంజకొడుకులు.... వారీ సూత్తండ్లారా ? వాళ్లకెంతభయమో " లొడలొడ వాగుతున్నాడు, తిడుతున్నాడు....

ఇంకొకడు ఎత్తుగడ్డమీద నిలబడి- "మనవీరులంటే ఎంతగుండెదడ.... ఒక్కొక్క ఇటుకపెల్ల దానికదే తిరగబడ్తదని జెనికిండ్లు- మన కామేర్డ్లు మన గుండెల్లో ఉన్నరు- అక్కడెట్లాతవ్వుతరు- మనహెల్మెట్లలో- మనచెమ్మాసుల్లో వాళ్లున్నరు "

మాట పూర్తికాకుండానే ఇంకొక యువకుడందుకొని "పైసపైస కుప్పజేసుకున్నం- మనంఎర్రికోట కట్టాలనుకోలే- మనమేమి తాజ్‌మహల్ గట్టాలనుకోలే- మన దిక్కుమాల్న బతుకులు బాగుపడాల్నని పానానికి పానమిచ్చిన అన్నలకు స్థూపం గట్టాలనుకున్నం.... అదిబాంబయ్యింది.... భయపెట్టింది.... మనఅన్నలు మనందీసే బొగ్గుకుప్పల్లో అగ్గి.... రవులుకుంటరు...." ఇంకా ఏదోచెప్పబోయాడు.

ఒకస్త్రీ చేతులుతిప్పుతూ తిడుతోంది. వాళ్లకళ్లల్లో క్రోధం- వాళ్లకళ్లల్లో కసి. పిడికిళ్లు బిగుసుకున్నాయి.... మాటలు నినాదాలరూపం తీసుకున్నాయి.... నిలబడ్డ పాదాలు నేలనుగుద్దాయి....

ఇంతలోనే కాకీగుడ్డలు పరుగులెత్తాయి.... బూట్లు టకటకలాడాయి.... లాఠీలు లేచాయి....

జనం చెదిరిపోయారు.... వాడవాడలా కాగితాలు గోడలమీద ఎర్రెర్రగా.... వాడవాడలా వందలాదిపోలీసులు.... యస్. పి. పిచ్చెత్తినట్లుగా అరుస్తున్నాడు....

బొగ్గు రవులుకుంటోంది....

గుడిసెలు ప్లానులు రచిస్తున్నాయి.... వాళ్ళకుతెలుసు అమరవీరులునేర్పిన పోరాటం.... వాళ్లకుతెలుసు రగులుకోవడం.... వాళ్లకుతెలుసు అమరవీరుల లక్ష్యం.

ఎక్కుపెట్టిన తుపాకులమధ్య వాళ్లు ఆలోచిస్తున్నారు.... వాళ్లఆలోచనల్లో ఎర్రెర్రగా నిలిచిన అమరవీరులను ఎట్లాచెరుపగలడు యస్. పి....

స్థూపం కూల్చేసినా వాడవాడలా బొగ్గురగులుకోవడం ఎందుచేతనో యస్.పి.కి అర్థంకాలేదు....

కథనం :

'ఒరిగిన అన్నల కెన్నీయలో....'

పి. చంద్

గోధుమవన్నె నీటిరంగుతో పారిజహిత పచ్చటి చెట్లమధ్య పరవళ్ళుతొక్కుతూ సాగిపోతున్నది. పారిజహితకు పడమరదిక్కున పెద్దిశంకరన్న నాటిన ఎర్రపూలవన మున్నది. తూర్పున కూలిజనం రెక్కలు ముక్కలుచేసుకొని పవరచ్చిన చేసిన 'భూదేవి' దొరవారి చెరల ఉన్నది.

అటువంటి నేలలో మోకాలుమంటి బురదలో కూలీజనం నడుములు వంచి, తలలువాల్చి అంటుకపోతున్న ఖాలీకడుపులతో కలుపులుతీస్తూ అలిసిపోయివున్నవేళ....

చల్లటిగాలివోల్గె ఎర్రపూలవనం నుండి 'ఎన్నెల'పాట పాడుతూ సూరీడు వచ్చిండు....

నడుమువంచిన రామక్క తలెత్తి పాటవచ్చిన దిక్కుగా చూసింది.... పాట లోని మాటను ఆలకించింది. పాటలోని బతుక్కు తనబతుక్కి పోల్చుకుని ఆవేశం పొంగిరాంగ, "ఏంబతుకులు పాడుబతుకులు పొద్దుపొడిసినకాన్నుంచి పొద్దుగూకె వరకు పనిచేసినా కడుపునిండదాయే.... చేసేంభాగ్యం చేయకేంభాగ్యం" అని బయిటికేఅంది.

"అవును నిజం.... ఏంబతుకులు మనయి" వీరస్వామి వంతపాడిండు.

అలిసిపోయిన కూలీలు ఒకచోట కూచొని ఆలోచన్లపడ్డరు....

సూరీడు దగ్గరగావచ్చి "మన అన్ని కష్టాలకు మూలం మనకు భూమిలేక పోవడమే" అన్నడు.

"నిశ్చంగా అంతే" ముసలి బక్కయ్య సమర్థించిండు. బొక్కినోరు ఎల్లబెట్టి.

"దున్నుకోవడానికి భూమికావాలే"

"భూమి మన దగ్గరుంటే మనకష్టాలు దూరమైతయి"

"ఆకలికిమాడి సచ్చేదుండదు" అందరి ఆలోచన్ల అదే....

"అయితే భూమిఎక్కడుంది ?" సూరీడు ప్రశ్నించాడు.

"దొరదగ్గర" చిప్పిరెంటికల చినఅచ్చి టక్కునబదులిచ్చింది. నిజమేఅన్నట్లు అక్కడున్నోల్లంతా తలలూపిండ్లు.

సూరీడు మళ్ళవోరిప్పిండు "అవును దొరదగ్గరుంది భూమి. దొరదగ్గరకు ఎందుకుచేరింది ?" ప్రశ్నిస్తున్నట్టుగా అందరినిచూసి మళ్ళీతనే చెప్పటం మొదలు పెట్టిండు. "దొరపుట్టినపుడు బొడ్లేసుకపుట్టిండా ? లేకుంటె చెట్టుపుట్టాకొట్టి నేలను సాపుచేసిండా ? నాగలిపట్టిండా ? విత్తునాటాడా ? కాపుకాసాడా ? ఇదేదీచేయని దొరకు పంటెందుకు చెందాలి ?"

అందరు ఆలోచన్లపడ్డరు. ఉండి ఉండి "దొరకుబలంఉంది జులుంచేస్తడు" భయపడుతూ పలికిండొకడు.

"దొరకు రెండుచేతులు. మనకు వందల వేల చేతులు" సూరీడి ధైర్యానికి అందరు.... తమపిడికిళ్ళను చూసుకున్నారు. మట్టిపిసికి, చెట్టుకొట్టిన చేతుల్ల నరాలు జివ్వునపొంగి నిజమేఅన్నాయి.

"ఆకలికి ఎట్లాగూచస్తాం. ఆ సచ్చేదేదో పోరాడిచస్తాం"
"పుట్టేదోరోజు సచ్చేదోరోజు"
"బతికిసచ్చేకంటే పోరాడి సచ్చిబతుకుతాం"

"అయితే దొరభూమినిదున్నాలి- దున్నేవానిదేభూమి" అందరూ ఒక్కటై అన్నరు.

* * * *

దొరభూమిల ఎర్రజెండాలు మొలిసినయి.... నాగళ్ళ పాటలుపాడినయి. దొరగుండెల గుండుపడ్డది.

దొర ఖద్దరుబట్టలను కలిసిండు "మాదేముంది. అంతా అయిపోయింది.... కాని ఫలానాచోటికి పొమ్మన్నడు ఖద్దరుబట్టలాయన కాషాయవస్త్రాలను చూయించి.

దొర కాళ్ళు వణుకంగ.. కాషాయవస్త్రాలుండే కుటీరంలకు పోయిండు.... మేకతోలుకప్పుకున్న స్వాములవారు దర్శనమయ్యేసరికి బారెడుపొద్దు ఎక్కింది.. అయినా దొరకు ఆకలిగాని దప్పికగాని వేయలేదు. స్వాములవారి శాంత గంభీర రూపంచూసి ముగ్ధుడైపోయిండు దొర. దొర స్వాములవారి పాదపద్మాలకు సాగిలపడి "ప్రభూ మీరే మమ్మల్ని రక్షించాలి" అతి వినయంగా దీనంగా ప్రార్థించిండు.

స్వాములవారు తేరుకొని ఎడమచెవి కుండలం మెరియంగా సెక్రెటరీవేపోసారి చూపిండు. ఏంచేయాలన్నట్టు..

"ప్రభువీరు మన ప్రభుత్వానికి పునాదిరాయి వంటివారు మన పునాది రాయిని మనమే నాశనం చేసుకుంటామా ?" సెక్రెటరిగారు విన్నవించుకున్నరు.

"ఆఁహా.... అయితే మన సుస్థిరత్వానికి, మన ఆత్మగౌరవానికి, మన జాతి గౌరవానికి భంగకరమైనఏచర్యనూ మనం సమర్థించను. అరాచక శక్తులఆట కట్టించటా నికి కావలసిన సహాయము తక్షణమే చేయండి. కన్పిస్తేకాల్చేయండి." పట్టుబట్టల స్వాములవారు ఉగ్రరూపందాల్చి ఆర్డరేసిండు.

స్వాములవారి అనుజ్ఞమేరకు

దొరగారి ఊళ్ళో కాకిబట్టలేసుకున్న పీతిరిగద్దలు తుపాకులు వేలాడేసుకొని వాలాయి. కనిపించిన వాళ్ళందరిని వడితిరిగిన గోళ్ళతో ముక్కుతోరక్కి రక్తాలు కారేలాచేసాయి.

* * * *

దొర సర్కిల్‌తో రక్తంలాంటి బరండి తాగుతున్నడు. వేయించిన లేతకోడి మాంసము.... మేక కార్జముల పూరీలద్దుకొని దొర సర్కిల్‌గారి తుపాకిని చూస్తూ "తమరాసూరిగాన్ని లేకుంటా చెయ్యాలి.... వాడున్నంతసేపు నాకు నిద్దురుండదు" మనసులో మాటన్నడు.

"వాడ్నికూడా ఇలాసూపు వండుకొనితింటా" అని ఈది అమీన్‌లా వికృతంగా నవ్విండు సర్కిల్.

దొర సర్కిల్ మొఖంల చూసిండు.... మత్తుచేత ఎర్రబడ్డకండ్లు మూసుక పోతుంటే కావ్వెక్కిన ఎర్రటిముఖం భయంకరానందంగా అగుపించింది దొరకు..

ఆ నవ్వుకోలేక తాగినమైకంవల్లనోగాని దొరమనసు కుదుటపడింది.

* * * *

వూళ్ళోకి షికారుకువెళ్ళిన కాకిబట్టల పీతిరిగద్దలనుచూసి.... జానకమ్మ తలు పేసింది. అదిచూసిండు హెడ్డు. హెడ్డుగారి హెడ్డులో ప్రమోషన్ గురించేకాదు రాష్ట్రపతి పతకంకూడా మెదిలింది.

తలుపేసుకున్న జానకమ్మకు అడివిలనుండి పొయ్యిలకని కొట్టుకొచ్చిన కట్టెలమోపు కనిపించింది. 'అయ్యో ఫారెష్టువాళ్ళు రానేవచ్చారే ఈ కట్టెలమోపు ఎక్కడనిదాచేది' అని మథనపడింది.

తలుపుచప్పుడైంది

జానకమ్మ భయంతో బిగుసుకపోయింది.

తలుపు బలబలమంటు కూలింది. ఆచప్పుడు భయంతో ఎదురేగిన జానకమ్మ చెయ్యిని తొడను తొలుచుకుంటుపోయి పీతిరిగద్ద తుపాకిగుళ్ళు గోడలదిగినయి విల విల లాడుతూ జానకమ్మ నేలమీద పడిపోయింది. ఈ హడావిడికి ఇంట్లోనుండి బయటికొచ్చిన జానకమ్మ మొగుణ్ణి తుపాకీమడమ ఈడ్చిగుద్దింది. మరుక్షణంలో మూతిపళ్లిరిగి బళ్ళున రక్తంకక్కిండు. పక్కింట్లోనుంచి ఉరికొచ్చిన జానకమ్మ తమ్ముడు 'ఇదెక్కడి అన్యాయం ఉత్తపుణ్యానికి సంపుతాండ్లు' అని అడిగిండు.

"నక్సలైట్ లంజకొడుకా నడువుబే" అంటూ లాటీబతిప్పుతూ పీతిరిగద్దలు క్యాంపుకు లాక్కపోయినయి ముగ్గుర్ని.

సూరీడిగురించి ఆరా తీయటంకోసం బాగాబలిసిన పిడికిలి ఉపయోగించి యాష్టవొచ్చేదాకా గుద్దిండు. ఆతర్వాత కాళ్ళతో ఫుట్‌బాల్ ఆడి అదికూడ యాష్టకొచ్చి లాటీతో సాముచేసి.. చివరికి 'మాకేంతెల్వదు' అన్న సమాధానం తప్ప మరోటి పొందలేక అలసిపోయి నిద్దురపోయిండు.. శాంతి పరిరక్షకుడు సర్కిల్.

మరోరోజు

ఊరిచివరి మక్కపెరడును కంటికిరెప్పవోలె, కన్నబిడ్డతీర్గ కాపుకాస్తున్న మల్లయ్య పంటలను పాడుచేస్తున్న పిట్టలను కొట్టడానికి పొటాసుమందును ఉండచుట్టి రాయిమీదేసి బాదిండు.... అది అక్కడి ఆనవాయితీ.

'ఢాం' అని పెద్దగా చప్పుడయ్యింది.

పిట్టలులేచిపోయినయి.. గాలికి మక్కచేను కిలకిల నవ్వింది.

నిద్దురమొఖం పీతిరిగద్దలు దిగ్గునలేచినయి 'అదిగో అటువైపే' యస్. ఐ

'అవును ఆవైపునుండే వచ్చింది తూటా' హెడ్డువంతపాడిండు....

సర్కిల్ 'ఫైర్' అని అరిచిండు మూచ్చెముటలు పోయంగా.

ఇంకేముంది !

తుపాకులు టపటపలాడినయి. తూటాలు ఆకాశంలోకి, మక్కచేనులోకి, దిక్కున్నచోటికల్లా పారిపోయినయి.. బొక్కబోర్లపన్న పెద్దగద్దలేచి మెదసారించి ఆలోచన్లపడ్డది. అటువైపెవరూలేరని నిర్ధారించుకొని ట్రిగ్గర్ మీద చేతులుంచుకొని తిరుపతెంకన్నకు మొక్కుకొని ముందుకు కదిలింది,

మంచెమీది మల్లయ్య కిమ్మన్నాస్తి అయిపోయిండు. కళ్ళుతెరిచేసరికి చుట్టూరా పొగలుకక్కుతున్న తుపాకీ గొట్టాలు.

"ఏడిరా సూరీడు" సర్కిల్ కర్కశంగా

అర్థంకాక ఆకాశంవైపు చూయించిండు మల్లయ్య. మిట్టమధ్యాహ్నం సూరీడు నిప్పులు చెరుగుతాండు

"నఖరాలు చేస్తున్నావురా లంజకొడుకా.... మారో మాకెలవుడెకో"

తుపాకి మడమలు, లాఠీలు భరతనాట్యం చేసినయి.

మల్లయ్య కళ్లుతెరిచి చూసేసరికి కాగంతకడుపున్న సర్కిల్ చెక్కకుర్చీల యమధర్మరాజోలే కూచున్నడు.

"మంచిగా ఉన్నదిఉన్నట్టు చెప్పుబిడ్డా నిన్నిడ్చిపెడ్తం" నవ్వుమొఖం పెట్టిండు సర్కిల్.

"పిట్టలసుకొట్టడానికి తుపాకిమందు పేల్చింది నిజమే బాంచెను" గొంతు తడారిపోతుంటే మల్లయ్య.

'మళ్ళీఅదేమాట లంజకొడుకు మదమనగలేదు. మదమసుచుండ్లి అరిచిండు సర్కిల్.

చింతచెట్టు కొమ్మకు తలకిందుగా వేలాదేసినయి పీతిరిగద్దలు. మల్లయ్య అరిచి అరిచి చివరికి పిల్లిగొంతుపడి మాటాగిపోయేవరకు పీతిరిగద్దలు పీక్కతిన్నాయి.

మొఖంమీద చల్లటినీళ్లపడగానే కళ్ళుతెరిచిండు. తెలివచ్చినమల్లయ్యను రెండు కుర్చీలమధ్యరాడు 'కోళ్ళగుజి'వేసి వేలాదేసిండ్లు. పాదాలు చిట్లిపోయినయి నెత్తుర్లు కారినయి ముంజేతినికోసిన ఇనుపరాడు నరాలను పీకుతంది. మరోసారి ఈ లోకం మరిచిండు మల్లయ్య.

"లంజకొడుకు సావనైన సచ్చేట్టుందికాని ఒక్కమాటన్న మాట్లాడుతలేదు" యస్. ఐ.

అయ్యా శ్వాసబరువుగా ఆడుతంది' ముక్కుమీదవేలేసి చూసిన హెడ్డు అన్నడు.

"సత్తడా కొంపదీసి. సావనీ మనల్ని అడిగేదెవరు' సర్కిల్ తనలోనే గుసుక్కని బయిటికిమాత్రం 'వీడ్నితీస్కపోయి వాడిఇంటిముందు పదిలేసిరాండ్లి' ఆర్డరేసిండు.

మల్లయ్య తనింటిముందు చావుబతుకులమధ్య పడివున్నాడు తెల్లారేసరికి.

మరునాడు-

సర్కిల్‌ను కల్వబోయినదొర అక్కడున్న దినపత్రిక తిరిగేసి ఆశ్చర్యపోతూ "అదేమిటండీ మనవూళ్ళో ఎదురుకాల్పులా! ఎప్పుడుజరిగినయి ?" అంటూ బయటికి చదివిండు "చెల్కలో ఎదురుకాల్పులు, పోలీసులకు నక్సలైట్లకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఎవరికీ గాయాలుతగలలేదు, నక్సలైట్లు అడవులకు పారిపోయారు".

దొరవారి తెలివితక్కువతనానికి పోలీసుబుర్రినవ్వి "ఇందులోలాజిక్ మీకు అర్థంకాలేదనుకుంటా రేపెవడినన్న పట్టుకొని మనం కాల్చిచంపినా జనం పెద్దగా పట్టించుకోకుండా ఉండేందుకు."

"మొత్తానికి ఏమోఅనుకున్న మంచితెలివైనవారే" దొర మార్మికంగా నవ్విండు

*   *   *   *

ఆరోజు అగస్టు 30

చాలదూరంనుండి నడిచివచ్చిన సూరీడు జానకమ్మగాయాలను తడిమి ఓదార్చిండు. కమిలిపోయిన మల్లయ్య ఒళ్ళునునిమిరి.... మందురాసిండు. 'ఏమైనామనం పోరాడాలె' మల్లయ్య కలవరిస్తాండు. చుట్టు గుమిగూడిన జనాన్ని ఉద్దేశించి సూరీడు "మనం పోరాడాలి.... ఈ కన్నీళ్ళు, కష్టాలు చిత్రిహింసలుచూసి బెదిరిపోకూడదు. మనకీకష్టాలు కన్నీళ్ళు కొత్తకాదు. చిన్నచిన్న రోగాలకే మందులేక మనపిల్లలు కొంకిర్లుపోయి మనకళ్ళముందే విలవిల్లాడి చచ్చిపోతుంటే చూసాము. ఉడిగిపోయిన చేతులతో కడుపుకు తిండిలేక ఆకలికి వోర్చుకోలేక పీక్కపోయిన కడుపులతో ఆకలి ఆకలిఅంటూ మనతల్లిదండ్రిలు మనకళ్ళముందే కళ్ళుమూస్తుంటే చూసాము. రెక్కలు ముక్కలుచేసుకొని సాది సవరచ్చనచేసి పండించినపంటను దొరలు తోలుకపోతుంటే కాలేకడుపులతో గుడ్లనీళ్ళుకుక్కకుంటూ నిలబడ్డాము. ఇంతవరకు సుక్కచెమటంటే ఎరగని దొరలు మనచెమటను రక్తాన్ని కలుపుకొని విందువిలాసాల్లో మునిగి మనచెల్లెల అక్కల మానప్రాణాలతో ఆడుకుంటుంటే ఇదెక్కడి అన్యాయమని ఎదురుతిర్గి నిలబడ్డాం. అడుగడుగున చస్తూ బ్రితకలేమని మనమీద జరుగుతున్న దోపిడీకి అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాటంచేపట్టాం.... చావుమనకు సహజం. ఆకలితో రోగాలతో చచ్చేకంటే పోరాడిచస్తాం. ఇంతవరకు ఈ దొరలు మనమీద ఏ అన్యాయంచేసినా మారుపలకని ప్రభుత్వం దొరజులుంకు వ్యతిరేకంగా మనం పోరాడేసరికి తన పోలీసుబలగాలను పంపింది. ఎందుకు ? ఈదొరలనుకాపాడేదే ఈ ప్రభుత్వం దానిబలగం. ఈ తుపాకీపెత్తనాన్ని మనం అంతాఒక్కటయి

తుపాకితోనే ఎదుర్కోవాలి. అందుకు మనకుప్రజాసైన్యం కావాలి.... మనమంతా సాయుధులమై ప్రజాసైన్యంలో కలవాలి" సూరీడు ఆవేశంగా చెపుతుంటే....

అందరి రక్తము పొంగుతూంది.

అంతలకే బయట అలజడి

మానవరక్తాన్ని రుచిమరిగిన బొల్లిగద్ద కాషాయవస్త్రాల ముసుగేసుకొని, పీతిరి గద్దలను వెంటేసుకొనివచ్చి ప్రజలమీద తుపాకులు పేల్చింది....

సూరీడు రక్తము చిందించాడు. ప్రాణహిత కన్నీరుమున్నీరుగా ఏడ్చింది.. నేలకూలిన సూరీడి ప్రతినెత్తురుబొట్టులో తననీడను చూసుకుంటున్న సూరీడు, ఆకాశంలో వేలవేల రూపాలుగా వడివడిగా అడుగులేస్తూ భూమి నాలుగు చెరుగులా వ్యాపిస్తున్న సూరీడు, సుధాకరుడై ఆకాశంలోకెగబాకాడు.

(ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు తాలూకా పిన్నారం గ్రామంలో పోలీసు కాల్పుల్లో అమరుడైన కా॥ పల్లె కనకయ్య (సుధాకర్) స్మృతిలో)

(3వ కవరు తరువాయి)

అంకమ్మ[3] సోచెల్లె
అసలుమాట చెప్పింది
రక్కసిపోలీసోడు
తరిమి నిన్ను కాల్చిండని
అంకన్న[4] చెప్పిండు
ఆవేదననణచుకొని
పోరుబాట ఇడువనని
ఎర్రజెండ దించనని ॥పల్లె పల్లె॥

కండ్లనీళ్లు పెట్టినోళ్లు
లేరంటే నమ్మ నమ్మ
చెన్నూరు అడవుల్లో
ఎర్రపూవై పూసినావు
ప్రాణహిత నీమీద
పాటలెన్నో పాడుతోంది ॥పల్లె పల్లె॥

నువ్వు నడిచినబాట
జనంబాట జయంబాట
నువ్వు చెప్పినమాట
పల్లె పల్లె ప్రతినోట
ఎర్రజెండ ఎత్తిపట్టి
మునుముందుకె సాగుతాము
పల్లె పల్లె తిరిగినావు
పల్లె కనుకన్నో పల్లె కనుకన్నా
పల్లెలెన్నో లేపినావు
పల్లె కనుకన్నో పల్లె కనుకన్నా

3,4 పిన్నారం సంఘటనకు సాక్షులు

స్మృతి గీతం !

పల్లెగుండె

సీరపాణి

పల్లెపల్లె తిరిగినావు
పల్లెకనుకన్నో పల్లెకనుకన్నో
పల్లెలన్నా లేపినావు
పల్లెకనుకన్నో పల్లెకనుకన్నో
కూలితల్లి బిడ్డవీవు
చదువుసంచె ఇడిసిపెట్టి
కూలినాలి బతుక్కొరకు
పోరులోన కలిసినావు ॥పల్లె పల్లె॥

కన్నూర్లో పుట్టిపెరిగి
పోరాటం నేర్చినావు
చెన్నూరుకు వచ్చినావు
పల్లెల్లో కలిసినావు
పిన్నారం పారిపెల్లి
సిరుసా బబ్బెరిచెలుకా
రాజారం కొత్తపల్లి
అక్కపల్లి చింతపల్లి
ఊళ్లన్నీ తిరిగి తిరిగి
కూలోళ్లను కూడగట్టి
భూస్వాములనెదిరించి
జీతాలను పెంచినావు ॥పల్లె పల్లె॥

జంగ్లాతు చౌకిదార్ల
అన్యాయాలెదిరించి
ఎడగట్టు గొల్లోళ్ల
పుల్లర్లు దించినావు


అబ్కారి గుత్తెదార్ల
జులుం వదలగొట్టినావు
తునికాకు రేట్లుపెంచి
జనం బిడ్డవైనావు
రైతన్నల చేతుల్లో
పలుగు పారవైనావు ॥పల్లె పల్లె॥

పిన్నారం ఊరిలోని
ఆసుమాన్ తరిపొలాల్లా[1]
బబ్బెర చెలుకాలోని
ఎర్రనేల చెలుకల్లో
రక్తమంత చెమటైనా
తెల్లాని రైతుబతుకు
బరువెల్లని కూలిజనం
కష్టాలను చూసినావు
సంఘాలను పెట్టినావు
ప్రజల్లోన కలిసిపోయి
పోరాటం నడిపినావు ॥పల్లె పల్లె॥


గుండెచిల్లి[2] పడ్డగాని
గుండె జారిపోలేదు
ఊపిరాడకున్నగాని
అడుగు వెనుకకెయ్యలేదు
ప్రజ అడుగులో అడుగులేసి
పోరుదారు లేసినావు ॥పల్లె పల్లె॥

(మిగత 84వ పేజీలో)


1. ఆకాశం (వర్షాధారం) మీద ఆధారపడిన మాగాణి
2. గుండెలోనివాల్వ్ చెడిపోయి హృద్రోగంతో బాధపడుతున్నాడు.



SRJANA Telugu Monthly
Agu /Sep. '83 H/HNK-3
Regd. No. with Registrar of
Newspepars 10953/67



Single copy Rs. 3-00
Yearly Subscription Rs. 20-00



SRJANA
Hanumakonda 506001